ఆదివారం
20•08•2017
హైదరాబాద్
• వెల.6 రూ.
• సంపుటి 7 • సంచిక 74
• పేజీలు : 20 + 24 + 36 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఆదివారం
20•08•2017
హైదరాబాద్
• వెల.6 రూ.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD



జై కిసాన్.. జై కేసీఆర్

ఐసీఎఫ్ఏ 'వ్యవసాయ నాయకత్వ అవార్డు'కు ఎంపికైన రైతు బాంధవుడు

వ్యవసాయరంగంలో విప్లవాత్మక విధానాలతో లక్షలమంది రైతుల జీవితాల్లో మార్పునకు నాంది

గ్రామీణ వ్యవస్థను పటిష్టపర్చేందుకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక అవార్డు

వచ్చే నెల 5న ఢిల్లీలో ప్రదానం

వ్యవసాయరంగం దశ దిశ మార్చివేసిన రైతు బిడ్డ

తొలి ఏడాదిలోనే కరెంటు సమస్యకు పరిష్కారం

సాగునీటి ప్రాజెక్టులతో కోటి ఎకరాల మాగాణి లక్ష్యం

చెరువుల అభివృద్ధికి మిషన్ కాకతీయ

ఏడాదికి రూ.8 వేలు పెట్టుబడి.. విప్లవాత్మక నిర్ణయం

రైతు సంఘాల ఏర్పాటు ఆలోచనతో రైతన్నకు భరోసా

న్యూఢిల్లీ, హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వ్యవసాయరంగం దశను మార్చి, కొత్త పథాన్ని నిర్దేశించిన రైతు బాంధవుడు, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు భారత ఆహార-వ్యవసాయ మండలి (ఐసీఎఫ్ఏ) అరుదైన గౌరవం కల్పించింది. ఏటా వివిధ విభాగాల్లో అవార్డులను ప్రదానం చేసే ఈ సంస్థ వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి చేసే కృషికి గుర్తింపుగా ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'వ్యవసాయ నాయకత్వ అవార్డు'కు ఈ ఏడాది కేసీఆర్‌ను ఎంపికచేసింది. ఈ మేరకు ఒక లేఖను సీఎం కేసీఆర్‌కు పంపింది. సంస్థ పదో గ్లోబల్ అగ్రికల్చరల్ లీడర్‌షిప్ సమ్మిట్-2017 సందర్భంగా వచ్చేనెల ఐదో తేదీన కేసీఆర్‌కు ఈ అవార్డు అందజేయనున్నారు. హరిత విప్లవ పితామహుడిగా ప్రఖ్యాతి పొందిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్మెస్ స్వామినాథన్ అధ్యక్షతన 20 మంది సభ్యులతో కూడిన 'గ్లోబల్ అగ్రికల్చరల్ సమ్మిట్ అవార్డు కమిటీ' సీఎం కేసీఆర్‌ను 'పాలసీ లీడర్‌షిప్ అవార్డు'కు ఎంపికచేసింది. తెలంగాణ వ్యవసాయరంగంలో విప్లవాత్మక విధానాలను ప్రవేశపెట్టి, అమలుచేయడంద్వారా సీఎం కేసీఆర్.. లక్షలమంది రైతుల జీవితాల్లో మార్పునకు నాంది పలికారు. గ్రామీణ వ్యవస్థను పటిష్టపర్చేందుకు చేస్తున్న కృషికిగాను ఆయనను ఈ అవార్డుకు ఎంపికచేసినట్టు ఐసీఎఫ్ఏ చైర్మన్ డాక్టర్ ఎంజే ఖాన్ పేర్కొన్నారు. ఢిల్లీలోని తాజ్ ప్యాలస్ హోటల్‌లో సెప్టెంబర్ 5 నుంచి రెండ్రోజులపాటు జరిగే పదో గ్లోబల్ అగ్రికల్చరల్ సమ్మిట్ సందర్భంగా తొలిరోజు సాయంత్రం

మిగతా 4వ పేజీలో

"ప్రతిష్ఠాత్మక అగ్రికల్చర్ పాలసీ లీడర్‌షిప్ అవార్డు-2017కు ఎంపికైన సీఎం కేసీఆర్‌కు అభినందనలు. వ్యవసాయ రంగ అభివృద్ధికోసం కేసీఆర్ చిత్తశుద్ధితో చేపడుతున్న కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది."



- నరసింహన్, గవర్నర్

5

"వ్యవసాయరంగంలో నెలకొన్న సమస్యలపై పోరాటంచేస్తూ.. ఆశించిన ఫలితాలు సాధిస్తున్నందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ అవార్డు లభించింది."



- పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి

భూ విజయం!

బంజారాహిల్స్ స్థలం కేసు సుప్రీంలో సుఖాంతం

చెరవీడిన 750 కోట్ల విలువైన 15 ఎకరాలు

సీఎం కేసీఆర్ జోక్యంతో పేదలకు న్యాయం

ఎన్టీటీ నగర్, రేషంబాగ్ బస్తీవాసులకు దక్కనున్న హక్కులు


మూడేండ్లలో 50 వేల కోట్ల విలువైన భూమిని రక్షించిన ప్రభుత్వం

ఒక్క బంజారాహిల్స్‌లోనే 300 స్థలాల్లో స్వాధీన బోర్డులు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/ బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ:

రెండేండ్ల క్రితం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ బస్తీకి సీఎం కే చంద్రశేఖర్‌రావు స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి వచ్చారు. ఆ సందర్భంగా ప్రజలు విన్నపాలు చేసుకున్నారు. వినతిపత్రాలు ఇచ్చారు. వాటిలో అత్యధికం తమ ఇండ్లను క్రమబద్ధీకరించి పట్టాలు ఇప్పించాలనేవే. ఆ విన్నపాలు వృథా కాలేదు. సీఎం కేసీఆర్ వాటన్నింటినీ సమీక్షించారు. ఆ పేదల ఇండ్లకు వెంటనే పట్టాలివ్వాలని అదేశించారు. అధికారులు సాధ్యం కాదని నీళ్లు నమిలారు. కారణం ఆ భూములు

మిగతా 10వ పేజీలో



హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ -12లో చెరవీడిన బస్తీలు ఇవే



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గోవిందరావుపేట-పస్రా గ్రామాల మధ్య శనివారం జాతీయరహదారిపై సల్ల ఒర్రె ఉప్పొంగగా నిలిచిన వాహనాలు



ములుగు మండలం పంచోత్కులపల్లి గ్రామం వద్ద కాజ్‌వే దాటే ప్రయత్నంలో వరదలో చిక్కుకున్న ఓ కానిస్టేబుల్. సహచరుల సాయంతో ఆయన ఒడ్డుకు చేరుకున్నారు.

వాన జోరు

పొంగిన వాగులు, వంకలు

ఏటూరునాగారంలో అత్యధికంగా 9 సెంటీమీటర్లు

సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

బంగాళాఖాతంలో అల్పపీడనం

రాష్ట్రంలో నేడు భారీ నుంచి అతిభారీ వర్షాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనితో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా తొమ్మిది సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని సీతమ్మ నారచీరెల ప్రాంతం నీట మునిగింది. భూపాలపల్లి జిల్లా ములుగు మండలం పంచోత్కులపల్లి గ్రామం వద్ద కాజ్‌వే దాటే ప్రయత్నంలో ఓ కానిస్టేబుల్ కొట్టుకుపోతుండగా సహచరులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. వర్షం కారణంగా సింగరేణి ఓపెన్‌కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి

మిగతా 10వ పేజీలో

త్వరలో మరో ఏరోస్పేస్ సెంటర్

రక్షణ, వైమానిక రంగాల హబ్‌గా హైదరాబాద్

టీఎస్ ఐపాస్‌తో 15 రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు

రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలిపేందుకు సీఎం కేసీఆర్ కృషి

రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్

ఆదిబట్ల:

ఏరోస్పేస్ రంగంలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధిని సాధిస్తూ ముందుకు దూసుకుపోతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఆదిబట్ల-నాదర్‌గుల్ ఇండస్ట్రియల్ పార్కులో శనివారం న్యూకాన్ ఏరోస్పేస్ యూనిట్‌ను హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, కేంద్ర రక్షణ శాఖ మాజీ మంత్రి పల్లంరాజుతో కలిసి ప్రారంభించారు. అనంతరం న్యూకాన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ జలాన్‌తో కలిసి మిసైల్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా న్యూకాన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఆదిబట్లలో ఒకటి, శంషాబాద్‌లో మరొకటి.. మొత్తం రెండు ఏరోస్పేస్ సెంటర్లు ఉన్నాయని, త్వరలోనే మూడో ఏరోస్పేస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. నగరాన్ని రక్షణ, వైమానిక రంగాల

ఆదిబట్లలో న్యూకాన్ ఏరోస్పేస్ మిసైల్ యూనిట్ ప్రారంభం

హబ్‌గా మార్చుతున్నామని అన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ అనువైన ప్రదేశమని కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకోసం పారిశ్రామికవేత్తలను ఆకర్షించేలా టీఎస్ ఐపాస్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదని చెప్పారు. దీని ద్వారా పదిహేను రోజుల్లోనే కొత్త పరిశ్రమల

మిగతా 10వ పేజీలో



శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఆదిబట్ల-నాదర్‌గుల్ ఇండస్ట్రియల్ పార్కులో న్యూకాన్ ఏరోస్పేస్ మిసైల్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కే తారకరామారావు



ఉత్తర ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో పట్టాలు తప్పిన ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్

యూపీలో రైలు ప్రమాదం

పట్టాలు తప్పిన ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్

23 మంది మృతి

8

ఎన్డీయే గూటికి నితీశ్

జేడీయూ జాతీయ కార్యవర్గ సమావేశంలో అధికారికంగా తీర్మానం

మోదీ క్యాబినెట్‌లో మంత్రి పదవులు దక్కే అవకాశం

సమాంతర భేటీ నిర్వహించిన శరద్‌యాదవ్

రైతు బాంధవుడికి పట్టం



అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డుకు తెలంగాణ సీఎం ఎంపిక

ఇది.. భూమి పుత్రుడికి దక్కిన గౌరవం • వ్యవసాయరంగంలో కేసీఆర్ కృషికి కేంద్రం ఫిదా

- విప్లవాత్మక పథకం.. పంటలకు పెట్టుబడి • దేశవ్యాప్త అమలుకు పలువురి సూచనలు
- అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనకు సర్వే • ప్రాజెక్టులను పరుగులు పెట్టిస్తున్న తీరుపై సర్వత్రా హర్షం
- రైతుకు లాభం చేకూర్చేలా క్రాప్ కాలనీలు • అన్నదాతలను ఏకం చేసే రైతు సమాఖ్యలు
- ఏడాదిలోనే దూరమైన కరెంటు కష్టాలు • మూడేండ్ల స్వపాలనలో పచ్చబడుతున్న రాష్ట్రం
- బంగారు తెలంగాణ నిర్మాణానికి వేగంగా అడుగులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇది తెలంగాణ రైతులందరి సంబురం! సొంతరాష్ట్రంలో స్వపరిపాలనలో రైతన్నల బతుకులు ఎంత పచ్చగా ఉంటాయో నిరూపించిన భూమి పుత్రుడికి దక్కిన అరుదైన గౌరవం! భూమిని నమ్ముకున్న రైతును రాజు చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ (ఐసీఎఫ్ఏ) శనివారం ప్రకటించిన అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు.. వ్యవసాయరంగ అభివృద్ధిపై ఆయన తపనకు నిదర్శనం! ఈ అవార్డు తొలి గ్రహీత, దేశ హరితవిప్లవ పితామహుడు ఎమ్మెస్ స్వామినాథన్ అధ్యక్షతన ఉన్న ఎంపిక కమిటీ ఈసారి కేసీఆర్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేయడం.. తెలంగాణ వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు భారత వ్యవసాయరంగంలో అత్యంత అనుభవజ్ఞుడైన స్వామినాథన్ ఆమోదాన్ని చెప్పకనే చెప్పినట్లు! ఏండ్ల తరబడి పడావుపడిన భూములకు పచ్చని రంగేయడంలో తెలంగాణ రథసారథి అనుసరించిన వ్యూహాలు, అన్నదాతలకు అండగా నిలుస్తున్న తీరుకు దేశవ్యాప్తంగా రైతాంగం నుంచి అభినందనలు వెల్లువెత్తుతుండగానే.. అందరికీ విస్మయం కలిగించే రీతిలో.. పాలకులు ఇలాంటి నిర్ణయాలు కూడా తీసుకుంటారా? అనే సంభ్రమాశ్చర్యాలు కలిగిస్తూ ఎకరానికి ఏటా రూ.8వేల పెట్టుబడి పథకాన్ని ముందుకు తెచ్చారు కేసీఆర్. తద్వారా దేశ వ్యవసాయరంగంలో సరికొత్త అధ్యాయానికి తెరతీశారు. ఇచ్చిన మాట నిలుపుకొంటూ రూ.17వేలకోట్ల పంట రుణాలు మాఫీ చేసిన కేసీఆర్.. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపించారు. తాను స్వయంగా రైతు కావడంతో రైతుల అవసరాలెరిగి.. పక్కా ప్రణాళికతో వ్యవసాయరంగాన్ని ముందుకు దూకిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి వేధించిన కరెంటు కష్టాలు తొలి ఏడాదే కనుమరుగయ్యాయి. ఒక్కొక్కటిగా సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తున్నాయి. ఓ వైపు పెట్టుబడికి చేయూత, మరోవైపు రైతుకు గిట్టుబాటు ధర వచ్చేలా రైతు సంఘాల ఏర్పాటుతో దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలిపేలా అలుపెరుగని ప్రయాణం కొనసాగిస్తున్నారు. సీఎం కేసీఆర్ మూడేండ్ల పాలనలో వ్యవసాయరంగంలో కీలక మార్పులను అవలోకనం చేసుకుంటే..



రైతు ముఖ్యమంత్రి

కేసీఆర్ స్వయంగా రైతు. ఈ విషయంలో తన తండ్రినే ఆదర్శంగా తీసుకున్నారు. వ్యవసాయంపై సీఎంకు ఎంతో మక్కువ. ఎమ్మెల్యేగా ప్రజాజీవితంలోకి రానప్పటినుంచే కేసీఆర్ వ్యవసాయం చేసేవారు. రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా.. తానెంతో ఇష్టపడే వ్యవసాయానికి సమయం కేటాయిస్తూనే ఉన్నారు. ఎర్రవల్లిలోని తన వ్యవసాయక్షేత్రాన్ని ఆధునిక పద్ధతులతో ప్రయోగశాలగా మార్చారు కేసీఆర్. అల్లం, బొప్పాయి, కలర్ క్యాప్సికం తదితర అనేక వినూత్న పంటలను పాలీహౌజ్ వంటి నూతన పద్ధతుల్లో పండించి ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారు. ఇజ్రాయెల్‌లో అనుసరించే పంటల విధానాల సాగుతో పలువురికి మార్గదర్శకులయ్యారు. సీఎం కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకునే వ్యవసాయంలో అడుగుపెట్టామని క్రికెటర్ అంబటి రాయుడువంటి ఎంతోమంది యువరైతులు చెప్పడం మనకు తెలిసిందే.

ఎకరానికి రూ.4వేల పెట్టుబడి నిర్ణయంతో సంచలనం

‘తెలంగాణ రాష్ట్రం ఉన్నన్ని రోజులు.. రైతులే మాకిక వద్దు.. అనేంతవరకూ రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఎకరానికి ఒక్కో సీజన్‌కు రూ.4వేల చొప్పున వ్యవసాయ పెట్టుబడి ఇస్తాం’ అంటూ సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన దేశంలో పెను సంచలనం సృష్టించింది. రాష్ట్ర రైతులతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ రైతన్నలు ఈ నిర్ణయంపై ప్రశంసలు కురిపించారు. నీతిఆయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు కేసీఆర్ ఢిల్లీకి వెళ్లినప్పుడు ఏకంగా 11 రాష్ట్రాల సీఎంలు.. ‘రావు సాబ్.. పంటలకు పెట్టుబడి పథకం వివరాలు మాకూ చెప్పండి’ అని కోరారు. ఇదిచాలు వ్యవసాయిక సంస్కరణల్లో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తున్నదనటానికి! పెట్టుబడి పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతుల పూర్తి వివరాలు సేకరించి, పథకాన్ని పకడ్బందీగా ప్రారంభించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తున్నది. వచ్చే వానాకాలంనుంచి రైతన్నలకు పెట్టుబడి ధీమా దొరుకబోతున్నది. మరోవైపు.. రైతులను సంఘటిత శక్తిగా మార్చి, పండించిన పంటకు రైతే ధర నిర్ణయించే దిశగా రైతు సంఘాల ఏర్పాటు నిర్ణయంతో సీఎం కేసీఆర్ తెలంగాణలో భవిష్యత్తు వ్యవసాయం ఎలా ఉండాలని కోరుకుంటున్నారో చెప్పకనే చెప్పారు.

రుణమాఫీపై మాట నిలుపుకొన్నారు..

దేశ చరిత్రలో ఎక్కడాచేయని విధంగా దాదాపు 36 లక్షల మంది రైతుల రూ.17వేల కోట్ల వ్యవసాయ రుణాన్ని మాఫీ చేయడం ద్వారా కేసీఆర్ ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకున్నది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష వరకు రైతులు తీసుకున్న రుణాలన్నింటినీ ప్రభుత్వం మాఫీచేసింది. చిట్టచివరి వాయిదాను ఏకమొత్తంగా ఇచ్చి మాటపై నిలబడింది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోనూ అక్కడి అధికారపక్షం రుణమాఫీ హామీ ఇచ్చినా మొత్తం రూ.24 వేల కోట్లకుగాను ఇప్పటి వరకూ రూ.11వేల కోట్లు మాత్రమే మాఫీ చేయగలిగింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం వందశాతం హామీని నెరవేర్చింది. రుణమాఫీ పూర్తిచేసినందుకు కృతజ్ఞతలు తెలుపడానికి ప్రగతిభవన్‌కు వచ్చిన రైతన్నలతో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ ‘రైతులకు పెట్టుబడి భారంగా ఉంది. ఆ భారాన్ని పంచుకోవాలని నిర్ణయించాం. రైతు బాగుపడితేనే బంగారు తెలంగాణ వస్తది. ఈ రోజు చారిత్రాత్మక నిర్ణయం ప్రకటిస్తున్నా. తెలంగాణ ఉన్నంత కాలం రైతాంగానికి నూరుశాతం ఉచితంగా ఎరువులు అందిస్తాం’ అని చెప్తూ ఆశ్చర్యపర్చారు.

క్రాప్‌కాలనీ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

అప్పుల ఊబిలోకి నెట్టే మూస విధానాలనుంచి రైతులను లాభాల పంటలవైపు మళ్లించేందుకు సీఎం కేసీఆర్ ముందుచూపుతో క్రాప్‌కాలనీలపై దృష్టిపెట్టారు. మన ఆహార అవసరాలకు తగ్గట్టుగా అన్ని పంటలు మన దగ్గరే పండించుకునేలా రాష్ట్రాన్ని క్రాప్‌కాలనీలుగా మార్చేందుకు అవసరమైన ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులకు ఇస్తున్న సూచనలు సత్ఫలితాలిస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ పరిసర జిల్లాల్లో కొన్ని మండలాలను క్రాప్ కాలనీలు చేసి, కూరగాయలు సాగుచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని యాచారం, ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల్లో మొత్తం 3,500 ఎకరాల్లో కూరగాయలు పండించేలా ఏర్పాటుచేశారు. మరోవైపు రైతులనుంచి నేరుగా కొని, తాజా కూరగాయలను తక్కువ ధరకే ప్రజలకు అందించేలా ‘మన కూరగాయలు’ పేరుతో ఔట్‌లెట్లను మార్కెటింగ్‌శాఖ అందుబాటులోకి తెచ్చింది. దేశం మొత్తాన్ని భూముల రకాలు, వాతావరణం, నీళ్లు, అవసరాలు తదితరాలను ఆధారంచేసుకుని పంటకాలనీలుగా విభజిస్తే రైతుకు లాభసాటిగా ఉంటుందని నీతి ఆయోగ్ సమావేశం తర్వాత ప్రధాని మోదీకి చెప్పినట్టు కేసీఆర్ ఓ సందర్భంలో అధికారుల సమావేశంలో వెల్లడించారు. క్రాప్‌కాలనీలకు సీఎం కేసీఆర్ ఇస్తున్న ప్రాధాన్యం దీన్ని బట్టి అర్థంచేసుకోవచ్చు.

మార్కెటింగ్‌శాఖ ద్వారా రైతులకు సంపూర్ణ సహకారం

ఉమ్మడి రాష్ట్రంలో నాలుగు లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాంలు మాత్రమే ఉండేవి. తెలంగాణ ఏర్పడిన తర్వాత రూ.1024 కోట్ల నాబార్డు రుణంతో యుద్ధప్రాతిపదిక 330 గోదాంల నిర్మాణం చేపట్టింది. వీటిలో ఇప్పటికే 300 గోదాంల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి కూడా నిర్మిస్తే రాష్ట్రంలో గోదాంల నిల్వ సామర్థ్యం 21.50 లక్షల టన్నులకు చేరుకుంటుంది. అదనంగా మరో 34 గోదాంల నిర్మాణానికి ప్రతిపాదనలున్నాయి. జాతీయస్థాయిలో తెలంగాణ రైతు తన పంటను అమ్ముకొనేలా జాతీయ వ్యవసాయ మార్కెట్ (ఈ-నామ్) విధానాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలుచేస్తున్నది. ఇది ప్రస్తుతం 44 మార్కెట్లలో అమల్లో ఉంది. అధికారిక సమాచారం ప్రకారం ఏప్రిల్ 1, 2017నాటికి ఈ-నామ్ విధానంలో రూ.3229కోట్ల వ్యాపారం జరిగింది. నిజామాబాద్ మార్కెట్‌కు జాతీయస్థాయిలో అవార్డు సైతం దక్కింది. దేశంలోనే తొలిసారిగా మార్కెట్ కమిటీల చైర్మన్ల నియామకంలో రిజర్వేషన్లను ప్రభుత్వం అమలుచేసింది. అంతేకాదు.. మహిళలకు ప్రాధాన్యం కల్పించింది.

సమగ్ర రైతు సర్వే

రాష్ట్రంలో రైతులు ఎందరు? వారి ఆధీనంలో ఉన్న భూములెన్ని? ఏ పంటలు పండుతున్నాయి? ఏయే నీటి వనరులున్నాయి? ఏ పరికరాలు ఉన్నాయి? ఆదాయ వనరులేంటి? ఇలా సమస్త సమాచారాన్ని సేకరించేలా వ్యవసాయశాఖతో సీఎం సమగ్ర రైతు సర్వే చేయించారు. సర్వే ఇప్పటికే పూర్తయింది. గత ప్రభుత్వాల మాదిరిగా కాకి లెక్కలుకాకుండా పక్కా సమాచారం అందుబాటులోకి వచ్చింది. ఇది కేసీఆర్ మరో ప్రగతిశీల ఆలోచన. ఇకపై వ్యవసాయరంగంలో తెచ్చే ప్రతి పథకానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించే వీలుంది. ఏఈవోలు ఇంటింటికీ వెళ్లి ట్యాబ్‌ల్లో నిక్షిప్తం చేసిన సమాచారాన్ని డిజిటలైజ్ చేస్తున్నారు.

తెలంగాణ ఏర్పడిన మూడేండ్లలో ప్రధాన ప్రాజెక్టుల కింద సాగులోకి వచ్చిన ఆయకట్టులో మచ్చుకు కొన్ని

- సింగూరు కాల్వలద్వారా 30వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పనులు పూర్తయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా అందోల్ నియోజకవర్గంలో సుమారు 40వేల ఎకరాల్లో వరి పంటవేశారు.
- తెలంగాణ వచ్చిన తర్వాత నిజాంసాగర్ యాసంగి రికార్డు సృష్టించింది. 2016-17లో ప్రాజెక్టు చరిత్రలోనే గరిష్ఠ సాగు నమోదైంది. ఈ దఫా ఏకంగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని 27 మండలాల్లో 2.10 లక్షల ఎకరాల్లో రైతన్న ఏరువాక సాగించాడు.
- రికార్డు స్థాయిలో కడెం ప్రాజెక్టు కింద ఈ ఏడాది 87,056 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించారు.
- ఈ ఏడాది ఎస్సారెస్పీ ఆయకట్టు కింద 12.50 లక్షల ఎకరాలు సాగులోకి రావడం ప్రాజెక్టు చరిత్రలోనే తొలిసారి.

యజ్ఞం మొదలైంది



‘**రాష్ట్రంలోని** 55.49 లక్షల కుటుంబాల భవిష్యత్తును మార్చే యజ్ఞం ఇప్పుడు మొదలవుతున్నది. మనమంతా ఇప్పుడు బాధ్యత తలకెత్తుకుంటున్నాం. వ్యవసాయశాఖ మంత్రి, సెక్రటరీ, కమిషనర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వారికి, వ్యవసాయశాఖలో తలపండిన ఉద్యోగులకు నేను రెండు చేతులు జోడించి ప్రార్థిస్తున్నా. వ్యవసాయశాఖ పనితీరు మారాలి. పంట సాగు చేయడం పసిపిల్లను సాదినట్టే ఉంటది. కాబట్టి ఎప్పటికప్పుడు ఏ పద్ధతులు అవలంబించాలన్నదానిపై ప్రణాళికలు తయారుచేయండి. క్షేత్రస్థాయిలో ఉండే ఏఈవోలు ఇచ్చే సమాచారాన్ని నమ్ముదాం. ఏ చర్యలు తీసుకోవాలన్నదానిపై ప్రతి 15 రోజులకోసారి, లేదంటే వారానికోసారి క్షేత్రస్థాయిలో ఉండే ఏఈవోల ద్వారా సమాచారం తెప్పించి, దానిపై సమీక్షించేలా ప్రణాళికలు రూపొందించాలి. ఈ అంశాలపై మళ్లీ మనం కలుసుకుందాం. ప్రగతిభవన్‌లో మళ్లీ సమావేశమవుదాం’.

- హెచ్ఐసీసీలో వ్యవసాయాధికారులతో నిర్వహించిన సమావేశంలో సీఎం కేసీఆర్..

సాదాబైనామాలతో పేద రైతుల భూములకు చట్టబద్ధత

ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 6.18 లక్షల మంది రైతులకు సొంత భూమి ఉన్నా.. భూ యాజమాన్య హక్కులుండేవి కావు. దీంతో ప్రభుత్వం నుంచి లభించాల్సిన సబ్సిడీలు అందని పరిస్థితి ఉండేది. రాష్ట్రావిర్భావం అనంతరం పాలనాపగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్.. దీనిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి, సాదాబైనామాలద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్‌చేసి, పట్టాదారు పాసుపుస్తకాలను అందజేసే విధానాన్ని అమలులోకి తెచ్చారు. ఈ విధానంతో పేద రైతులంతా తమ భూమిపై యాజమాన్య హక్కు పొందగలిగారు. రాష్ట్రంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు 11,19,111 దరఖాస్తులురాగా, వీటిలో 6,18,166 దరఖాస్తులను ప్రభుత్వం ఆమోదించి.. యాజమాన్యహక్కులు కల్పించింది. భూములకు చట్టబద్ధత లభించడం ద్వారా వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే అవసరం రైతులకు లేకుండా పోయింది. బ్యాంకులద్వారా వ్యవసాయ రుణాలు పొందే వీలు కలిగింది.

ప్రాజెక్టులతో పచ్చని తెలంగాణ

సమైక్య రాష్ట్ర పాలకుల నిర్లక్ష్యం కారణంగా బీడు భూములతో నెర్రెలుబారిన తెలంగాణ రూపం.. స్వరాష్ట్రంలో పూర్తిగా మారిపోయింది. పచ్చని తెలంగాణ వైపు అడుగులు వడివడిగా పడుతున్నాయి. కరువు రక్కసి బారిన పడి లక్షల మంది వలసపోయిన పాలమూరు లాంటి చోట్ల సిరుల పంట చూసి రైతన్నల కండ్లు ఆనందంతో తడుస్తున్నాయి. తెలంగాణ ఏర్పడే నాటికి కేవలం 3.23 లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. మరో 1.07 లక్షల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. కానీ ఆపై ఏడాది కాలంలోనే తెలంగాణ సర్కారు చేపట్టిన చర్యలతో ఒక్క సంవత్సరంలో 5,69,397 ఎకరాల ఆయకట్టు కొత్తగా సాగులోకి వచ్చింది. 2016-17లో 6.70 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతోపాటు మరో 2.20 లక్షల ఎకరాల స్థిరీకరణకు సాగునీటిని సరఫరా చేసింది. వచ్చే ఏడాది ఏకంగా 9.67 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధమైంది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి తొలి ఏడాది రూ.8,500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. రీడిజైనింగ్ కొలిక్కి రావడంతో 2016-17 నుంచి ఏటా రూ.25వేల కోట్లను కేటాయించడం సంప్రదాయంగా మార్చుకుంది. దేశంలోనే సాగునీటి ప్రాజెక్టులకు అత్యధికంగా నిధులను తెలంగాణ ప్రభుత్వం కేటాయిస్తున్నదంటూ అసోచామ్ వంటి సంస్థలు సైతం కితాబునిచ్చాయి.

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు మేలు చేసేలా తీసుకున్న ప్రధాన నిర్ణయాలు

- రైతులే తమ పంటకు సరైన ధరను నిర్ణయించుకునేలా గ్రామ రైతు సంఘాల కలయికతో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో రైతు సమాఖ్యల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ధరల్లో హెచ్చుతగ్గులున్నప్పుడు రైతును ఆదుకునేలా రాష్ట్ర రైతు సమాఖ్యకు బడ్జెట్‌లో రూ.500కోట్లు కేటాయిస్తామని సీఎం చెప్పారు.
- రాష్ట్రంలో ఏ రైతు ఏ గుంటలో ఏ పంట వేశాడో కూడా వ్యవసాయ విస్తరణాధికారి నుంచి సీఎం వరకు ఎప్పటికప్పుడు సమాచారం ఉండేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుచేస్తున్నారు. ఇందుకోసం రైతు సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.
- ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని దాదాపు 36 లక్షల మంది రైతులకు మేలు చేసేలా రూ.17వేల కోట్ల రుణాలను మాఫీ చేశారు.
- వ్యవసాయ బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయ యాంత్రీకరణకు నిధులను ప్రభుత్వం ఏటా పెంచుతున్నది. వ్యవసాయ యాంత్రీకరణకు 2016-17లో రూ.250కోట్లు కేటాయిస్తే.. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.300కోట్లుకు పెంచింది.
- అడ్డగోలు ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతోపాటు రైతు తన పొలానికి ఏ పోషకాలు ఎంత అవసరమో తెలియజేసే అత్యంత ముఖ్యమైన భూసార పరీక్ష కార్డుల పంపిణీపై ప్రభుత్వంప్రత్యేక దృష్టి పెట్టింది. 2015-16లో 21.63 లక్షల రైతులకు భూసార పరీక్ష కార్డులను అందజేసింది. 2016-17లో ఇప్పటి వరకు మరో 1.23 లక్షల భూసార పరీక్ష కార్డులు పంపిణీ చేసింది.
- సాగులో రైతులకు సలహాలు, సూచనలు అందించేలా క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యానశాఖలను బలోపేతంచేసేలా భారీగా నియామకాలు చేపట్టింది. ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక ఏఈవో ఉండేలా ఇటీవల 1300 ఏఈవో పోస్టులను భర్తీ చేసింది.
- 2009 నుంచి రైతులకు చెల్లించాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ పాత బకాయిలు రూ.480.43 కోట్లను తెలంగాణ ప్రభుత్వం వచ్చిన వెంటనే బ్యాంకులద్వారా చెల్లించింది. తర్వాత వచ్చిన ప్రకృతి వైపరీత్యాలకు రూ.821.86 కోట్లు ఇచ్చింది.
- రైతు యూనిట్‌గా పంటల బీమా అమలుచేయాలని అసెంబ్లీలో తీర్మానించడంతోపాటు కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసింది.
- తెలంగాణ ఏర్పడిననాటినుంచి ఇప్పటివరకు 3,658 మంది ఎస్సీ రైతులకు 9,633.66 ఎకరాల భూమి పంపిణీ చేసింది.
- సూక్ష్మ నీటి సేద్య పథకంతో ఎస్సీ,ఎస్టీ రైతులకు 100% రాయితీ, చిన్న, సన్నకారు రైతులకు 90%, ఇతరులకు 80% సబ్సిడీపై డ్రిప్ సదుపాయం కల్పిస్తున్నది. గతంలో గరిష్ఠంగా ఎకరాకు రూ.లక్ష ఉన్న సబ్సిడీని తెలంగాణ ప్రభుత్వం రూ.6లక్షలకు పెంచింది. మూడేండ్లలో ఈ పథకం కింద 2.37 లక్షల ఎకరాల్లో రూ.758.32 కోట్ల వ్యయంతో బిందు, తుంపర సేద్య పరికరాలు అందించింది. వీటికితోడు కేంద్ర, రాష్ట్ర నిధులు, నాబార్డు నుంచి రూ.874కోట్ల రుణం కలిపి 3.15 లక్షల ఎకరాల్లో సూక్ష్మ సేద్యానికి ప్రణాళికలు రూపొందించింది.
- పాలీహౌజ్‌ల నిర్మాణానికి గత ప్రభుత్వాల కాలంలో తెలంగాణలో కేవలం 129 ఎకరాల్లో రూ.24కోట్లు మాత్రమే ఇస్తే, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు 1005 ఎకరాల్లో, రూ.301.5కోట్లతో పాలీహౌజ్‌లకు అనుమతులిచ్చింది.
- కూరగాయల విత్తనాలపై 50% రాయితీ ఇస్తున్నది. క్రాప్ కాలనీలను గుర్తించి రాష్ట్రాన్ని పండ్లు, పూలు, కూరగాయల సాగులో స్వయం సమృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించింది.



వ్యవసాయానికి 24 గంటల కరెంట్..

సమైక్య పాలనలో తెలంగాణ రైతు గోస అనుభవించాడు. బోర్లపై ఆధారపడిన సాగు కావడంతో నిత్యం కరెంటు కష్టాలు పీడించేవి. ‘కరెంటు కావాలి మహాప్రభో’ అంటూ అన్నదాతలు రోడ్డెక్కేవారు. కానీ సీఎం కేసీఆర్ దూరదృష్టి, పకడ్బందీ ప్రణాళికలతో అనతి కాలంలోనే వ్యవసాయానికి కావాల్సినంత విద్యుత్ అందిస్తున్నారు. వచ్చే యాసంగి నుంచి 24 గంటల విద్యుత్‌ను వ్యవసాయానికి అందించేందుకు రంగం సిద్ధమయ్యింది. ఇప్పటికే మెదక్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 24 గంటల విద్యుత్‌ను అందిస్తున్నారు. రాష్ట్రంలో 22 లక్షల వ్యవసాయ కనెక్షన్లున్నాయి. వ్యవసాయానికి నిరంతరాయంగా, ఉచితంగా 24 గంటలపాటు అందించేందుకు 5300 మెగావాట్ల విద్యుత్ అవసరమని అంచనా.

ముహూర్తం

సూర్యోదయం: 6.04 గంటలకు

సూర్యాస్తమయం: 6.35 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, త్రయోదశి తె. 4.40 వరకు. తదుపరి చతుర్దశి. నక్షత్రం: పుష్యమి సాయంత్రం 5.23వరకు, తదుపరి ఆశ్లేష. అమృత ఘడియలు: ఉదయం 11.28 నుంచి 1.04 వరకు, రాహుకాలం: సాయంత్రం 5.01 నుంచి 6.35 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.55 నుంచి 5.45 వరకు, వర్జ్యం: తె. 2.34 నుంచి 4.10 వరకు.

లోకం పోకడ



జై కిసాన్.. జై కేసీఆర్

మూడోపేజీ తరువాయి...

కేసీఆర్‌కు ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వ్యవసాయ మంత్రులు, వ్యవసాయరంగ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, నిపుణులు, అనుబంధ పరిశ్రమల ఎండీలు, సీఈవోలు, ఉత్తమ రైతులు, రైతు సంఘాల నాయకులు, పలు దేశాల రాయబారులు, వ్యవసాయ వర్సిటీల ఉప కులపతులు, విదేశీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఐసీఎఫ్ఏ గ్లోబల్ అగ్రికల్చరల్ సమ్మిట్‌ను నిర్వహించాలని నిర్ణయం తీసుకుని 2008 నుంచి వివిధ విభాగాల కింద అవార్డులను ప్రదానం చేస్తుండగా తొలి ‘పాలసీ లీడర్‌షిప్ అవార్డు’కు ఎమ్మెస్ స్వామినాథన్ ఎంపికయ్యారు. ఇప్పుడు అదే స్వామినాథన్ అధ్యక్షతన ఉన్న ఎంపిక కమిటీ.. ఈ ఏడాది అవార్డుకు కేసీఆర్ పేరును ప్రకటించడం విశేషం.

విప్లవాత్మక నిర్ణయం.. పంటకు పెట్టుబడి: విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితరాలకు పెట్టుబడి కింద రైతులకు రెండు పంటలకు ఏడాదికి రూ.8వేల చొప్పున ఇవ్వనున్నారు. దేశంలో మరెక్కడా లేని ఈ విధానం విప్లవాత్మకమైనదని ఇప్పటికే జాతీయస్థాయిలో ప్రశంసలు అందుతున్నాయి. పంటలను రైతులు అమ్ముకోడానికి ఈ-నామ్ మార్కెట్ల సంఖ్యను పెంచడంతో పాటు దళారీల మోసాలకు తావులేకుండా పటిష్ఠమైన వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే రైతు సంఘాల ఏర్పాటు ఆలోచన చేశారు. అంతిమంగా వ్యవసాయ, గ్రామీణ రంగాలు మరే రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి దిశగా దూసుకెళ్లేందుకు మార్గం సుగమం అవుతున్నది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఐసీఎఫ్ఏ ‘పాలసీ లీడర్‌షిప్ అవార్డు’కు సీఎం కేసీఆర్‌ను ఎంపిక చేసింది.

అనేక అంశాలు పరిశీలించి..: వ్యవసాయరంగంలో వివిధ రాష్ట్రాలు అమలుచేస్తున్న విధానాలు, అవి సాధిస్తున్న ఫలితాలు, వాటి ద్వారా రైతులకు అందుతున్న ఫలాలు, గ్రామీణ వ్యవస్థ అభివృద్ధి చెందడానికి ఉన్న పరిస్థితులు.. ఇలా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న అవార్డుల ఎంపిక కమిటీ.. దేశంలోకెల్లా తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు ఉత్తమమైనవిగా నిర్ధారణకు వచ్చింది. ఈ నెల 1వ తేదీన జరిగిన సమావేశంలో సీఎం కేసీఆర్‌ను పాలసీ లీడర్‌షిప్ అవార్డుకు ఎంపిక చేసింది. స్వామినాథన్ చైర్మన్‌గా ఉన్న ఈ ఎంపిక కమిటీలో ఐసీఎఫ్ఏ చైర్మన్ ఎంజే ఖాన్, డైరెక్టర్ జనరల్ అలోక్ సిన్హా, వివిధ వ్యవసాయ అనుబంధ రంగాలకుచెందిన 18 మంది సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది అవార్డుకు సీఎం కేసీఆరే అర్హుడని వీరంతా ఏకాభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలద్వారా వస్తున్న ఫలితాలే కాకుండా.. వివిధ సెక్షన్ల ప్రజల అభిప్రాయాలను కూడా కమిటీ పరిగణనలోకి తీసుకుంది. ఐసీఎఫ్ఏ కమిటీలో సభ్యులైనవారిలో ఒకరితో ఒక సబ్‌కమిటీ తొలుత అన్ని రాష్ట్రాల్లోని వ్యవసాయ పథకాల అమలు, వాటి ఫలితాలు, రైతుల, వివిధ సెక్షన్ల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తొలిదశలో అవార్డులకు అర్హులైనవారిని ఎంపిక చేస్తుంది. ఆ విధంగా తొలి దశలో కేసీఆర్ పేరు పాలసీ లీడర్‌షిప్ అవార్డుకు ప్రతిపాదించారు. ఇదే విధంగా వివిధ విభాగాల కింద మరో 17 అవార్డులకు కూడా అర్హులైనవారి పేర్లతో ఒక జాబితాను సబ్‌కమిటీ రూపొందించింది. ‘అవార్డు సెక్రటేరియట్’ అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అవార్డులకు అర్హత కలిగినవారి జాబితాను రూపొందిస్తుంది. ఒక్కో విభాగానికి ఇచ్చే అవార్డులకు అనుగుణంగా ఒక్కో సబ్ కమిటీ అర్హతలను అధ్యయనం చేసి ముగ్గురి పేర్లను జాతీయ కమిటీకి సిఫారసు చేస్తుంది. ఈ జాబితాలను స్వామినాథన్ కమిటీ కూలంకషంగా పరిశీలించి, ఒక్కో విభాగం కింద ఒక్కో అవార్డుకు ఒకరి పేరును ఖరారు చేసింది. ఆ విధంగా రెండు దశల్లోనూ సీఎం కేసీఆర్ ‘పాలసీ లీడర్‌షిప్ అవార్డు’కు ఎంపిక కావడం విశేషం.

ఇతర రంగాల్లోనూ అవార్డులు: పాలసీ లీడర్‌షిప్ అవార్డుతో పాటు పరిశోధన, అకడమిక్, వ్యవసాయం, అగ్రిబిజినెస్, కార్పొరేట్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, వ్యవసాయ పారిశ్రామిక, అంతర్జాతీయ తదితర విభాగాల్లో లీడర్‌షిప్ అవార్డులతోపాటు యంగ్ ఎచీవర్, లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్, గ్లోబల్ బిజినెస్, ఉత్తమ అగ్రికల్చర్, ఉత్తమ ఉద్యానవనం, ఉత్తమ పశుసంవర్ధకం తదితర విభాగాల కింద కూడా అవార్డులను వివిధ ప్రముఖులకు ఈ సంస్థ అవార్డులు అందించనుంది.

కోటి ఎకరాల మాగాణి కోసం తపిస్తున్న సీఎం

రైతన్నల సంక్షేమానికి అహర్నిశలు కృషిచేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఈ అవార్డు లభించడం విశేషం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమంపై దృష్టిపెట్టిన కేసీఆర్.. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కదులుతున్నారు. ఈ క్రమంలోనే సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ముఖ్యమంత్రి.. మరోవైపు సంప్రదాయ వనరులైన చెరువులను పునరుద్ధరించేందుకు మిషన్ కాకతీయను చేపట్టారు. వాటితోపాటే రైతులకు అవసరమైన పంట పెట్టుబడికి ఎకరానికి ఏటా రూ.8వేలు అందించే విప్లవాత్మక కార్యక్రమాన్ని తీసుకున్నారు. ప్రతి పొలానికి సాగునీరు అందించేందుకు కృష్ణా, గోదావరి నదులపై పలు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించడంతోపాటు ప్రతి సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.25 వేల కోట్ల మేరకు కేవలం సాగునీటిపారుదల రంగానికే కేటాయిస్తున్నారు. సుమారు రూ.1.80 లక్షల కోట్లతో కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి.. ఇలా అనేక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసి ఆయకట్టు విస్తీర్ణాన్ని పెంచడానికి ఏఐబీపీ ప్రాజెక్టులను ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద ఎంపికయ్యేందుకు కృషిచేశారు. సమీప భవిష్యత్తులో కోటి ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో పాటు తెలంగాణను ‘సీడ్ బౌల్’ (విత్తన భాండాగారం)గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు నిత్యం కరెంటు కోతలతో సతమతమయ్యే రాష్ట్రాన్ని ఏడాదిలోనే అంధకారం నుంచి గట్టెక్కించారు. వ్యవసాయరంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా అందించేలా రాష్ట్ర విద్యుత్ రంగాన్ని తీర్చిదిద్దారు.

గతంలో లీడర్‌షిప్ అవార్డు గ్రహీతలు

వ్యవసాయరంగంలో విశేష కృషి చేసినవారికి వివిధ విభాగాల కింద ఐసీఎఫ్ఏ ఏటా అవార్డులు ప్రదానంచేస్తున్నది. ఇందులో భాగంగా ‘పాలసీ లీడర్‌షిప్ అవార్డు’ ఇప్పటివరకు తొమ్మిది మందికి లభించింది. తొలి సంవత్సరం పాలసీ లీడర్‌షిప్ అవార్డుకు ఎమ్మెస్ స్వామినాథన్ ఎంపికయ్యారు.

- **2009:** మధ్యప్రదేశ్ గవర్నర్ బలరాం జాఖడ్. పీవీ నర్సింహారావు మంత్రివర్గంలో వ్యవసాయ మంత్రిగా తీసుకున్న విధాన నిర్ణయాలకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు.
- **2010:** వ్యవసాయశాఖ మాజీ కార్యదర్శి జేఎన్ఎల్ శ్రీవాస్తవ.
- **2011:** జాతీయ సలహా మండలి కార్యదర్శి, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి రీటాశర్మ.
- **2012:** హిమాచల్‌ప్రదేశ్ సీఎం ప్రొఫెసర్ పీకే ధుమాల్
- **2013:** పంజాబ్ సీఎం ప్రకాశ్‌సింగ్ బాదల్. నాటి బీజేపీ అధ్యక్షుడు రాజ్‌నాథ్ ప్రత్యేక సాఫల్య పురస్కారానికి, సిక్కిం సీఎం పవన్ చామ్లింగ్ ప్రోగ్రామ్ లీడర్‌షిప్ అవార్డుకు ఎంపిక.
- **2014:** కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్‌పవార్.
- **2015:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్.
- **2016:** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్. టాటా సన్స్ గ్రూపు చైర్మన్ రతన్ టాటా జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు.

సీఎంకు అవార్డుపై సర్వత్రా హర్షం

చిత్తశుద్ధితో చేపడుతున్న కార్యక్రమాలకు గుర్తింపు



■ **సీఎంకు గవర్నర్ అభినందనలు**

ప్రతిష్ఠాత్మక అగ్రికల్చర్ పాలసీ లీడర్‌షిప్ అవార్డు-2017కు ఎంపికైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అభినందనలు తెలిపారు. వ్యవసాయరంగ అభివృద్ధికోసం సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో చేపడుతున్న కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని పేర్కొన్నారు. వ్యవసాయరంగాన్ని పురోగమనదిశలో నడిపించటంలో సీఎం తన సృజనాత్మకమైన ఆలోచనలతో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నారని ఆయన కొనియాడారు.

సీఎంకు అవార్డు రావడం సముచితం: పోచారం



వ్యవసాయరంగంలో నెలకొన్న సమస్యలపై పోరాటంచేస్తూ.. అంకితభావంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అగ్రికల్చర్ అవార్డు రావడం సముచితమని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 5న ఢిల్లీలో భారత ఆహార వ్యవసాయ మండలి ఈ అవార్డును అందజేస్తుందని ఆయన తెలిపారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తెలంగాణ తిరుమల దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పోచారం మీడియాతో మాట్లాడారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రెండోరోజే కేసీఆర్ రూ.17,000కోట్ల రైతు రుణమాఫీ చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నారని, రాష్ట్ర బడ్జెట్‌లో సగం వ్యవసాయ, అనుబంధ రంగాలకే కేటాయించారని మంత్రి పేర్కొన్నారు. లక్షల మంది వ్యవసాయదారుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కృషి చేస్తున్నందుకు సీఎంకు ఈ అవార్డు వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు బుద్ధితెచ్చుకొని, ప్రాజెక్టులను అడ్డుకునే పనులను మానుకోవాలని మంత్రి హితవు పలికారు.

కేసీఆర్ భూమి పుత్రుడు: తుమ్మల



వ్యవసాయాన్ని పండుగలా చేస్తున్న సీఎం కేసీఆర్ నిజమైన భూమిపుత్రుడని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ ఆధ్వర్యంలోని కమిటీ సీఎం పేరును అవార్డుకు ప్రతిపాదించడం గొప్ప విషయమన్నారు. వ్యవసాయరంగంలో తీసుకొస్తున్న విప్లవాత్మకమైన విధానాలు, పథకాల అమలుకు గుర్తింపుగా అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేస్తున్నారని, సీఎంను ఆదర్శంగా తీసుకొని తాము సైతం రైతు శ్రేయస్సుకోసం పాటుపడుతున్నామని మంత్రి చెప్పారు. తెలంగాణను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని తుమ్మల కొనియాడారు.

ఇది రైతులకు శుభసమయం

ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి



సీఎం కేసీఆర్‌కు అవార్డు రావడం ఆనందంగా ఉందని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ స్వయంగా రైతు కావడంవల్లే క్షేత్రస్థాయి సమస్యలు తెలుస్తున్నాయని, వాటి పరిష్కారానికి తీవ్రంగా శ్రమిస్తున్నారని చెప్పారు. రైతు కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం కావడం మనందరి అదృష్టమన్నారు. ఇది రైతులకు శుభసమయం అని వారు పేర్కొన్నారు.

సింగరేణిలో సిరుల పంట



రూ.17,853 కోట్ల టర్నోవర్ సాధించిన సింగరేణి ● నికర లాభం రూ.395.38 కోట్లు

మూడు కొత్త గనులకు ఆర్థిక అనుమతులు ● 2016-17 వార్షిక లెక్కలకు ఆమోదం తెలిపిన బోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సింగరేణి సంస్థ 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.17,853 కోట్ల టర్నోవర్‌తో రూ.395.38 కోట్ల నికర లాభాలను ఆర్జించిందని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం నిర్వహించిన బోర్డు సమావేశంలో 2016-17 వార్షిక లెక్కలకు ఆమోదం తెలిపాక.. వివరాలను వెల్లడించారు. రూ.17,853 కోట్ల టర్నోవర్‌లో నికర టర్నోవర్ రూ.13,981 కోట్లుగా నమోదైందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రూ.2,888 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.3,168 కోట్లు కలిపి మొత్తం రూ.6,056 కోట్లు వివిధ పన్నులకింద చెల్లించామని చెప్పారు. ట్యాక్స్‌ల చెల్లింపు తర్వాత నికరలాభం రూ.395.38 కోట్లుగా తేలిందని సీఎండీ ప్రకటించారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సంస్థ రూ.30 కోట్లు వెచ్చించేందుకు నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందారం ఖని ఓసీ గని (శ్రీరాంపూర్), కేటీకేవోసీ-2 (భూపాలపల్లి), శాంతిఖని లాంగ్‌వాల్ (మందమర్రి) వంటి కొత్త గనుల కోసం సవరించిన బడ్జెట్‌కు బోర్డు ఆమోదం తెలిపినట్లు సీఎండీ వివరించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ కార్యదర్శి అజయ్‌మిశ్రా, కేంద్ర బొగ్గుమంత్రిత్వశాఖ డైరెక్టర్ జేఎస్ బింద్రా, సింగరేణి డైరెక్టర్లు బీ భాస్కర్‌రావు, ఎస్ చంద్రశేఖర్, ఎస్ శంకర్, కంపెనీ కార్యదర్శి జీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొగ్గుగని కార్మికుల వేతనాలపై 24న తుది నిర్ణయం

ఢిల్లీలో సమావేశమవుతున్న జేబీసీసీఐ ● రాంచీ సమావేశంలో కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : దేశవ్యాప్తంగా బొగ్గుగనుల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల వేతనాల పెంపుపై ఈనెల 24న ఢిల్లీలో నిర్వహించే సమావేశంలో తుదినిర్ణయం జరుగుతుందని పలువురు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో శనివారం జరిగిన జాయింట్ బైపార్టియేట్ కమిటీ ఆన్ కోల్ ఇండస్ట్రీస్ (జేబీసీసీఐ) సమావేశంలో పలు అంశాలపై కార్మిక సంఘాలు, కోల్ ఇండియా యాజమాన్య బోర్డు విస్తృతంగా చర్చించాయి. కనీస వేతన పెంపు రూ.5143 వరకు ఉండాలని, 21శాతానికితోడు అదనంగా మరో 4శాతం ఫిట్‌మెంట్ ఉండాలని పలు కార్మిక సంఘాలు కోరాయి. అన్ని అంశాలపై ఈ నెల 24న ఢిల్లీలో జరిగే సమావేశంలో తుదినిర్ణయం జరుగుతుందని వారు చెప్పారు.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్



తార్నాకలోని టీటీయూసీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి

తార్నాక: రైతు సంక్షేమంకోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి గుర్తింపుగా సీఎం కేసీఆర్‌కు అవార్డు లభించిందని తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్ (టీటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతె శోభన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమంకోసం తపిస్తున్న రైతు బాంధవుడు కేసీఆర్‌కు అవార్డు లభించడం రైతులకు దక్కిన గౌరవమని అభివర్ణించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జూపల్లి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు అనితానాయక్, సంటి కుమార్, మేరీమాదిగ, ఇందిరా, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిర్విరామకృషికి గుర్తింపు



తెలంగాణ రైతుల కోసం సీఎం కేసీఆర్ చేస్తున్న నిర్విరామ కృషికి గుర్తింపే ఈ అవార్డు. కొత్తగూడెం రైతులకు మేలు జరిగేలా సీతారామ ప్రాజెక్టు నిర్మాణం, సంఘభూపాలెం చెరువు పునరుద్ధరణ వంటి చర్యలను సీఎం చేపట్టారు. రైతుల పక్షాన సీఎంకు ధన్యవాదాలు.

- జలగం వెంకటరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు



దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఆలోచించనంత వేగంగా, సాహసంతో సీఎం కేసీఆర్ రైతుల కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఆయనకు అవార్డు రావడం గొప్ప విషయం. సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు.

- కారం రవీందర్‌రెడ్డి, టీఎన్జీవో అధ్యక్షుడు

రైతుల గురించి ఆలోచించే ఏకైక సీఎం



తెలంగాణ ఏర్పడిన మొదటిరోజు నుంచే సీఎం కేసీఆర్ రైతుల గురించి ఆలోచించడం ప్రారంభించారు. ఏం చేస్తే రైతులు బాగుపడుతారో గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. వ్యవసాయానికి సంబంధించి సంచలన నిర్ణయాలు తీసుకొని జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. అంతటి గొప్ప వ్యక్తికి అవార్డు రావడం అభినందనీయం. రైతుల గురించి ఆలోచించే ఏకైక సీఎం కేసీఆర్.

- దేవీప్రసాద్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్

రైతు కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి

రైతు సంక్షేమమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అవార్డు రావడం ఆనందంగా ఉంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న రైతుల పరిస్థితులపై ఆయనకు అవగాహన ఉంది. అందుకే సీఎం ప్రవేశపెట్టే ప్రతి పథకంలో రైతులకు మేలుచేసే అంశాలు ఉంటున్నాయి.

- టీఆర్‌ఎస్ ఆస్ట్రేలియాశాఖ

అవార్డు రావడం అభినందనీయం

సీఎంకు అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు రావడం అభినందనీయం. ఆయన చేపట్టిన మిషన్ కాకతీయ ప్రాజెక్టును నీతిఆయోగ్ సైతం అభినందించింది. ఇరిగేషన్ ప్రాజెక్టులను రీడిజైన్ చేయడం గొప్ప విషయం. 80 ఏండ్ల కిందట జరిగిన భూసర్వే స్థానంలో కొత్తగా సర్వే చేపట్టాలనుకోవడం సాహసోపేతమైన చర్య. ఇది రైతులందరికీ మేలు చేస్తుంది.

- కల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

సిరిసిల్లలో నర్సింగ్ కాలేజీకి అనుమతి

● రూ.36 కోట్లు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సిరిసిల్ల రాజన్నజిల్లాలో బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులిస్తూ రూ.36.45 కోట్ల నిధులు మంజూరుచేసింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. వంద సీట్ల సామర్థ్యంతో ఈ డిగ్రీ కళాశాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు అనుబంధంగా ఈ నర్సింగ్ కాలేజీ పనిచేయనుంది. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నుంచి అనుమతి తీసుకుని 2018-19 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

రెండు నగర పంచాయతీల హోదా పెంపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పెద్దపల్లి, భూపాలపల్లి నగర పంచాయతీల హోదాను మూడోగ్రేడు మున్సిపాలిటీగా పెంచుతూ పురపాలక శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం జీవో జారీచేశారు. ఈ రెండు నగర పంచాయతీలను మొదటి గ్రేడ్ మున్సిపాలిటీలుగా స్థాయి పెంచాలని ఆయా కమిషనర్లు.. పురపాలకశాఖకు ప్రతిపాదనలు పంపారు. వీటిని పరిశీలించిన కార్యదర్శి ఈ మేరకు నిర్ణయించారు.

హేమాచల దేవాలయానికి పాలకమండలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామంలోని శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి 14 మంది సభ్యులతో పాలకమండలిని ఏర్పాటుచేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. పూజారి శ్రీనివాస్, కర్రి రమాదేవి, కోడెం నాగేశ్వరరావు, సిద్ధంశెట్టి కనకారావు, కుంట ఏడుకొండలు, మార్పుల వెంకటరెడ్డి, చిన్నపల్లి వెంకన్న, ఆది సుధాకర్, మంచాల నాగేంద్రకుమార్, దిడ్డి శ్రీనివాస్, తుమ్మల సంజీవరెడ్డి, లక్కీ వెంకన్న, పీ మణెమ్మ, పీ రమేశ్ తదితరులు ఈ పాలకమండలిలో ఉన్నారు. దేవాలయం సీనియర్ అర్చకులు కే పాండురంగాచార్యులు ఎక్స్ అఫీసియో సభ్యులుగా ఉంటారు. వీరు ఏడాదిపాటు ఈ పదవిలో ఉంటారు.

బీ ఫార్మసీలో 7,829 సీట్లు భర్తీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని బీ ఫార్మసీ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం ఈ నెల 17, 18 తేదీలలో నిర్వహించిన ఎంసెట్ బైపీసీ కౌన్సెలింగ్‌లో 7,829 సీట్లు భర్తీ అయ్యాయి. 10 సీట్లే ఖాళీగా ఉన్నాయని కౌన్సెలింగ్ కన్వీనర్ ఏ వాణీ ప్రసాద్ తెలిపారు. 125 కాలేజీల్లో వందశాతం సీట్లు భర్తీ అయ్యాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ నెల 26 లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉందన్నారు.

మంత్రి హరీశ్ బృందానికి

కేటీఆర్ ప్రశంసలు

గోదాముల సామర్థ్యం ఐదు రెట్లు పెంపుపై మంత్రి ట్వీట్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో గోదాముల సామర్థ్యాన్ని ఐదు రెట్లు పెంచడంలో మంత్రి హరీశ్‌రావు, ఆయన బృందం పనితీరు ప్రశంసనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'వ్యవసాయ గోదాముల సామర్థ్యాన్ని నాలుగు లక్షల నుంచి 21 లక్షల టన్నులకు పెంచడం హర్షణీయం. మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు, ఆయన బృందం పనితీరుకు ప్రత్యేక అభినందనలు' అని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

టీఎస్‌పీఎస్సీకి

సర్కారు దన్ను

కమిషన్‌లో నియామకాలకు గ్రీన్‌సిగ్నల్!

ఖాళీల భర్తీతో పనిభారం తగ్గించాలని నిర్ణయం

త్వరలో ప్రత్యేక డాటా సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. మానవ వనరులతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ఆటంకాల్లేకుండా భర్తీ ప్రక్రియను చేపట్టేలా అండగా నిలుస్తున్నది. తొంబై ఉద్యోగాల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే కాకుండా డాటాసెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పంద్రాగస్టు వేడుకల సందర్భంగా సీఎం కేసీఆర్.. రాష్ట్రంలో కొత్తగా 85 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. కొలువుల భర్తీలో శాఖలవారీగా కార్యాచరణను రూపొందించుకొని అమలుచేయాలని అధికారులను ఆదేశించి, టీఎస్‌పీఎస్సీతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి నేతృత్వంలోని అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని అధికారులు వారానికోసారి సమావేశమై, ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. నియామకాల విషయమై సీఎం కేసీఆర్‌తో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి చర్చించారు. ఈ సందర్భంగా ప్రత్యేక రాష్ట్రం వచ్చాక శాఖలవారీగా ఖాళీల భర్తీకి, కొత్త నియామకాలను చేపట్టడానికి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పడిందని, దీనిద్వారా ఇప్పటికే 58 నోటిఫికేషన్లు జారీచేశామని వివరించారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇప్పటివరకు ఐదువేల మంది నియమితులయ్యారని, మరోనెల వ్యవధిలో 12 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా తమకు ఉద్యోగుల కొరత ఉన్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా.. కొత్తగా 90 మందిని నియమించేందుకు సీఎం కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. టీఎస్‌పీఎస్సీలో ఖాళీగా ఉన్న కీలక పోస్టులు అసిస్టెంట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ, సెక్షన్ ఆఫీసర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తున్నది. త్వరలో భర్తీ ప్రక్రియ చేపట్టనున్నట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులకు పనిభారం తగ్గించి, నియామకాల ప్రక్రియలో వేగం పెంచనున్నారు. మరోవైపు టీఎస్‌పీఎస్సీని సాంకేతికంగా పటిష్ఠపర్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నది. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీకి సాంకేతిక అవసరాలను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) అందిస్తున్నది. సీజీజీకి ఉన్న ఇతరత్రా పనిభారాల వల్ల సేవల్లో కొంత జాప్యం కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీకి ప్రత్యేక డాటా కేంద్రం ఏర్పాటుకు కొద్దికాలం కిందటే ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) ద్వారా కావాల్సిన మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నది. ఈ కేంద్రం ఏర్పాటుతో టీఎస్‌పీఎస్సీ సేవలు మరింత వేగంగా అందనున్నాయి.

పొట్టనొప్పితో పొంచి ఉండే ప్రమాదకర వ్యాధులు

యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక 'గ్యాస్ట్రో' చికిత్సలు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ సర్జికల్ & గ్యాస్ట్రో ఎంటిరాలజీ
యశోద హాస్పిటల్స్ - హైదరాబాద్
సికింద్రాబాద్ - సోమాజిగూడ - మలక్‌పేట్
ఫోన్ : 81210 22333

ఏదో ఒక సమయంలో మన అందరికీ పొట్టలో నొప్పి అనుభవంలోకి వస్తుంది. చాలా సందర్భాలలో ఈ నొప్పి పెద్దగా ఆందోళన ఏమీ కలిగించదు. ఫ్యామిలీ డాక్టర్ దానికి కారణాన్ని తేలికగా గుర్తించి చికిత్సచేసి తగ్గిస్తారు. కానీ కొన్నిసార్లు ఈ కడపులో నొప్పి తగ్గకుండా దీర్ఘకాలం ఉంటుంది. లేదా పదేపదే వస్తూ వేధిస్తుంటుంది. ఈ రకమైన పొట్టనొప్పి తీవ్రమైన వ్యాధులకు సూచన కావచ్చు. దీనివెనక దాగి ఉండే రుగ్మతలు తీవ్రమైనవిగా మారి వైద్యపరమైన అత్యవసర పరిస్థితికి దారితీసే అవకాశం ఉంది. పొట్టనొప్పి లక్షణాలు ఏమిటి? అది ఏయే వ్యాధులకు సూచన కావచ్చు? ఎటువంటి కడుపు నొప్పిని అనుమానించి డాక్టరును సంప్రదించాలి? ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవటం వల్ల సాధారణంగా పరిగణించే పొట్టనొప్పిని సరిగ్గా అర్థం చేసుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవచ్చు.

విడువని పొట్టనొప్పికి పలు కారణాలు:

కడుపులో కొద్దిపాటి నొప్పి ఉన్నా, తీవ్రమైన వేదన కలిగించేది అయినా, భరించశక్యం కాక మెలికలు తిరిగిపోయేట్టు చేసేది అయినా దానికి ఒకటి కంటే ఎక్కువే కారణాలు ఉండే అవకాశం ఉంది. ఉదాహరణకు అజీర్ణం, మలబద్ధం, కలుషిత ఆహారం, ఆహారపదార్థాలు పడకపోవటం(ఫుడ్ అలర్జీ), పొట్టలో వైరసులు లేదా మహిళల్లో అయితే నెలసరి సమయంలో వచ్చే మెనుస్ట్రుల క్రాంప్స్ కడుపులో నొప్పికి కారణం కావచ్చు. వీటితో పాటు మరి కొన్ని వ్యాధులలో కూడా పొట్ట నొప్పి ప్రధాన లక్షణం. ఇది సాధారణ కడుపు నొప్పితో పోలిస్తే తీవ్రంగా ఉంటుంది. అటువంటి సమయంలో కడుపు నొప్పి తగ్గించేందుకు మందులు వేసుకుంటే అది అసలు సమస్యను పరిష్కరించదు. పైగా విడువని పొట్టనొప్పికి అసులు కారణమైన వ్యాధులు ముదిరి పరిస్థితి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుంది. ఎంతకు తగ్గని పొట్టనొప్పికి కారణమయ్యే వ్యాధులు ఇవి:



ఇరిటబుల్ బొవెల్ సిండ్రోమ్ (ఐ.బి.ఎస్.): స్త్రీ, పురుషులు ఇద్దరిలోనూ కనిపించినప్పటికీ మహిళలను ఎక్కువగా వేధించే రుగ్మత ఇది. దీనికి కారణాలు ఏమిటో ఇంకా ఖచ్చితంగా వెల్లడి కాలేదు. దీనిలో పొట్టలో సుళ్లుతిరిగే నొప్పి తోపాటు విరేచనాలు, మలబద్ధకం ఏర్పడుతుంది. పొట్టలో ఉబ్బరంగా తోచటం, గ్యాస్ నిండి ఉబ్బిపోవటం కనిపిస్తుంది. కడుపు నొప్పిని తగ్గించటమే కాకుండా ఈ లక్షణాల నుంచి విముక్తి కలిగించే లక్ష్యంతో చికిత్స చేస్తారు. ఈ వ్యాధిగ్రస్థులు పలురకాల చికిత్సల వల్ల ఉపశమనం పొందుతారు. మందులు తీసుకుంటూ ఆహారంలో మార్పులు చేయటం ద్వారా, మానసిక వత్తిడిని అదుపుచేసుకోవటం వల్ల, బిహేవియరల్ థెరపీ ద్వారా ఐ.బి.ఎస్.ను అదుపుచేసుకోగలుగుతున్నారు. అయితే ఐ.బి.ఎస్.కు స్వంత చికిత్స చేసుకోవటం ప్రమాదకరం.ఎందువల్ల నంటే కడుపు నొప్పికి కారణం ఐ.బి.ఎస్. నిర్ధారించిన తరువాత ఏ కారణాల వల్ల ఇది ఏర్పడింది గుర్తించి చికిత్స ప్రణాళికను రూపొందించాల్సి ఉంటుంది. ఈ వ్యాధి చికిత్సలో డాక్టర్లు మందులతో పాటు వ్యక్తి జీవనశైలిలో మార్పులను సిఫార్సు చేస్తారు.

హెర్నియా: శరీర అంతర్భాగంలోని ఓ అవయవం లేదా కొవ్వుకణజాలం దగ్గరలో ఉన్న కండర - కనెక్టివ్ కణజాలంతో ఏర్పడిన గోడలోని బలహీనమైన ప్రాంతం గుండా చొచ్చుకుపోవటం వల్ల హెర్నియా ఏర్పడుతుంది. హెర్నియాల్లో ఎక్కువగా కనిపించేవి ఇంగ్యునల్ (గజ్జల లోపల), ఇన్సిసిషనల్ (శస్త్రచికిత్స తాలూకు గాటు నుంచి), ఫిమోరల్(గజ్జల అవతలి వైపు), అంబ్లికల్(బొడ్డు వద్ద), హయటల్(పొట్టపై భాగంలో). ఇంగ్యునల్ హెర్నియాలో ప్రేవు లేదా మూత్రాశయం పొట్టభాగపు గోడ నుంచి గజ్జల్లోని ఇంగ్యునల్ కెనాల్ లోకి చొచ్చుకుని వస్తుంది. గజ్జల ప్రాంతంలో ఏర్పడే హెర్నియాలలో 96 శాతం ఇంగ్యూనల్ హెర్నియాలే. ఇవి ఎక్కువగా పురుషుల్లోనే ఏర్పడుతుంటాయి.

ఫిమోరల్ హెర్నియాలు స్త్రీలలో , ప్రత్యేకించి గర్భవతుల్లో ఎక్కువ కనిపిస్తాయి. దీనిలో తొడపై భాగంలో ఉండే ఫిమోరల్ ధమనికి సంబంధించిన నాళంలోకి ప్రేవు దిగబడుతుంది. బొడ్డుకు దగ్గరగా ఉన్న గోడల గుండా చిన్న ప్రేవు భాగం చొచ్చుకుని రావటం వల్ల అంబ్లికల్ హెర్నియా ఏర్పడుతుంది. సాధారణంగా ఇది కొత్తగా పుట్టిన పిల్లలు, అధిక సంతానం కలిగిన స్త్రీలలో ఏర్పడుతుంది. జీర్ణాశయపు పై భాగం డయాఫ్రమ్ లో అన్నవాహిక ప్రయాణించే రంధ్రంలోకి జారటంతో హయటల్ హెర్నియా ఏర్పడుతుంది. హెర్నియాలు అన్నింటిలోనూ పొట్టనొప్పి ఉంటుంది. పొట్టనొప్పి విడువకుండా వేధిస్తుండటానికి హెర్నియానే కారణం అని నిర్ధారణ అయినపుడు శస్త్రచికిత్స ద్వారా ఆ లోపాన్ని సరిచేయాల్సి ఉంటుంది.

అపెండిసైటిస్: పెద్దప్రేవుకు అతుక్కుని ఉండే అపెండిక్స్ వాపు వల్ల అపెండిసైటిస్ ఏర్పడుతుంది. మూడున్నర అంగుళాల పొడవుండే అపెండిసైటిస్ ఆహారనాళంలో రోగనిరోధక వాతావరణం ఏర్పడటానికి తోడ్పడుతుందని పరిశోధకులు కొందరు గుర్తించారు. అయితే ఉపయోగం గూర్చి ఖచ్చితంగా తెలియని అపెండిక్స్ వాచినపుడు విపరీతమైన పొట్టనొప్పి కలుగుతుంది.. అపెండిక్స్ ను తీసివేసినా సాధారణ జీవితం గడపటం సాధ్యపడుతుంది కనుకనే దాని వల్ల చెప్పదగ్గ ఉపయోగం ఏమీ లేదన్న అభిప్రాయం స్థిరపడింది. అపెండిసైటిస్ వైద్యపరమైన అత్యవసర పరిస్థితి. అందువల్ల వెంటనే శస్త్రచికిత్సచేసి దానిని తొలగించివేస్తారు. అలా తీసివేయని పక్షంలో వాచిపోయి ఉన్న అపెండిక్స్ చివరకు పగిలిపోయి ఇన్ఫెక్షన్ కారక సూక్ష్మజీవులు అబ్డామినల్ కావిటీ(ఉదర కుహరం) అంతటికీ వ్యాపిస్తాయి. ఇది ఉదరం కుహరపు పొరల(పెరిటోనియం) ఇన్ఫెక్షన్‌కు దారితీసి ప్రాణాంతకంగా పరిణమించే అవకాశం ఉంటుంది.

ఎండోమెట్రియోసిస్: మహిళలలో భరించరాని నొప్పి, మొద్దుబారిన భావం కలిగించే పరిస్థితి ఇది. దీనిలో గర్భాశయపు లోపలి గోడల ఉండే ఎండోమెట్రియం కణజాలం బయటివైపు పెరగటం ప్రారంభించి బయటివైపు గోడలను చీల్చుకుని వస్తాయి. నెలసరి సమయంలో ఈ కణజాలం మొత్తం విచ్ఛిన్నమైన రక్తస్రావం అవుతుంది. అయితే ఈ రక్తం బయటకు వెళ్లటానికి మార్గం ఉండదు. దాంతో స్రవించిన రక్తం చుట్టుపక్కల కణజాలంపై ప్రభావం చూపి వాపు ఏర్పడుతుంది. పొట్టలో తీవ్రమైన నొప్పి కలిగిస్తుంది. ఇది ఆరోగ్యపరంగా అత్యవసర పరిస్థితి కల్పించుతుంది.

పిత్తాశయపు రాళ్లు: ఇవి నిజమైన రాళ్లేమీ కాదు. పిత్తాశయంలో తయారయిన దృఢమైన ఘనపదార్థపు ముక్కలు. పైత్యరస నాళానికి అవి అడ్డుపడి తీవ్రమైన నొప్పికి కారణం దాకా వాటి ఉనికి గూర్చి తెలిసే అవకాశమే ఉండదు. వెంటనే డాక్టరుకు చూపించుకుని చికిత్స చేయించుకోవాలి. రోగి పరిస్థితిని బట్టి శస్త్రచికిత్స ద్వారా ఈ రాళ్లను తొలగించి వేస్తారు.

మూత్రపిండాలలో రాళ్లు: మూత్రంలో ఉండే లవణాలతో మూత్రపిండాలలో ఏర్పడిన చిన్నచిన్న గులకరాళ్ల వల్ల తీవ్రమైన నొప్పికలుగుతుంది. ఇది పొట్టభాగం అంతటికీ వ్యాపిస్తుంది. ఈ రాళ్లు చిన్నవిగా ఉంటే వాటంతటఅవే మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతాయి. పెద్దవాటిని సర్జన్లు వైద్య ప్రక్రియల ద్వారా తొలగించాల్సి ఉంటుంది. ఇందుకు యూరాలజిస్టును సంప్రదించాల్సి ఉంటుంది.

కారణాల నిర్ధారణ - చికిత్స:

పలు కారణాల వల్ల పొట్టలో నొప్పివస్తున్నందుకు తమ వద్దకు వచ్చిన వ్యక్తిలో నొప్పివెనుక ఏ వ్యాధి ఉందో నిర్ధారించేందుకు డాక్టర్లు ఒక క్రమపద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తారు. మొదట స్వయంగా వ్యాధిగ్రస్తులకు ఫిజికల్ ఎగ్జామినేషన్ చేస్తారు. వ్యక్తమవుతున్న రోగలక్షణాలు కనుక్కొంటారు. నొప్పి తీవ్రతను తెలుసుకుంటారు. ప్రాథమిక అంచనా అనంతరం తక్షణ ఉపశమనానికి మందులు ఇచ్చి అనుమానిస్తున్న వ్యాధులను నిర్ధారించుకునేందుకు అవసరమైతే ఎండోస్కోపీ, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్, సి.టి.స్కాన్ వంటి పరీక్షలు చేయిస్తారు.

ఎంతకూ తగ్గని పొట్టనొప్పికి చికిత్సచేయటంలో దానికి కారణం అవుతున్న వ్యాధిని గుర్తించటం అత్యంత కీలకమైన అంశమని యశోద హాస్పిటల్స్ కు చెందిన వైద్యనిపుణులు తెలిపారు. ఈ పరీక్షలలో బయటపడిన వ్యాధులకు సమగ్రమైన చికిత్స చేస్తారని, తద్వారా విడువకుండా ఉన్న పొట్టలోనొప్పి క్రమంగా తగ్గిపోవటానికి అవకాశం ఏర్పడుతుందని వారు చెప్పారు. అందువల్ల నెలల తరబడి తగ్గకుండా ఉన్న పొట్టలో నొప్పిని తేలికగా తీసుకోకుండా అత్యాధునిక వ్యాధి నిర్ధారణ సౌకర్యాలు, నిపుణులైన వైద్యులు ఉన్న ఆస్పత్రిలో చూపించుకుని చికిత్స పొందటం వల్ల శాశ్వత ఉపశమనం లభిస్తుంది.

రైతు ఆదాయ భద్రతే దేశ ఆహార భద్రత

వ్యవసాయం



డాక్టర్ పిడిగెం సైదయ్య

కేంద్ర ఆర్థిక సర్వే రెండవ భాగం ప్రత్యేకించి దేశ వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను తెలిపింది. సూచనలు చేసింది. వరి, గోధుమ పంటలకు తప్పితే కనీస మద్దతు ధరలు రైతులకు ఏ మాత్రం అక్కరకు రావటం లేదన్నది. ప్రత్యక్ష నగదు బదిలీయే పరిష్కారం అని సూచించింది. ఆహార ఉత్పత్తుల నిల్వలపై అనాలోచిత ప్రభుత్వ ఆంక్షలు అటు వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుదారులను, ఇటు రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. అయితే సాగు సంక్షోభంలో ఉన్నదని చెబుతూనే రైతుల పంట రుణాలు ప్రభుత్వాల ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకంగా ఉంటున్నాయని చెప్తున్నది. జన్యుమార్పిడి పంటల అవసరం ఉన్నదని సూచించింది. మొత్తంగా సర్వే ఫలితాలు కేవ లం దేశ ఆర్థిక ప్రగతికి రైతు ఎలా ఉపయోగపడాలో సూచిస్తున్నాయి తప్పా రైతుల క్షేత్రస్థాయి సాధకబాధకాలను విస్మరించాయి.

దేశంలోని సగానికి పైగా జనాభాకు సాగు ప్రత్యక్ష జీవనోపాధి రంగం. అయితే హరిత విప్లవకాలం నుంచి ఆహార ధాన్యాల్లో స్వయం సమృద్ధి సాధించి విదేశాలకు భారీగా ఎగుమతిచేసే స్థితికి ఎదిగినప్పటికీ సాగుదారుల ఆదాయాల్లో కనీసంగా సైతం పెరుగుదలలేదు. సాగులో పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగాయి. నూతన రకాలు అందుబాటులోకి రాలేదు. పర్యావరణ మార్పులు పొంచి ఉన్నాయి. మార్కెట్లో మధ్య దళారుల విపరీత జోక్యంతో కనీసం పెట్టుబడి ఖర్చులు తిరిగిరావటం లేదు. వర్షాధార సాగుతో దిగుబడులకు గ్యారంటీ లేదు. మద్దతు ధరలు అన్నిపంటలకు అక్కరకు రావటం లేదు. రాష్ట్రాలు రైతులకు మద్దతుగా పంటల రుణమాఫీకి వెళితే ఆర్థిక నిపుణులు పెద్ద నేరంగా పరిగణినిస్తున్నారు. ఈ ధోరణి మారకపోతే రైతుల బతుకులు మారవు.

దశాబ్దాలుగా తిష్ట వేసిన సమస్యలను ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. ఫలితంగా వ్యవసాయ వృద్ధిరేటు మందకొడిగానే ఉన్నది. అదే సమయంలో రైతుకు కనీస ఆదాయాన్నిచ్చే కమతాల పరిమాణం రోజురోజుకు తగ్గిపోతున్నది. 70వ దశకంలో సరాసరి కమతం పరిమాణం 2.28 హెక్టార్లు ఉంటే నేడు 1.15 హెక్టార్లకు పడిపోయింది. ఫలితంగా చిన్న, సన్నకారు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దేశంలో 85 శాతం చిన్న, సన్నకారు రైతులే. పెట్టుబడి సామర్థ్యం తగ్గిపోయింది. పంటలు కోల్పోతే తిరిగి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. దీంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. 52 శాతం వ్యవసా య కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయాయి. సరాసరిన రైతుకు 47 వేల రూపాయల అప్పుందని జాతీయ నమూనా సర్వే గణాంకాలు చెబుతున్నాయి. అప్పుల ఊబిలో ఉన్నవారిలో 63 శాతం సన్నకారు రైతులే. 9 కోట్ల వ్యవసాయ కుటుంబాల్లో 6 కోట్ల 30 లక్షల కుటుంబాలు వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయానికంటే ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. అందుకే రైతుల బలవన్మరణాలకు అప్పులే ప్రధాన సమస్య. అందులో కూడా 72 శాతం పైగా చిన్న, సన్నకారు రైతులే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యల పరిష్కారాల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు రుణమాఫీకి వెళ్తే.. ఏసీ గదుల్లో కాగితాల మీద ప్రణాళిక రూపకర్తలు గమ్మత్తయిన ప్రకటనలు, వ్యాఖ్యలు చేస్తున్నారు. రైతుల పంటల రుణమాఫీ, వడ్డీమాఫీలు ఆర్థిక క్రమశిక్షణకు విరుద్ధంగా ఉన్నాయని ఒకరం టే, దేశ ఆర్థిక ప్రగతికి ప్రధాన ఆటంకమని మరో మేధావి అంటారు.

ప్రస్తుత ఆర్థిక సర్వే రెండవ భాగం సైతం 2.7 లక్షల కోట్ల రుణమాఫీతో దేశ ప్రగతి ఆగిపోయిందని పేర్కొంటున్నది. మరి ఆర్‌బీఐ నియమాల ప్రకారం బ్యాంకుల మొత్తం రుణాల్లో 40 శాతం ప్రాధాన్య రంగాలకు ఇవ్వాలి. అందులో 18 శాతం వ్యవసాయానికి ఇవ్వాలి. వేల కోట్ల రూపాయల మేర రుణాలివ్వాలి. ఆచరణలో మాత్రం అందులో 60 శాతం కూడా అమలు జరుగటం లేదు. ఇక రుణాల్లో చిన్న, సన్నకారు రైతులకు 8 శాతం ఇవ్వాలి. అదీ అంతంత మాత్రమే. ఇక రైతులకు పెట్టుబడుల్లో ఆసరాగా ఉండేందుకు ప్రభుత్వాలు భారీ రుణ లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నాయి. 2015-16 సంవత్సరంలో భారీ రుణ లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. 2015-16 సంవత్సరం బడ్జెట్‌లో 8.5 లక్షల కోట్ల రూపాయలు, 2016-17లో 9 లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు. అయితే 2015-16 కేటాయింపుల్లో 59 శాతం మాత్రమే రైతులకు వ్యవసా య పరపతి అందింది. అదేవిధంగా 2016-17లో 84 శాతం రుణాలందాయి. ఇక 2017-18 సంవత్సరానికి రూ.10 లక్షల కోట్ల రుణాల లక్ష్యంగా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులున్నాయి. ఇలాంటి సందర్భంలో పంటల రుణమాఫీ కచ్చితంగా రైతులకు వెన్నుదన్నే అవుతుంది. రైతులకు వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే ప్రభుత్వాలు నేరుగా ఆదుకోలేని పక్షంలో, పరోక్షంగా పంటల దిగుబడులు, నాణ్యత పెరిగేందుకు పరిశోధనలు ఆసరా కావాలి. కానీ ప్రభుత్వాలు ఇందుకు కేటాయిస్తున్నది చాలా తక్కువ. వ్యవసాయ పరిశోధన అభివృద్ధి జీడీపీలో మనదేశం 31 శాతం ఖర్చుచేస్తే, అదే సమయంలో చైనా రెండింతలు కేటాయిస్తున్నది. చివరికి చిన్న దేశమైన బంగ్లాదేశ్ సైతం 2010లో 38 శాతం ఖర్చుచేసింది. పెట్టుబడులకు వ్యవసాయ ఆవిష్కరణలకు అవినాభావ సంబంధం ఉన్నది. కాబట్టి ప్రభుత్వం ఇప్పటికైనా కేటాయింపులు పెంచాలి.

రైతుల ఆదాయాలు పెరుగాలంటే పంటల ఉత్పాదకత భారీగా పెరుగాలి. కానీ తక్కువ సరాసరి ఆదాయమున్న దేశాలు సాధిస్తున్న పంటల ఉత్పాదకత కంటే కూడా చాలా తక్కువ ఉత్పాదకత భారత్‌ది. చైనాతో పోలిస్తే అన్ని పంటల్లో సరాసరి ఉత్పాదకత భారత్‌లో తక్కువే. చైనా ఉత్పాదకతలో 61 శాతమే. వరిలో 54 శాతమే. బంగ్లాదేశ్, వియత్నాం, ఇండొనేషియాలతో పోలిస్తే మనదేశంలో వరి ఉత్పాదకత తక్కువే. హరితవిప్లవంతో దేశంలో తిండి గింజల అందుబాటు కచ్చితంగా పెరిగింది. నాటితో పోలిస్తే నేడు ఆహారధాన్యాల ఉత్పత్తి 5 రెట్లు పెరిగింది. అయితే రసాయన ఎరువుల వాడకం పెరిగి భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. భూజలమట్టాలు తగ్గాయి. హరిత వాయువుల విడుదల పెరిగి పర్యావరణ మార్పులు చోటుచేసుకున్నాయి. పంటల కాలాలు మారాయి. పెరుగుతున్న భూ తాపంతో ప్రస్తుతమున్న పంటల రకాలతో దిగుబడులు సగానికి సగం పడిపోతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయి. మొత్తంగా దేశానికి ధాన్యం ఉత్పత్తిలో స్వయం సమృద్ధి లభించింది. ఆహారభద్రత చేకూరింది కానీ అదే సమయంలో రైతులకు ఆదాయ భద్రత మాత్రం చేకూరలేదు. ముఖ్యంగా వరి, గోధుమ పంటలకు సబ్సిడీలు ఎక్కువ అందటం, సాగునీటి వసతి ప్రభుత్వ కనీస మద్దతు ధరల అం దుబాటు ఎక్కువగా ఉండటంతో మిగతా పంటలు నిర్లక్ష్యమయ్యాయి. పరిస్థితులను మార్చే విధాన ప్రణాళికలు ప్రభుత్వాల వద్ద లేవు. ఈ నేపథ్యంలో భూములు, సాగునీటిని సుస్థిరంగా దీర్ఘ కాలం మన్నికతో వాడుకునేందుకు తోడ్పడే 'సతత హరిత విప్లవం' మాత్రమే దేశాన్ని, రైతును అందు కోగలిగేది.

రైతుల ఆదాయాలను 2022-23 నాటికి రెట్టింపు చేస్తామంటున్న ప్రభుత్వం అందుకు అనుకూలమైన వ్యవస్థాపరమైన ప్రణాళికలను ఇంకా పూర్తిచేయలేదు. 2003-2013 వరకు పదేండ్ల కాలంలో రైతుల ఆదాయాల్లో పెరుగుదల సాలీనా 5 శాతం మాత్రమే. ప్రస్తుతం రైతుకు సరాసరి అందుతున్న ఆదాయం చాలా తక్కువ. అయినప్పటికీ రెండింతలు కావాలంటే 12 శాతం వృద్ధి రేటు ఆదాయం అవసరం. కనీసం సాలీనా 10.41 శాతం పెరుగాలంటే ప్రభుత్వ పెట్టుబడులు వ్యవసాయం, సాగు నీరు, గ్రామీణ రోడ్లు, రవాణా, గ్రామీణ శక్తి వనరుల్లో సాలీనా 7.86 రెట్లు పెరుగాల్సిన అవసరముందని జాతీయ వర్షాధార ప్రాంతాల అథారిటీ ఛైర్మన్ అశోక్ ధల్వాయి నేతృత్వంలోని కమిటీ సూచించింది. ఇందుకు 2022-23 నాటికి ప్రభు త్వ పెట్టుబడుల సుమారు 6.39 లక్షల కోట్లు అవసరం. మరి కేంద్రం దీనికి సిద్ధంగా ఉందా? ఒక్క రాష్ట్రానికే పంటల రుణమాఫీకి సవాలక్ష షరతులు పెడుతున్న ప్రభుత్వాలు ఈ మేర పెట్టుబడులకు ధైర్యం చేస్తాయా? ఇక పంట కోత అనంతర నష్టాల విలువ వేల కోట్ల పైనేనని ప్రభుత్వం పదేపదే చెబు తున్నది. మరి శీతల గిడ్డంగులు, మౌలిక సదుపాయాల కల్పన, విలువల జోడింపు, వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనకు ఆర్థిక చేయూతనిచ్చే ప్రయత్నాలు ముమ్మరం కావాలి.

గత పదేండ్లుగా వినిపిస్తున్న మాట ప్రత్యక్ష నగదు బదిలీ. దీంతో రైతులకు నేరగా ఆర్థిక సహాయం అందితే ప్రభుత్వం సైతం అనర్హులకు ఫలితాలు చేరకుండా చేయవచ్చు. కొంతమేరకు ప్రభుత్వం ఆర్థిక భారం తప్పించుకోవచ్చు. అదేతరహాలో కనీస మద్దతు ధరలను సైతం పూర్తిగా సంస్కరణల బాట పట్టించాలి. దేశంలో అపరాల సాగును ప్రోత్సహించటానికి గత రెండేండ్లు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలను కొంత పెంచింది. దాదాపు రెండు లక్షల టన్నుల వరకు సేకరణకు పూనుకున్నది. అయినప్పటికీ రైతులు మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సి వచ్చింది. కాబట్టి పెట్టుబడి ఖర్చులకు తెలంగాణ ప్రభుత్వం 2018 వానకాలం నుంచి ఏటా ఎకరానికి రూ.8 వేలు నేరుగా రైతులకు ఇచ్చేందుకు ఇప్పటికే ప్రకటించింది. ఈ తరహాలో దేశమంతటా రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీని ప్రవేశపెట్టాలి. ఇలాంటి విప్లవాత్మక సంస్కరణలతోనే దేశానికి ఆహార భద్రత, రైతుకు ఆదాయ భద్రత కలుగుతుంది

> దేశంలో అపరాల సాగును ప్రోత్సహించటానికి గత రెండేండ్లు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలను కొంత పెంచింది. దాదాపు రెండు లక్షల టన్నుల వరకు సేకరణకు పూనుకున్నది. అయినప్పటికీ రైతులు మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సి వచ్చింది. కాబట్టి పెట్టుబడి ఖర్చులకు తెలంగాణ ప్రభుత్వం 2018 వానకాలం నుంచి ఏటా ఎకరానికి రూ.8 వేలు నేరుగా రైతులకు ఇచ్చేందుకు ఇప్పటికే ప్రకటించింది. ఈ తరహాలో దేశమంతటా రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీని ప్రవేశపెట్టాలి. ఇలాంటి విప్లవాత్మక సంస్కరణలతోనే దేశానికి ఆహార భద్రత, రైతుకు ఆదాయ భద్రత కలుగుతుంది.

(వ్యాసకర్త: శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం)

ఉన్నత విద్యకు ఊతం

విద్య



డాక్టర్ బైరి నిరంజన్

గత పాలకుల పాపం విద్యార్థులకు శాపంగా మారింది. గత ప్రభుత్వాల హయాంలో విద్య వ్యాపారమైంది. సదువు అంగట్లో సరుకయ్యింది. దీంతో తెలంగాణ విద్యావ్యవస్థ ఛిన్నాభిన్నమైపోయింది. కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వ విద్యకు విలువ పెంచడానికి, బతుకుకు భద్రత ఇవ్వడానికి ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల బలోపేతానికి కృషిచేస్తున్నది. దీనిలో భాగంగా కేజీ టు పీజీ ఉచిత విద్యను ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన దేశంలోనే మొద టి మోడల్ అత్యున్నత విద్యాసంస్థను నెలకొల్పిం ది. రాష్ట్ర యూనివర్సిటీల అభివృద్ధికి రూ.420 కోట్లు కేటాయించింది. నిస్వార్థపూరితంగా పనిచేసే ప్రొఫెసర్ల ను వీసీలుగా నియమించడం, యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించడానికి చర్యలు తీసుకోవడం వల్ల ఉన్నత విద్యాభివృద్ధికి ప్రభుత్వం బలమైన పునాదులు వేస్తున్నది.

మరో 60 మైనార్టీ గురుకులాలు, 119 బీసీ గురుకులాలు, 103 ఎస్సీ గురుకులాలను ఏర్పాటుచేసింది. డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో ప్రిన్సిపాళ్లను నియమించడానికి నోటిఫికేన్ జారీ కోసం ప్రయత్నాలు చేస్తున్నది. ఇది తెలంగాణలో విద్య వికసించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించటానికి బీటెక్, ఎంటెక్, ఎంబీఏలాంటి వృత్తివిద్య కోర్సులు నిర్వహిస్తున్న కాలేజీలకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి తనిఖీలు చేయడం వల్ల నాసిరకం విద్యను అందిస్తున్న కాలేజీలు వాటంతటవే మూతబడిపోయాయి. విద్యార్థులు వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని గెలుచుకొని ఉన్నత లక్ష్యాలతో అత్యున్నత విద్యను అందిస్తున్న కాలేజీల గౌరవం పెరుగడానికి అవకాశం ఏర్పడింది.

కొంతమంది విద్యార్థి, మేధావులు భయపడుతున్నట్లుగా రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో విశ్వవిద్యాలయాలు వస్తే ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రచారం చేస్తున్నారు. కానీ దేశంలో ఆర్థిక సంస్కరణల అనంతరం అనేక రంగాలు ప్రైవేటు రంగంలోకి ప్రవేశించాయి. వీటి విభిన్న ఫలితాలు మన కళ్ల ముందున్నాయి. అందులో ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగంలో ప్రైవేట్ సంస్థలు వచ్చిన తర్వాత మొత్తం మొబైల్ వినియోగదారుల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న వంద మందిలో 62 మంది వినియోగదారులు కాగా, 38 శాతం రిలయన్స్, ఎయిర్‌టెల్‌లాంటి సంస్థలున్నాయి. అది 2016 వచ్చేసరికి వంద మంది 8.45 శాతం మంది వినియోగదారులు బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులుగా ఉండగా, 91.07 శాతం వినియోగదారులు ప్రైవేట్ రంగాల వైపు మొగ్గుచూపారు. ప్రైవేట్ రంగాల అభివృద్ధి రెండింతలు పెరిగింది. కానీ బీఎస్‌ఎన్‌ఎల్, ఎంటీఎన్‌ఎల్ ప్రభుత్వరంగ సంస్థల అభివృద్ధి కుంటుపడింది. బీమా రంగంలో ప్రైవేట్ సంస్థలు వచ్చిన తర్వాత కూడా మొత్తం మార్కెట్ విస్తరణ 2004-16 మధ్య వినియోగదారుల సంఖ్య 17 నుంచి 22 శాతం మాత్రమే పెరిగింది. ఇప్పటికీ ఈ రంగంలో ప్రభుత్వ బీమా సంస్థలు ఎల్ఐసీ, ఎస్‌బీఐ 75 శాతం మార్కెట్ షేర్‌ను తమ ఆధీనంలో ఉంచుకొని ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పరపతిని పెంచుకొని సమాజంలో ఒక నమ్మకమైన సంస్థగా ఏర్పడ్డాయి.

ఈ సందర్భంలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ప్రభుత్వ విశ్వవిద్యాయాలతో పోటీ ఏర్పడిన కూడా భిన్నమైన ఫలితాలు కనిపిస్తున్నాయి. కొన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల కంటే మెరుగ్గా అత్యున్నత విద్యను అందిస్తున్నాయి. అలాంటి వాటిలో బిర్లా, టాటా, సత్యసాయి ట్రస్ట్ ముందు వరుసలో ఉండి లాభార్జన లేని స్వయం ప్రతిపత్తి గల సంస్థలుగా సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయి. కానీ చాలా ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు మాత్రం లాభార్జనే ధ్యేయంగా, సర్టిఫికెట్లు అమ్మడమే మార్గంగా పనిచేస్తూ ఉన్నత విద్యను అవినీతి మయం చేయడం వల్ల ప్రజల్లో ప్రైవేట్ విశ్వవిద్యాలయా లపై అనేక అనుమానాలు నెలకొన్నాయి.

రాష్ట్రంలో ఇప్పటికీ అనేక స్వచ్ఛంద సంస్థలు సేవా భావం కలిగిన వ్యక్తులు అనేక జిల్లాల్లో డిగ్రీ, జూనియర్ కాలేజీలు స్థాపించారు. మౌలిక వసతులు కల్పించి ప్రైవేట్ కాలేజీల ఏర్పాటులో ఎంతో ఉదార స్వభావాన్ని చూపించి లాభార్జన లేకుండా పనిచేస్తున్నారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించాలి.


ముఖ్యంగా ఉస్మానియా గ్రాడ్యుయేట్ అసోసియేషన్, వరంగల్‌లోని చందా కాంతయ్య మెమోరియల్ లాంటి కళాశాలలను స్థాపించి అత్యున్నత విద్యను సమాజానికి అందిస్తున్నాయి. విద్యా వ్యవస్థల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడటం, సమాజానికి పరిశోధనలు అందించడం, అధ్యాపక, విద్యార్థుల మధ్య నిష్పత్తి పెంచడం, అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించడం, మౌలిక వసతుల కల్పన, వినూత్న బోధన పద్ధతుల లాంటి ఐదు అంశాలను గమనంలోకి తీసుకొని నైపుణ్యాభివృద్ధికి తోడ్పడే ప్రైవేట్ విశ్వవిద్యాలయాలను ప్రభుత్వం తీసుకొస్తున్నట్లుగా తెలుస్తున్నది. తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో విద్యను అభ్యసించడానికి వేలమంది విద్యార్థులు తరలి వెళ్తున్నారు. అయితే మన రాష్ట్రంలో కొత్త ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు నెలకొల్పడం వల్ల వివిధ రాష్ట్రాలు, విదేశాలకు తరలివెళ్లే విద్యార్థుల్లో సగం మందినైనా ఇక్కడ చదువుకునే అవకాశం కల్పించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. ఫలితంగా శ్రమ, ధనం వృథా తగ్గుతుంది. అంతే కాదు ఆయా సంస్థలు నెలకొల్పడంతో ఇక్కడ ఉన్నత విద్యావంతులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దీనికంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు కావాల్సిన నిధులు ఎక్కువ మొత్తంలో వెచ్చించాలి. బోధన, పరిశోధన పద్ధతులు మెరుగుపర్చాలి. అంతర్జాతీయ విద్యార్థుల ను ఆకర్షించే విధంగా పరిపాలనా పద్ధతులు అవలంబించాలి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల బలోపేతానికి కావాల్సిన అన్నిరకాల చర్యలు తీసుకోవాలి.

> తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో విద్యను అభ్యసించడానికి వేలమంది విద్యార్థులు తరలి వెళ్తున్నారు. అయితే మన రాష్ట్రంలో కొత్త ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు నెలకొల్పడం వల్ల వివిధ రాష్ట్రాలు, విదేశాలకు తరలివెళ్లే విద్యార్థుల్లో సగం మందినైనా ఇక్కడ చదువుకునే అవకాశం కల్పించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. ఫలితంగా శ్రమ, ధనం వృథా తగ్గుతుంది. అంతే కాదు ఆయా సంస్థలు నెలకొల్పడంతో ఇక్కడ ఉన్నత విద్యావంతులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.




నేపాల్ ప్రజలకు భారత్ అన్నివిధాలా అండగా నిలుస్తుంది. వరదలతో తల్లడిల్లుతున్నవారికి కావలసిన సాయాన్ని అందిస్తుంది.

నరేంద్రమోదీ



నేర చరిత్ర ఉన్నవారు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు గోరఖ్‌పూర్ లాంటి విషాదాలు జరుగుతూనే ఉంటాయి. వారి ఎజెండాలో మందిర నిర్మాణం, గో రక్షణ మాత్రమే ఉంటుంది. మనుషులు ఉండరు.

ప్రశాంత్ భూషణ్



డోక్లామ్ ఉద్రిక్తతలను శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కరించుకుంటేనే 'బ్రిక్స్'కు అర్థం, పరమార్థం ఉంటుంది.

సుధీంద్రకులకర్ణి



ఎన్డీయేలో ఏఐఏడీఎంకే చేరికతో ఏం జరుగుతుందో ఊహకందనిదేం కాదు. ఏఐఏడీఎంకే నేతలపై వచ్చిన అవినీతి ఆరోపణలన్నీ కావేరీ నదిలో కొట్టుకుపోతాయి.

రాజ్‌దీప్ సర్దేశాయ్

అభివృద్ధి పథంలో అన్నివర్గాలు

తెలంగాణం



జలగం వెంకట రావు

'ప్రపంచానికి అధినేతగా ఉండటం కంటే రైతుగా ఉండటమే నాకు బాగా ఇష్టం' అంటాడు జార్జి వాషింగ్టన్.

తొలకరి పలుకరించింది. రాష్ట్రమంతా వానలు కురుస్తున్నాయి. ఎక్కడ చూసినా వ్యవసాయ పనుల సంబురం అంబరాన్నంటుతున్నది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ కూడా పూర్తిగా సన్నద్ధమైంది. వానకాలం, యాసంగి సీజన్లకు కలిపి 90.89 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యంగా 5,755 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. అలాగే సుమారు రూ.46 వేల కోట్లతో రుణ ప్రణాళికను ఖరారు చేసింది. అందరికీ అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచింది.

రైతన్నలు కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల బారిన పడి నష్టపోకూడదని సీఎం కేసీఆర్ దృఢ సంకల్పం. అందుకే కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రేతలను పీడీ యాక్ట్ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలవారీ రైతుల సమగ్ర సర్వే గడువు ముగిసినప్పటకీ వివిధ కారణాల వల్ల వివరాలు అందించని రైతులు వెంటనే నమోదు చేసుకొనే వీలు కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా వంద సంచార పశు వైద్యశాలలు ప్రారంభించాలని నిర్ణయించింది. రైతులకు ఇబ్బందులు తొలిగించేందుకు రికార్డ్ ఆఫ్ రైట్స్ చట్టానికి సవరణలు చేసే ఆర్డినెన్స్‌ను మంత్రివర్గం ఆమోదించింది. పదిహేను రోజుల్లోనే మ్యుటేషన్ చేయాలని, ఒకటే పాసు పుస్తకం ఉండాలని సవరణలు చేసింది.

వ్యవస్థాగతంగా వ్యవసాయ, అనుబంధ శాఖలను బలోపేతం చేస్తున్నారు. మరోవైపు ఆయా రంగాల మీద ఆధారపడిన వారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు ప్రవేశపెడుతున్నారు. 1500 వ్యవసాయ విస్తరణాధికారులను భర్తీ చేయడమే కాకుండా వ్యవసాయశాఖ అధికారులతో స్వయంగా రోజంతా సమావేశమై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల భర్తీకి అనుమతినిచ్చారు. అన్ని జిల్లాలోనూ కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. తెలంగాణ ఉద్యాన పంటలకు అనుకూలమైనది కావడంతో సీఎం కేసీఆర్ ఆ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. హార్టికల్చర్ విశ్వవిద్యాలయం పనులు ప్రారంభించారు. ఆ శాఖలో, విశ్వవిద్యాలయంలో పోస్టులను భర్తీ చేయడానికి అనుమతులు ఇచ్చారు.

వ్యవసాయ ఉత్పత్తుల నిల్వల విషయంలో రైతాంగానికి ఏ మాత్రం ఇబ్బందులు రాకుండా ఉండాలన్న ఉద్దేశంతో రూ.1024 కోట్లతో మార్కెటింగ్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా 325 గిడ్డంగుల నిర్మాణం చేపట్టింది. అన్ని మార్కెట్ కమిటీలకు దాదాపు పాలక మండళ్లను నియమించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా కేసీఆర్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవాప్తంగా ఉన్న నాలుగు లక్షల యాదవ కుటుంబాలకు ప్రయోజనం కలిగించేందుకు 75 శాతం రాయితీపై 84 లక్షల గొర్రెలను పంపిణీ చేయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. రూ. లక్షా 25 వేల విలువ తో 20 గొర్రెలు, ఒక పొట్టేలు లబ్ధిదారులకు అందజేస్తున్నారు. పశుసంవర్ధక శాఖ ఈ జూన్‌లో ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ఈ పథకం ద్వారా ఒనగూరే బహుళ ప్రయోజనాలను చూస్తుంటే సీఎం కేసీఆర్ దూరదృష్టి అర్థమవుతున్నది. ఈ పథకం వల్ల మాంసం ఉత్పత్తిలో రాష్ట్రం స్వయం సమృద్ధి సాధిస్తుంది. మాంసం కోసం జీవాల దిగుమతి వ్యయాలు తగ్గుతాయి. యాదవులు ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయి. 84 లక్షల గొర్రెల పంపిణీ వల్ల రానున్న రోజుల్లో అనేక లక్షల టన్నుల గొర్రెల ఎరువు అందుబాటులోకి రానున్నది. దీనివల్ల రసాయన ఎరువుల వినియోగం స్థానే సేంద్రియ ఎరువుల వాడకం పెరిగే పరిస్థితులు ఏర్పడుతాయి.

రాష్ట్రంలో చేపల పెంపకాన్ని విరివిగా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 4,550 చెరువుల్లో రూ.24 కోట్ల వ్యయంతో 27 కోట్ల చేప పిల్లలను చెరువుల్లోకి వదిలింది. ఈ ఏడాది 24 వేల చెరువుల్లో సుమారు 70 కోట్ల చేప పిల్లలను చెరువుల్లో వదులాలని నిర్ణయం తీసుకున్నది. దీనివల్ల చేపల ఉత్పత్తి పెరిగి, చేపల పెంపకంపై ఆధారపడిన వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడనున్నది. ఆరోగ్య కారణాల రీత్యా ఆహారంలో చేపల వినియోగం పెరుగుతున్న పరిస్థితుల్లో వినియోగదారులకు సరసమైన ధరలకే చేపలు అందుబాటులోకి రానున్నాయి.

పంటలు బాగుండాలంటే వర్షాలు బాగా కురువాలి. అవి కురువాలంటే పర్యావరణ సమతుల్యత కాపాడాలి. కానీ సమైక్య పాలనలో వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం స్వార్థ ప్రయోజనాల కోసం అడవులను విచక్షణా రహితంగా నరికారు. ఆ పరిస్థితిని మార్చి తెలంగాణను హరిత తెలంగాణగా మార్చడానికి సీఎం కేసీఆర్ హరిత హారం పథకానికి శ్రీకారం చుట్టారు. తానే స్వయంగా జిల్లాలు తిరిగి మొక్కలు నాటి నాలుగేళ్లలో 230 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంపై అందరినీ సమాయాత్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో స్వయంగా సమావేశమై ప్రోత్సహిస్తున్నారు.

రాష్ట్రంలోని ప్రతి ఎకరానికి సాగు నీరందించడం కోసం ఆయన కొన్ని నెలలపాటు అహర్నిశలూ అధికారులు, సాంకేతిక నిపుణలతో సాగునీటి ప్రాజెక్టుల గురించి చర్చోపచర్చలు చేశారు. ఉద్యమ సమయంలో తాను సంపాదించిన క్షేత్రస్థాయి అనుభవాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ప్రాజెక్టులను రీ డిజైన్ చేశారు. ఇదే అంశంపై నిండు సభలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తానే స్వయంగా ఇచ్చి సాంకేతిక నిపుణలు సైతం అబ్బురపడేలా చేశారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు స్వార్థపరులు సృష్టిస్తున్న అడ్డంకులు మెల్లమెల్లగా తొలిగిపోతున్నా యి. పనులు ముమ్మరమవుతున్నాయి. మెదక్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాగునీటి జలాలు పొలాల్లో పారుతున్నాయి. అటు పెద్ద నీటి ప్రాజెక్టులతో పాటు చిన్న నీటి వనరులపైన కేసీఆర్ ప్రత్యేక దృష్టిపెట్టారు. కాకతీయుల కాలంలో చెరువులకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని గుర్తుకుతీసుకువచ్చేలా మిషన్ కాకతీయ పథకం ద్వారా రాష్ట్రంలోని అన్ని చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుతం ఈ పథకం మూడవ దశ పనులు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

ఇప్పటికే ఈ చరిత్రాత్మక పథక ఫలాలు గ్రామీణులు, రైతులకు అందుతున్నాయి. చెరువుల పూడికతీత మట్టి పొలాల జవసత్వాలను పెంచుతున్నది. భూగర్భ జలాల మట్టం పెరిగింది. గతేడాది చెరువుల కింద సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. చెరువులు నిండుకుండల్లా తొణికసలాడుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ సుమారు 36 లక్షల మంది రైతులకు దాదాపు రూ.17 వేల కోట్లతో రుణాలను మాఫీ చేసి రైతుల ఆర్థిక భారాన్ని తీర్చారు.

రైతాంగ సంక్షేమం కోసం అనుక్షణం పనిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ మధ్యనే ఓ విప్లవాత్మక ప్రకటనను చేశారు. రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఒక్కో సీజన్‌కు ఎకరానికి రూ.నాలుగు వేలతో పెట్టుబడి వచ్చే ఏడాది నుంచి అందించనున్నట్లు వెల్లడించారు. ఈ పెట్టుబడిని రైతులు తమ వ్యవసాయ అవసరాలకు వినియోగించుకోవచ్చునని ప్రకటించారు. ఇందుకోసం రాష్ట్రం అంతటా వ్యవసాయశాఖ రైతు సమగ్ర సర్వేను చాలా సమర్థవంతంగా నిర్వహించింది. దాదాపు అది పూర్తి కానున్నది. తదుపరి గ్రామ సభలను నిర్వహించి లబ్ధిదారుల జాబితాలను ప్రకటిస్తారు. వారికి ప్రభుత్వం తరపున ఎకరానికి రూ. 4 వేల చొప్పున రెండు సీజన్లకు రూ.8 వేలు అందజేస్తారు.

వీటన్నింటితో పాటు తాము పండించే పంటలకు సరైన ధరలు రావడానికి, ధర నిర్ణాయక శక్తి రైతులకు కల్పించాలనే ఉద్దేశంతో రైతు సమాఖ్యల ఏర్పాటును కేసీఆర్ ప్రతిపాదించారు. గ్రామ, జిల్లా, రాష్ట్రస్థాయి.. మూడంచెల్లో ఈ రైతు సమాఖ్యల ఏర్పాటు ఉంటుంది. సమిష్టి తత్త్వంతో, సంఘటితశక్తితోనే బేరమాడే శక్తి లభిస్తున్నదన్న వాస్తవిక ఆలోచనతో సీఎం కేసీఆర్ తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం కూడా వాస్తవ రూపం దాలిస్తే.. దాంతో పాటు ఇప్పటికే తీసుకున్న అనేక చరిత్రాత్మక రైతు సంక్షేమ కార్యక్రమాలతో దేశంలోనే తెలంగాణ రైతాంగ సమాజం ఆత్మగౌరవంతో, సాధికారతతో నిలబడుతుంది.

> తాము పండించే పంటలకు సరైన ధరలు రావడానికి, ధర నిర్ణాయక శక్తి రైతులకు కల్పించాలనే ఉద్దేశంతో రైతు సమాఖ్యల ఏర్పాటును కేసీఆర్ ప్రతిపాదించారు. గ్రామ, జిల్లా, రాష్ట్రస్థాయి.. మూడంచెల్లో ఈ రైతు సమాఖ్యల ఏర్పాటు ఉంటుంది. సమిష్టి తత్త్వంతో, సంఘటితశక్తితోనే బేరమాడే శక్తి లభిస్తున్నదన్న వాస్తవిక ఆలోచనతో సీఎం కేసీఆర్ తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం కూడా వాస్తవ రూపం దాలిస్తే.. దాంతోపాటు ఇప్పటికే తీసుకున్న అనేక చరిత్రాత్మక రైతు సంక్షేమ కార్యక్రమాలతో దేశంలోనే తెలంగాణ రైతాంగ సమాజం ఆత్మగౌరవంతో, సాధికారతతో నిలబడుతుంది.

(వ్యాసకర్త: శాసనసభ్యులు, కొత్తగూడెం)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఉక్కు పరిశ్రమ కావాలి

- బయ్యారంలో ఏర్పాటుచేయండి
- కేంద్ర గనుల శాఖ కార్యదర్శితో మంత్రి కేటీఆర్
- రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఉంటుందని వెల్లడి



శనివారం హైదరాబాద్ బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కే తారకరామారావుతో సమావేశమైన కేంద్ర గనులశాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు.. కేంద్ర గనులశాఖ కార్యదర్శి అరుణ్ కుమార్‌కు విజ్ఞప్తిచేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, వెంటనే కార్యాచరణ ప్రారంభించాలని కోరారు. శనివారం హైదరాబాద్‌కు వచ్చిన అరుణ్‌కుమార్ బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్రగనుల శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న పలు అంశాలను పరిష్కరించాలని కేటీఆర్ కోరారు. రాష్ట్ర విభజన సమయంలో బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్రం ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని విన్నవించారు. గతంలో ఎలాంటి ఇనుప ఖనిజాలు లేని విశాఖపట్నంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేశారని, అవసరమైన మేరకు ఇనుప ఖనిజ నిల్వలున్నా.. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో ఆలస్యం చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రంగాల్లో వెనుకబడిందని, రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా కేంద్ర ప్రభుత్వం అత్యధిక సాయం ఏపీకే చేసిందన్నారు. చట్టం పేర్కొన్న అంశాలను కూడా తెలంగాణకు ఇవ్వడంలో కేంద్రం పూర్తిస్థాయిలో సఫలంకాలేదని అరుణ్‌కుమార్‌కు వివరించారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం తరఫున బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకోసం పలుమార్లు కేంద్ర మంత్రులను కలిసినా స్పందించడంలేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. స్టీల్ ప్లాంటుతో ఖమ్మంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం అత్యవసరమని, దీనిపై తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలను నిరంతరం కొనసాగిస్తుందని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర గనులశాఖ డైరెక్టర్ సుశీల్‌కుమార్, టీఎస్ఎండీసీ ఎండీ మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

పురపాలక శాఖపై రేపు మంత్రి కేటీఆర్ సమీక్ష

పురపాలక శాఖ మంత్రి కే తారక రామారావు సోమవారం ఉదయం బేగంపేట క్యాంపు కార్యాలయంలో ఆ శాఖపై సమీక్షించనున్నారు. ఇందులో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, సీడీఎంఏ, జలమండలి, డీటీసీపీ తదితర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొంటారు. నగరాలు, పట్టణాల్లో ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల అమలు తీరుపై చర్చించనున్నారు. అన్ని విభాగాల ఆర్థిక స్థితిగతులు, ముఖ్యమైన పథకాలకు రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించిన నిధులపై మంత్రి చర్చిస్తారని సమాచారం. కేంద్రంతో అపరిష్కృతంగా అంశాలపై, మెప్మా, పారిశుద్ధ్య విభాగాల్లో సమస్యలపై చర్చించనున్నట్టు తెలిసింది. నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ ఏర్పాట్ల గురించి కూడా కేటీఆర్ సమీక్షించనున్నారు.

ఏడుగురు రాష్ట్ర టీచర్లకు జాతీయ అవార్డులు

సెప్టెంబర్ ఐదున పురస్కారాల ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులకు కేంద్రప్రభుత్వం జాతీయ అవార్డులను ప్రకటించింది. వీరిలో నలుగురు ప్రాథమిక స్కూల్ టీచర్లు, ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నట్టు శనివారం విద్యాశాఖ అధికారులు తెలిపారు. అవార్డులకు ఎంపికైన వారిలో నిర్మల్ జిల్లా, ఖానాపూర్ మండలం ఎల్లాపూర్ ఎంపీపీఎస్ స్కూల్ టీచర్ విల్గోటి కిషన్, నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడ ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ కుక్కమూడి జనార్దన్, నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం యూపీఎస్ స్కూల్ అసిస్టెంట్ టీచర్ మంతటి నారాయణ, నిజామాబాద్ జిల్లా మోగుపల్లి మండలం ఎంపీపీఎస్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం నునుగొండ విజయలక్ష్మి ఉన్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్‌కు సంబంధించి మంచిర్యాల జిల్లా మంచిర్యాల జెడ్పీ సెకండరీ స్కూల్ (బాలుర) స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ) గుండేటి యోగేశ్వర్, జగిత్యాల జిల్లా జెడ్పీహెచ్ఎస్, స్కూల్ అసిస్టెంట్ కందుకూరి సురేందర్, ఖమ్మం జిల్లా ఎన్కూర్ మండలం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ పొట్ట రామారావు ఉన్నారు. సెప్టెంబర్ ఐదున ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారికి జాతీయ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

జీఎస్టీని తగ్గించడానికి కేంద్రంపై ఒత్తిడి

బీడీ పరిశ్రమల యజమానులతో మంత్రి కేటీఆర్ సమావేశం

కార్మికులకు, పరిశ్రమలకు అండగా ఉంటామని భరోసా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బీడీ పరిశ్రమపై జీఎస్టీని తగ్గించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు పేర్కొన్నారు. శనివారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో బీడీ పరిశ్రమల యాజమానులతో మంత్రి కేటీఆర్ భేటీ అయ్యారు. జీఎస్టీతో బీడీ పరిశ్రమ యజమానులు, కార్మికులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో.. వారికి రాష్ట్ర ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. బీడీ పరిశ్రమపై జీఎస్టీ తగ్గించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశారని, వచ్చేనెల హైదరాబాద్‌లో నిర్వహించే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మరోసారి ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. వివిధ రాష్ట్రాల్లో బీడీ పరిశ్రమపై ఆధారపడ్డ వారిపై జీఎస్టీ తీవ్ర ప్రభావం చూపిందని, ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను, పార్టీలను కలిసి కేంద్రంపైన ఒత్తిడి తీసుకురావాలని కంపెనీల యాజమాన్యాలకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్రం స్పందించిందని, మరింత ఒత్తిడి తీసుకొస్తే కచ్చితంగా జీఎస్టీ పన్ను రేటును తగ్గిస్తుందని చెప్పారు. ఈ దిశగా పరిశ్రమకు, కార్మికులకు తమ ప్రభుత్వం మద్దతు ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. బీడీ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని, దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ. వెయ్యి పింఛను ఇస్తున్నదని వివరించారు.



శనివారం జలసౌధలో ప్రభుత్వ ప్లీడర్లు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులతో జరిగిన సమన్వయ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ప్రాజెక్టుల కేసుల్లో ప్రభుత్వమే గెలువాలి

సాగునీటి పనులకు కేసులు అడ్డంకి కారాదు • అవసరమైతే సీనియర్ లాయర్లను పెట్టుకోండి

వాట్సప్ గ్రూపుతో సమాచారం మార్చుకోండి • ఇరిగేషన్ జీపీలకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం

ప్రాజెక్టుల ప్రయోజనాలపై ప్రజల్లో ప్రచారంచేద్దాం • మంత్రులు, ప్రజాప్రతినిధులతో హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వివిధ ప్రాజెక్టులమీద దాఖలైన కేసులు వేగంగా పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వ న్యాయవాదులు, ఇరిగేషన్ ఉన్నతాధికారులను ఆదేశించారు. జిల్లాల్లో దాఖలవుతున్న కేసుల్లో సమర్థ వాదనలకు అవసరమైతే హైదరాబాద్, ఢిల్లీ నుంచి సీనియర్ న్యాయవాదులు, నిష్ణాతులను నియమించుకోవాలని సూచించారు. ఆయా కేసుల్లో సమాచారం ఇచ్చి పుచ్చుకోవడానికి, వివిధశాఖల మధ్య సమన్వయానికి ప్రభుత్వ న్యాయవాదులు, ఇరిగేషన్ అధికారులు, ఇతర అధికారులు ఒక వాట్సప్ గ్రూపు ఏర్పాటుచేసుకోవాలని చెప్పారు. ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కావాలని కొందరు కేసులు వేస్తున్నందున, మరింత అప్రమత్తంగా ఉండి బలమైన వాదనలతో ఆ ప్రయత్నాలను వమ్ము చేయాలని కోరారు. కేసుల కారణంగా ప్రాజెక్టులు నిలిచిపోతే ఆ భారం ఖజానాపై పడుతుందని, నిర్ణీత వ్యవధిలో ప్రాజెక్టులు పూర్తికాకపోతే రైతులకు న్యాయం చేయలేమని చెప్పారు. శనివారం జలసౌధలో ప్రభుత్వ ప్లీడర్లు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులతో మంత్రి సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్ రంగంలో ఇలాంటి సమన్వయ సమావేశాన్ని నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా హరీశ్‌రావు వివిధ ప్రాజెక్టులపై దాఖలైన కోర్టు కేసులను సమీక్షించి అన్ని కేసులలో ప్రభుత్వం గెలువాల్సిందేనని స్పష్టంచేశారు. కౌంటర్ అఫిడవిట్లను సకాలంలో దాఖలు చేయకపోవడం, సమర్థంగా వాదించకపోవడం వంటి కారణాలతో కోర్టులు కొన్ని సందర్భాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర్వులిస్తు న్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దీర్ఘకాలిక వ్యూహంతో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేశారని, దానికనుగుణంగా ఇరిగేషన్, రెవెన్యూ, న్యాయ శాఖలు, ఇతర ప్రభుత్వ సంస్థలు సమన్వయంతో పని చేయాలని కోరారు. దేవాదుల, ఏఎంఆర్పీ కల్వకుర్తి వంటి కొన్ని ప్రాజెక్టులలో పది, ఇరవై ఎకరాల భూసేకరణపై కోర్టు కేసుల కారణంగా వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాజెక్టులు ఆపేందుకే కేసులు

ప్రాజెక్టులను అడ్డుకోవడానికి కొందరు వ్యక్తులు, శక్తులు అటు గ్రీన్ ట్రిబ్యునల్ , ఇటు హైకోర్టుల్లో తప్పుడు కేసులు వేస్తున్నారన్నారు. బలమైన వాదనలు వినిపించి వీటిని సమర్థంగా ఎదుర్కోవాలని ఇరిగేషన్ 'లీగల్ టీమ్'ను ఆయన ఆదేశించారు. ఏవైనా కేసుల్లో స్టే వస్తే వెంటనే దాన్ని వెకేట్ చేయించేందుకు అన్ని చర్యలను తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వ ప్లీడర్లు, ఇరిగేషన్ అధికార యంత్రాంగం, రెవెన్యూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రొ యాక్టివ్‌గా పని చేయాలని మంత్రి కోరారు.

వాట్సప్‌గ్రూపు ఏర్పాటు చేసుకోండి..

భూ సేకరణ, ఇతర అంశాలపై జిల్లాల వారీగా, ప్రాజెక్టుల వారీగా కేసుల జాబితాలను సిద్ధం చేసి, ఆ కేసుల పరిష్కారానికి చర్యలను తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ, ప్రభుత్వ ప్లీడర్ల మధ్య సమన్వయ లోపం వల్ల కూడా కేసుల పరిష్కారంలో జాప్యం జరుగుతున్నదని కొందరు జిల్లా జీపీలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకోసమే ప్రత్యేకంగా ఒక లీగల్ విభాగాన్ని నెలకొల్పామని, ఈ లీగల్ టీమ్‌తో జిల్లాల ప్రభుత్వ న్యాయవాదులు, ఇరిగేషన్ అధికారులు వాట్సప్ గ్రూపు ఏర్పాటుచేసుకొని సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవాలని చెప్పారు. ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్కే జోషి, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్, టీఎస్ లా సెక్రటరీ నిరంజన్‌రావు, ఈఎన్సీ మురళీధర్‌రావు, ఈఎన్సీ (అడ్మిన్) నాగేందర్‌రావు, కాళేశ్వరం సీఈ ఎన్ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రభుత్వ ప్లీడర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నూతన్ మల్లేపల్లి సాగునీటి ప్రాజెక్టుల కేసులు, వాటి పరిస్థితిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

సమన్వయంతో ప్రాజెక్టులు పూర్తి చేసుకుందాం..

అనంతరం పలువురు మంత్రులు, టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మంత్రి హరీశ్‌రావు సమావేశమైనట్టు తెలిసింది. సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరినట్టు తెలిసింది. కాళేశ్వరం, ఎస్సారెస్పీ పునర్జీవ పథకం, మిడ్ మానేరు, తదతర ప్రాజెక్టుల గురించి ప్రధానంగా చర్చించారు. ప్రతిపక్షాలు రైతులను రెచ్చగొడుతున్న నేపథ్యంలో ఆయా ప్రాజెక్టుల ప్రాధాన్యం, వాటివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు ఒకటికి రెండుసార్లు వివరించాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిసింది.

ఫొటో ఒక సంభాషణ

ఫొటో, వీడియో జర్నలిస్టుల శ్రమ ప్రశంసనీయం • బతుకమ్మ పండుగకు ఫొటో కాంపిటీషన్ నిర్వహిస్తాం • 'తెలంగాణ ఫొటోగ్రఫీ దినోత్సవం'లో ఎంపీ కవిత



శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఫొటోగ్రఫీ దినోత్సవంలో మాట్లాడుతున్న నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, టీయూడబ్ల్యూజే నేతలు పల్లె రవికుమార్, భాస్కర్ కూడా ఉన్నారు.



ఎంపీ కవిత చేతులమీదుగా అవార్డులు అందుకుంటున్న నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్లు బందిగ గోపి (మహబూబ్‌నగర్ జిల్లా), కంది సన్నీ (హైదరాబాద్), ఆర్ ఆకాశ్ (నల్లగొండ)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

'ఫొటో ఒక సంభాషణ. ఫొటోగ్రాఫర్ సన్నివేశాలను రచయిత పాత్రలో ప్రపంచానికి వివరిస్తాడు. చారిత్రక ఘట్టాలకు సజీవ సాక్ష్యంగా ఫొటో నిలుస్తుంది. దర్శకుల వలె ఫొటోజర్నలిస్టులు తెరవెనుక ఉండి పనిచేస్తారు' అని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. వృత్తిరీత్యా ఫొటో, వీడియో జర్నలిస్టులు ఎంతో శ్రమిస్తారని, వారికష్టం వెలకట్టలేనిదని చెప్పారు. తెలంగాణ పర్యాటకశాఖ, భాష, సాంస్కృతికశాఖ, తెలంగాణ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ సంయుక్తంగా శనివారం రవీంద్రభారతిలో నిర్వహించిన 'తెలంగాణ ఫొటోగ్రఫీ దినోత్సవం'లో ఎంపీ కవిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని టీయూఎఫ్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోకాంపిటీషన్‌లో విజేతలైన ఫొటోజర్నలిస్టులకు ఆమె బహుమతులు అందజేశారు. అనంతరం ఎంపీ కవిత మాట్లాడుతూ ఫొటో, వీడియో జర్నలిస్టుల కష్టాన్ని గుర్తించిన తెలంగాణ సర్కారు వారి సంక్షేమంపై దృష్టిసారించిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఫొటోజర్నలిస్టుల పాత్ర చారిత్రాత్మకమని, ఉద్యమాన్ని రగిలించడంలో ముఖ్యభూమిక పోషించారని ప్రశంసించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఫొటో కాంపిటీషన్‌ను ఈసారి మరింత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామని, ఫొటోజర్నలిస్టులు కూడా ఇందులో పాల్గొనాలని కోరారు.

ఫొటో, వీడియో జర్నలిస్టులకు నైపుణ్యాభివృద్ధి సర్టిఫికెట్ కోర్సు

దేశంలో ఎక్కడా లేనివిధంగా రిపోర్టర్లు, సబ్‌ఎడిటర్లతో సమానంగా ఫొటో, వీడియో జర్నలిస్టులకు పథకాలు అమలుచేస్తున్నామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ చెప్పారు. జేఎన్టీయూ ఫైనార్ట్స్ విభాగం సహకారంతో ఫొటో, వీడియో జర్నలిస్టులు నైపుణ్యం పెంపొందించుకునేందుకు వీలుగా సర్టిఫికెట్ కోర్సు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షుడు రవికుమార్, తెలంగాణ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, కోశాధికారి వినయ్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చిన్న యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'నమస్తే తెలంగాణ'కు మూడు బహుమతులు

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఫొటో కాంపిటీషన్‌లో 'నమస్తే తెలంగాణ' కు చెందిన ఫొటోగ్రాఫర్లు మూడు కన్సొలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. కన్సొలేషన్ ఏ విభాగంలో నల్లగొండకు చెందిన ఆర్ ఆకాశ్, పండుగలు, జాతరల విభాగంలో సన్నీ, పల్లెఅందాల విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బందగె గోపి బహుమతులు సాధించారు. విజేతలు ఎంపీ కల్వకుంట్ల కవిత చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు.

శభాష్.. మహేశ్

- హరితహారం కోసం బైక్‌పై దివ్యాంగుడి ప్రచారం
- అభినందించిన అటవీశాఖమంత్రి జోగు రామన్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమంతో మానవ మనుగడ సాధ్యం అనే నినాదంతో మహేశ్ అనే దివ్యాంగుడు ద్విచక్ర వాహనంపై రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతూ మొక్కలు నాటడంపై అవగాహన కల్పించారు. మేడ్చల్ జిల్లా షామీర్‌పేట మండలం లింగాపూర్ తండాకు చెందిన మహేశ్ తన బైక్‌పై హరితహారం బ్యానర్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఫొటో పెట్టుకుని హరితహారంపై ప్రచారం సాగించారు. మొక్కలు నాటడం ద్వారా కలిగే మేలును గ్రామ గ్రామానా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. హరితహారం కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు 37 రోజులపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలో తిరిగి వచ్చిన ఆయన శనివారం అటవీశాఖమంత్రి జోగు రామన్నను బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆ యువకుడిని మంత్రి అభినందించారు. త్వరలో మహేశ్‌ను తగినవిధంగా గౌరవిస్తామని తెలిపారు.



'హరితహారంతోనే మానవ మనుగడ సాధ్యం' అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా బైక్‌పై ప్రచారంచేస్తూ శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మంత్రి జోగు రామన్నను కలిసిన దివ్యాంగుడు మహేశ్

ఆర్ట్ గ్యాలరీలో ఘనంగా ఫొటోగ్రఫీ డే

చరిత్రకు నిదర్శనం ఫొటో: అల్లం నారాయణ



శనివారం మాదాపూర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఐ అండ్ పీఆర్ కమిషనర్ నవీన్ మిట్టల్ చేతులమీదుగా ఉత్తమ వార్తా చిత్రం విభాగంలో కన్సొలేషన్ బహుమతి అందుకుంటున్న నమస్తే తెలంగాణ సంగారెడ్డి ఫొటోగ్రాఫర్ కే సాయిలు

కొండాపూర్: ఛాయాగ్రాహకుడు తీసే ఒక్కో ఫొటో వెనుక ఎంతో కష్టం ఉంటుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో తెలంగాణ సమాచార, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో కలిసి ప్రారంభించారు. ఉత్తమ వార్తా చిత్రం విభాగంలో కన్సొలేషన్ బహుమతిని సంగారెడ్డి 'నమస్తే తెలంగాణ' ఫొటోగ్రాఫర్ కే సాయిలుకు అల్లం నారాయణ, నవీన్‌మిట్టల్ అందజేశారు. ఛాయాగ్రాహకుడు తీసే ఒక్కో ఫొటో ఎన్నో రకాల భావాలను వ్యక్తపరుస్తుందని అల్లం నారాయణ అన్నారు. ఫొటోలు చరిత్రకు నిదర్శంగా నిలుస్తాయని, ఎన్నో ఏండ్ల మన సంస్కృతి, సంప్రదాయాలను ఫొటో రూపంలో నిలిచి ఉంటాయన్నారు. మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్టులకు త్వరలోనే జేఎన్‌యూలో స్వల్ప వ్యవధి కోర్సులను అందించేందుకు ప్రభుత్వం తరఫున కృషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఫొటోలను ఎంపికచేసేందుకు ఫొటోలను మూడు క్యాటగిరీలుగా విభజించినట్లు సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. బంగారు తెలంగాణ విభాగంలో హరితహారం చిత్రానికిగాను సీహెచ్ నరేందర్, సాంస్కృతిక విభాగంలో ఆర్‌కే కుమారస్వామి, మిషన్ భగీరథ చిత్రానికి కే శ్రీనివాస్ ఎంపికయ్యారు. తెలంగాణ పండుగలు విభాగంలో వనం శరత్‌బాబు, రాజశేఖర్, వేణుగోపాల్ ఎంపిక కాగా, ఇతర న్యూస్ విభాగంలో వై శ్రీకాంత్, పీ పద్మావతి, ఏ సురేశ్ విజేతలుగా నిలిచారు. వీరితోపాటు పలువురికి ప్రోత్సాహక బహుమతులను మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌యూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ రిజిస్ట్రార్ ప్రదీప్, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, వెంకటేశం ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఫొటో జర్నలిస్టులకు మరింత గుర్తింపు రావాలి

ఐజేయూ సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్



శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో ఫొటో ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం చిత్రాలను తిలకిస్తున్న దేవులపల్లి అమర్, విరాహత్ అలీ, గంగాధర్, హరి తదితరులు

బషీర్‌బాగ్: వార్తాప్రపంచానికి ఫొటో జర్నలిజం ప్రాణమని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్ అన్నారు. ఫొటో జర్నలిస్టుకు దక్కాల్సిన ప్రాధాన్యం, గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం-2017 ఉత్తమ వార్తా ఛాయా చిత్రాల పోటీలు నిర్వహించింది. ఈ పోటీకి వచ్చిన ఫొటోల ప్రదర్శనను శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక పత్రికల్లో పనిచేస్తున్న ఫొటో జర్నలిస్టులను మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్ చెప్పారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విరాహత్ అలీ మాట్లాడుతూ.. ఫొటో జర్నలిస్టులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారికి తగిన గుర్తింపు వచ్చేలా పోటీలు నిర్వహించడాన్ని స్వాగతించారు. కార్యక్రమంలో సీనియర్ ఫొటో జర్నలిస్టులు డీ రవీందర్‌రెడ్డి, కే రవికాంత్‌రెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి కేఎన్ హరి, ఫొటో జర్నలిస్టుల సంఘం నాయకులు కే అనిల్‌బాబు, వీ రామమూర్తి, వసంత కుమార్, ఎం శివకుమార్, హెచ్‌యూజే ప్రధాన కార్యదర్శి శివ శంకర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు తేలుకంటి వేణుగోపాల్ పాల్గొన్నారు. సాయంత్రం విడుదల చేసిన ఫొటోకాం టెస్ట్ ఫలితాల్లో వరంగల్ జిల్లా నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్ గొట్టె వెంకన్నకు ప్రోత్సాహక బహుమతి లభించించినట్టు ప్రకటించారు.

యూపీలో ఘోర రైలు ప్రమాదం

23 మంది మృతి.. 72 మందికి గాయాలు

- మృతుల సంఖ్య పెరిగే అవకాశం.. బోగీల మధ్య చిక్కుకున్న 400 మంది ప్రయాణికులు
- విచారణకు రైల్వే మంత్రి సురేశ్ ప్రభు ఆదేశం • ప్రధాని మోదీ తీవ్ర విచారం
- ఉగ్రకోణంపై పోలీసుల దర్యాప్తు



ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ప్రమాదంలో తుక్కుగా మారిన ఒక బోగి

ముజఫర్‌నగర్, ఆగస్టు 19 : ఉత్తరప్రదేశ్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. పూరీ – హరిద్వార్ మధ్య నడిచే ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన 14 బోగీలు ముజఫర్‌నగర్ జిల్లాలోని ఖతౌలీ వద్ద శనివారం సాయంత్రం 5.45 గంటల సమయంలో పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో 23 మృతి చెందగా, 72 మంది క్షతగాత్రులయ్యారని రైల్వేశాఖ అధికార ప్రతినిధి అనిల్ సక్సేనా తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, ఈ ఘటనకు సాంకేతిక లోపాలు కారణమయ్యాయా? అన్న విషయమై దర్యాప్తునకు ఆదేశాలు జారీచేశామని రైల్వే శాఖ మంత్రి సురేశ్ ప్రభు చెప్పారు. సిబ్బంది పనితీరులో తేడా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైల్వేశాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా అక్కడికి చేరుకున్నారన్నారు. సహాయ చర్యలను పర్యవేక్షించాలని రైల్వే బోర్డు చైర్మన్, ట్రాఫిక్ విభాగం సభ్యుడిని రైల్వే మంత్రి ఆదేశించారు. యూపీ సర్కార్‌తో సమన్వయం చేసుకుని సహాయ చర్యలను కొనసాగిస్తున్నామని చెప్పారు.

క్షతగాత్రులకు పూర్తిసాయం

ఈ ఘటనలో గాయపడిన వారికి పూర్తి ఉచితంగా చికిత్స అందజేస్తున్నామని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ చెప్పారు. ఈ ఘటనలో అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, ముజఫర్ నగర్ జిల్లా మేజిస్ట్రేట్‌లకు ఆదేశాలు జారీచేశారు. ఇద్దరు సీనియర్ రాష్ట్ర మంత్రులు సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. చీకటి పడటంతో సహాయ చర్యలకు ఆటంకం కలుగుతున్నది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం రానివ్వవద్దని స్థానిక విద్యుత్‌శాఖ అధికారులను యూపీ సర్కార్ ఆదేశించింది. ప్రస్తుతం సహాయ చర్యలపైనే దృష్టిని కేంద్రీకరించామని ఉత్తరప్రదేశ్ అదనపు డీజీపీ ఆనంద్‌కుమార్ చెప్పారు.

విద్రోహ కోణంలోనూ దర్యాప్తు

ఈ దుర్ఘటన వెనుక ఉగ్రవాదుల హస్తం ఉన్నదా? అన్న కోణంలోనూ ఉత్తరప్రదేశ్ ఉగ్రవాద వ్యతిరేక బృందం (ఏటీఎస్)పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. ఉత్తరప్రదేశ్ ప్రొవిజనల్ ఆర్మ్‌డ్ కానిస్టేబుళ్లు (పీఏసీ), స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతోపాటు 90 మంది జాతీయ విపత్తు నివారణ సంస్థ (ఎన్డీఆర్ఎఫ్) సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. స్థానికులు కూడా చేయూతనిస్తున్నారు. ఇప్పటివరకు స్థానిక దవాఖానల్లో 40 మందిని చికిత్స కోసం చేర్చారు. వారిలో అత్యధికులు మహిళలు, బాలలే ఉన్నారు. దేశ రాజధాని ఢిల్లీకి 100 కిలోమీటర్ల దూరంలోనే ఖాతౌలీ ఉంది. దీంతో నార్తర్న్ రైల్వే మార్గంలో 10 రైళ్లను దారి మళ్లించారు.

మృతుల కుటుంబాలకు రూ.5.5 లక్షలు..
ఒడిశా వాసులకు మరో రూ. 5 లక్షల పరిహారం

ఈ రైలు ప్రమాదంలో మరణించిన ప్రయాణికుల కుటుంబాలకు రూ.3.5 లక్షల పరిహారం, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25 వేల సాయం అందిస్తామని రైల్వేమంత్రి సురేశ్ ప్రభు చెప్పారు.యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 పరిహారం ప్రకటించారు. మరణించిన ఒడిశా వాసుల కుటుంబాలకు ఆ రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్ రూ. 5 లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల సాయం అందిస్తామన్నారు. మరోవైపు ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి రాజీనామా చేయాలని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు.

ప్రధాని మోదీ తీవ్ర విచారం

ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం పట్ల ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ట్వీట్ చేశారు. రైలు ప్రమాద ఘటనలో బాధితులకు రైల్వే శాఖ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అవసరమైన సహాయ చర్యలు చేపడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం పట్ల తీవ్ర విచారం వ్యక్తంచేశారు. దేశంలో రైలు ప్రమాదాలు పెరిగిపోవడం పట్ల సోనియాగాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్కళ్ రైలు ప్రమాద మృతులకు పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంతాపం తెలిపారు.



బోగీలో చిక్కుకున్న వారికి తాగునీరందిస్తున్న స్థానికులు

హెల్ప్‌లైన్ నంబర్లు

ఈ ప్రమాదంపై వివరాలు తెలుసుకునేందుకు రైల్వేశాఖ, హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేసింది. 9760534054, 9760345101, 0131-2436918, 0131-2436103, 0131- 2436564, మీరట్ జిల్లా ప్రభుత్వ దవాఖాన 9454455183లతో హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్లు ఏర్పాటు చేశాయి.

ఇంటిలోకి దూసుకెళ్లిన బోగీ

ఒక బోగీ ట్రాక్ పక్కనే ఉన్న ఇంటిలోకి దూసుకెళ్లడంతో గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆ ఇంటి శిథిలాల కింద కొందరు చిక్కుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరో రెండు బోగీలు ఒకదానికిపై మరొకటి ఎక్కాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం పట్టాలు తప్పిన బోగీల మధ్య సుమారు 400 మంది చిక్కుకుని ఉన్నారని తెలుస్తున్నది. గత ఏడాది నవంబర్‌లో కాన్పూర్‌లో జరిగిన ఇండోర్ – పాట్నా రైలు పట్టాలు తప్పిన ఘటనలో 100 మందికి పైగా మృతి చెందారు. 2014 నవంబర్ నుంచి ఇప్పటి వరకు 21 రైలు ప్రమాదాలు జరిగాయి.



విలీనం దిశగా అడుగులు

- చర్చల ద్వారా విభేదాలు పరిష్కారం: సీఎం పళనిసామి
- త్వరలో సానుకూల ఫలితం: మాజీ సీఎం పన్నీర్ సెల్వం
- పదవిలోంచి దించుతానంటూ పళనికి దినకరన్ హెచ్చరిక

చెన్నై, ఆగస్టు 19: తమిళనాడులోని అధికార అన్నాడీఎంకేలోని రెండు గ్రూపుల విలీనంపై ఉత్కంఠ కొనసాగుతున్నా.. సానుకూల ఫలితంపై సీఎం పళనిసామి, మాజీ సీఎం పన్నీర్ సెల్వం గ్రూపులు విశ్వాసంతో ఉన్నాయి. శనివారం తంజావూర్ జిల్లా తిరువారూర్‌లో జరిగిన అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ శతజయంతి వేడుకల్లో సీఎం పళనిసామి మాట్లాడుతూ త్వరలో పార్టీలోని రెండు గ్రూపులు విలీనమవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విలీనంపై రెండు గ్రూపుల మధ్య విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకుంటున్నట్లు తెలిపారు. మరోవైపు, విలీన చర్యలపై మాజీ సీఎం ఓ పన్నీర్‌సెల్వం కూడా మీడియాతో శనివారం మాట్లాడారు. సజావుగా చర్చలు జరుగుతున్నందున ఒకటి, రెండు రోజుల్లో సానుకూల ఫలితం వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన నేతృత్వంలోని అన్నాడీఎంకే (పురచితలైవి అమ్మ) వర్గం నేతలతో ఇష్టాగోష్టిగా చర్చించిన పన్నీర్ సెల్వం.. విలీనంపై చర్చల సరళిని వారికి వివరించినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే రెండు గ్రూపుల విలీనం యత్నాలపై అన్నాడీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ మండిపడ్డారు. సీఎం పళనిసామి పార్టీ నాయకత్వం అభిమతానికి అనుగుణంగా ముందుకు వెళ్లకుంటే ఆయన స్థానంలో మరొకరిని సీఎంగా నియమిస్తామని హెచ్చరించారు. కాగా, శుక్రవారం రాత్రి ఇరు పక్షాల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడానికి పన్నీర్ సెల్వం గ్రూప్ మొండి వైఖరే కారణమని పళనిసామి వర్గం వాదిస్తున్నది. పార్టీ, మంత్రి పదవుల పంపకాలపైనా ఇరు గ్రూపులు గట్టిగానే బేరసారాలు సాగిస్తున్నాయి. కాగా, రెండు గ్రూపులు విలీనమయ్యే సమయం ఆసన్నమవుతుండటంతో పలువురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు శనివారం మెరీనా బీచ్ వద్ద సమావేశమయ్యారు. జయలలిత సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించేందుకు ఇరు గ్రూపులు తమ అధినేతల కోసం వేర్వేరుగా పుష్పగుచ్ఛాలు కూడా సిద్ధం చేశాయి. కానీ చర్చలు ముందుకు వెళ్లకపోవటంతో పోలీసులు పుష్పగుచ్ఛాలు తొలగించి, ప్రజల సందర్శనకు అనుమతినిచ్చారు.

ఎన్డీయే గూటికి నితీశ్

- జేడీయూ జాతీయ కార్యవర్గ సమావేశంలో అధికారికంగా తీర్మానం
- మోదీ క్యాబినెట్‌లో మంత్రిపదవులు దక్కే అవకాశం
- సమాంతర భేటీ నిర్వహించిన శరద్‌యాదవ్.. రెండు గ్రూపుల మధ్య ఘర్షణ



జేడీయు కార్యవర్గ సమావేశంలో నితీశ్, కేసీ త్యాగి

పాట్నా, ఆగస్టు 19: ఊహించినట్లే బీహార్ సీఎం నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ (యునైటెడ్) పార్టీ బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే గూటికి తిరిగి చేరింది. ఈ మేరకు శనివారం పాట్నాలో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఒక అధికారిక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. అయితే బీజేపీతో చేతులు కలుపడాన్ని వ్యతిరేకిస్తున్న పార్టీ మాజీ అధ్యక్షుడు శరద్‌యాదవ్‌పై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఎన్డీయే కూటమిలో జేడీయూ చేరిన నేపథ్యంలో ఆ పార్టీకి ప్రధాని మోదీ మంత్రివర్గంలో రెండు పదవులు దక్కుతాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. శరద్‌యాదవ్‌తో విభేదాల నేపథ్యంలో పార్టీలో ఎటువంటి చీలికలు ఏర్పడలేదని జేడీయూ సీనియర్ నాయకుడు కేసీ త్యాగి పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'పార్టీ అధ్యక్షుడు నితీశ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన జేడీయూ జాతీయ కార్యవర్గ సమావేశం ఎన్డీయేలో భాగస్వామి కావాలని ఒక తీర్మానాన్ని ఆమోదించింది' అని చెప్పారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌తో కూడిన మహాకూటమి నుండి బయటకు వచ్చి, బీహార్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీతో చేతులు కలుపడాన్ని కూడా జాతీయ కార్యవర్గ సమావేశం ఆమోదించిందని తెలిపారు. ఇటీవల బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, జేడీయూ అధ్యక్షుడు నితీశ్‌కుమార్‌తో సమావేశమయ్యారని, వెంటనే జేడీయూను ఎన్డీయే కూటమిలో చేర్చాలని అమిత్ షా కోరారని త్యాగి వెల్లడించారు. పార్టీలో ఎటువంటి చీలిక లేదని ఆయన స్పష్టం చేశారు. 20 రాష్ట్రాలకు 16 రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు, బీహార్‌లోని పార్టీకి చెందిన 71 మంది ఎమ్మెల్యేలు, 30 మంది ఎమ్మెల్సీలు, అన్ని పార్టీ కమిటీల ఆఫీస్‌బేరర్లు ఈ సమావేశానికి హాజరయ్యారని చెప్పారు. పార్టీ కార్యవర్గ సభ్యులందరూ శరద్ యాదవ్ సమ్మతితో నితీశ్‌కుమార్ నియమించినవారేనని తెలిపారు. అటువంటప్పుడు ఇక చీలిక ఎలా ఏర్పడుతుందని త్యాగి ప్రశ్నించారు. శరద్‌యాదవ్‌కు వ్యతిరేకంగా ఎటువంటి చర్యైనా తీసుకొనే ముందు ఈ నెల 27న ఆర్జేడీ నిర్వహించనున్న ర్యాలీ జరిగే వరకూ ఎదురుచూస్తామని త్యాగి చెప్పారు. ఆ ర్యాలీలో శరద్‌యాదవ్ పాల్గొంటే ఇక ఆయన జేడీయూలో కొనసాగే అవకాశముండకపోవచ్చని త్యాగి సూచనప్రాయంగా పేర్కొన్నారు. ఎన్డీయేలో జేడీయూ చేరడాన్ని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా స్వాగతించారు. ఈ కలయిక బీహార్‌లో కొత్త తరం అభివృద్ధిని చాటుతున్నదని వ్యాఖ్యానించారు.

సీఎం ఇంటిముందు నితీశ్, శరద్ మద్దతుదారుల ఘర్షణ

ముఖ్యమంత్రి నివాసం ముందు నితీశ్‌కుమార్, శరద్‌యాదవ్‌ల మద్దతుదారులు ఘర్షణపడ్డారని పోలీసులు చెప్పారు. విమానాశ్రయం నుంచి నగరంలోని ఎస్కే మెమోరియల్ హాల్‌కు శరద్‌యాదవ్ వస్తుండగా, ఆయన మద్దతుదారులు మోటార్‌సైకిళ్లపై అనుసరించారు. వారు ముఖ్యమంత్రి నివాసం వద్దకు రాగానే పోలీసులు వారిని అడ్డగించారు. దీంతో వారు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ కర్రలు, బెల్టులు పట్టుకొని సీఎం ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. జాతీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన నితీశ్ మద్దతుదారులు ఆయన ఇంట్లో నుంచి బయటకు వచ్చి శరద్‌యాదవ్ మద్దతుదారులను తరిమివేశారని చెప్పారు. ఆ సమయంలో కారులోనే ఉన్న శరద్ యాదవ్ ఈ ఘర్షణపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు.

శరద్ పోటీ సమావేశం



పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశానికి గైర్హాజరైన జేడీయూ మాజీ అధ్యక్షుడు శరద్‌యాదవ్ మరో సమాంతర కార్యక్రమంలో పాల్గొన్నారు. జేడీయూ నుంచి సస్పెండ్ అయిన రాజ్యసభ సభ్యుడు అలీఅన్వర్ అన్సారీతో కలిసి యాదవ్ ఎస్కే మెమోరియల్ హాల్‌లో జరిగిన జన్ అదాలత్‌లో పాల్గొన్నారు. ఈ సమావేశానికి పార్టీ నుంచి సస్పెండ్ అయిన 20 మందికి పైగా నాయకులు హాజరయ్యారు. తాము ఆర్జేడీ, కాంగ్రెస్ మహాకూటమిలోనే కొనసాగుతామని వారు ప్రకటించారు.

మరో 50 ఏండ్లు అధికారంలో ఉంటాం

- మధ్యప్రదేశ్ పర్యటనలో ఆపార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా



భోపాల్, ఆగస్టు 19: బీజేపీ కేవలం ఐదు, పది ఏండ్లు కాదు.. రానున్న 50 సంవత్సరాలు అధికారంలో ఉంటుందని ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా పేర్కొన్నారు. దేశవ్యాప్త పర్యటనలో భాగంగా 110వ రోజయిన శుక్రవారం మధ్యప్రదేశ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తలు, ఎంపీ, ఎమ్మెల్యే, ఆఫీస్ బేరర్ల సమావేశంలో షా మాట్లాడారు. 'ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో 330మంది ఎంపీల బలం ఉంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 1387మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రస్తుతం పార్టీ అత్యున్నత స్థితిలో ఉంది' అని షా అన్నారు. మరో ఐదు నుంచి పదేండ్లు అధికారంలో ఉంటామని కార్యకర్తలు భావిస్తున్నారు. కానీ మరో 50ఏండ్లు బీజేపీనే అధికారంలో ఉంటుందని కచ్చితంగా చెప్తున్నాను అని అమిత్ షా పేర్కొన్నారు. అధికారాన్ని ఉపయోగించుకుని రానున్న 40 నుంచి 50 ఏండ్లలో దేశంలో సమూల మార్పులు తేవాలన్నారు. ప్రస్తుతం బీజేపీ 12కోట్ల మంది సభ్యులతో దేశంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించడానికి.. ఎంతోమంది మహనుభావుల త్యాగం, శ్రమ, అంకితభావమే కారణమని పేర్కొన్నారు. దేశంలో బీజేపీ జెండా ఎగురని ప్రాంతం ఉండకూడదు.. అన్ని ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

రేపు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంల భేటీ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: బీజేపీపాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో ప్రధాని నరేంద్రమోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఢిల్లీలో సోమవారం సమావేశం కానున్నారు. పార్టీలో సంస్థాగత మార్పులతోపాటు వచ్చే రెండేండ్లలో జరిగే వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, 2019లో లోక్‌సభ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకుని తిరిగి అధికారాన్ని చేజిక్కించుకోవడానికి అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చిస్తారు. దీంతోపాటు కేంద్ర క్యాబినెట్ విస్తరణ తదితర అంశాలపైనా చర్చిస్తారు.

బ్లూవేల్ కట్టడికి మార్గదర్శకాలు

తన పరిధిలోని 18వేల పాఠశాలలకు సీబీఎస్‌ఈ గైడ్‌లైన్స్ జారీ

న్యూఢిల్లీ, ఆగస్టు 19: దేశవ్యాప్తంగా బ్లూవేల్ గేమ్ ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని కట్టడి చేసేందుకు చేపట్టవలసిన చర్యలపై సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) తమ పరిధిలోని పాఠశాలలకు మార్గదర్శకాలు జారీ చేసింది. పాఠశాలల్లోని కంప్యూటర్లలో క్రియాశీలకమైన ఫైర్‌వాల్స్, ఫిల్టరింగ్, మానిటరింగ్ సాఫ్ట్‌వేర్లను కచ్చితంగా ఇన్‌స్టాల్ చేసి ఉంచాలని ఆదేశించింది. రక్షణ వ్యవస్థలు అందుబాటులోలేని కంప్యూటర్లను ఉపయోగించే చిన్నారులు చట్టవిరుద్ధమైన కార్యకలాపాలవైపు ఆకర్షితులవడంతోపాటు టెక్నాలజీని దుర్వినియోగంచేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, మోసపూరిత చర్యలు, అంతకుమించి తీవ్రమైన నేరాలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని సీబీఎస్‌ఈ తెలిపింది. అధునాతన ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం రోజురోజుకూ వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత తరుణంలో వాటిని వాడకుండా విద్యార్థులను కట్టడి చేయడం పాఠశాలలకు కష్టసాధ్యం. కాబట్టి ఇంటర్‌నెట్ సురక్షిత వినియోగంపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించడం అనివార్య విషయంగా పరిగణించాలి అని పేర్కొంది. బ్లూవేల్ గేమ్‌లోని చిట్టచివరి టాస్క్ ఆత్మహత్యలను ప్రేరేపిస్తుండటంతో దీని లింకులను తొలగించాలని సోషల్ మీడియా సంస్థలను కొద్దిరోజుల కిందట కేంద్రప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమస్య తీవ్రతను గుర్తించిన సీబీఎస్‌ఈ తన పరిధిలోని 18వేల పాఠశాలలకు ప్రకటనను జారీ చేసింది. పాఠశాలలు, బడి బస్సుల్లో ఇంటర్‌నెట్, డిజిటల్ టెక్నాలజీల సురక్షిత వినియోగానికి సంబంధించి విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించాలని, వారు తమకు తాము నష్టం చేసుకోకుండా.. తోటివారికి హాని చేయకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రకటనలో తెలిపింది.



మానసిక సమస్యలతోనే ఆత్మహత్యలు

- కేరళ సైబర్‌డోమ్ నోడల్ అధికారి మనోజ్ అబ్రహం

కోచి: మానసిక సమస్యలతో జరిగిన ఆత్మహత్యలనే 'బ్లూవేల్ చాలెంజ్' కారణంగా జరిగిన ఆత్మహత్యలుగా ప్రచారం చేస్తున్నారని కేరళ ఐజీ, సైబర్‌డోమ్ నోడల్ అధికారి మనోజ్ అబ్రహం పేర్కొన్నారు. బ్లూవేల్ చాలెంజ్‌పై తాము జరిపిన దర్యాప్తులో.. ఎక్కడాకూడా ఈ గేమ్‌లో పాల్గొనేవారికి టాస్కులు ఇచ్చేందుకు ఒక అడ్మినిస్ట్రేటర్‌గానీ, గేమ్ విడుదలచేసేవారు గానీ ఉన్నట్లు వెల్లడికాలేదన్నారు. బ్లూవేల్ చాలెంజ్‌లో పాల్గొనేవారికి కొందరు అడ్మినిస్ట్రేటర్లు టాస్కులు ఇచ్చి వారిని ఆత్మహత్యకు పురికొల్పుతారన్న దాంట్లో వాస్తవం లేదనే విధంగా మనోజ్ అబ్రహం వ్యాఖ్యానించారు. కానీ, కేరళలోనే ఇటీవల ఇద్దరు యువకులు బ్లూవేల్ చాలెంజ్‌లో పాల్గొని ప్రాణాలు తీసుకున్నారని వార్తలు వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై మనోజ్ స్పందిస్తూ.. పూర్తిగా నిరాశలో చిక్కుకుని ఆత్మహత్యా ధోరణులు గల పిల్లలే ఈ గేమ్‌లో పాల్గొంటున్నట్లు తెలుస్తున్నదని చెప్పారు. ప్యారీ ఆఫ్తాబ్ అనే డిజిటల్ ప్రైవసీ లాయర్ కూడా.. బ్లూవేల్ ఆత్మహత్య వార్తలన్నీ ఒట్టి పుకార్లని కొట్టివేశారు.

మరుగుదొడ్డి లేక.. విడాకులు

- న్యాయస్థానంలో భార్య పిటిషన్
- మంజూరుచేసిన రాజస్థాన్‌లోని జిల్లా ఫ్యామిలీ కోర్టు



జైపూర్, ఆగస్టు 19: మరుగుదొడ్డి నిర్మించకుండా మానసికంగా వేధిస్తున్న భర్త నుంచి విడాకులు ఇవ్వాలని ఓ మహిళ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌ను విచారించిన రాజస్థాన్‌లోని భిల్వారా జిల్లా ఫ్యామిలీ కోర్టు శుక్రవారం విడాకులు మంజూరుచేసింది. ఇండ్లలో మరుగుదొడ్డి కట్టించకపోవడం, చీకటిపడిన తర్వాతే బహిర్భూమికి వెళ్లాలంటూ మహిళలను ఒత్తిడి చేయటం సిగ్గుచేటని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. భిల్వారా జిల్లాకు చెందిన 20 ఏండ్ల మహిళకు 2011లో వివాహం జరిగింది. వారికి సంతానం కలుగలేదు. తనకూ తన భర్తకు ఇంట్లో ఒక గది కావాలని, ఇంటి ఆవరణలో ఒక మరుగుదొడ్డిని కూడా నిర్మించాలని అత్తింటివారికి సదరు మహిళ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో 2015లో ఆమె విడాకుల కోసం జిల్లా ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ సందర్భంగా కోర్టు జడ్జి రాజేంద్రకుమార్ శర్మ స్పందిస్తూ.. 'ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించకుండా ఆమెను మానసికంగా హింసించారు. ఆమె పట్ల దారుణంగా ప్రవర్తించారు. అందుకే ఈ కేసును క్రూరత్వం కింద పరిగణించి ఆమెకు విడాకులు మంజూరుచేస్తున్నాం' అని తెలిపారు. 'మన తల్లులు, అక్కలు, చెల్లెండ్లు చీకటిపడేదాకా వేచి ఉండి బహిర్భూమికి వెళ్లడం ఎంత బాధ కలిగించే విషయం. దానివల్ల మహిళలు ఎంతో వేదనకు గురవుతున్నారు. మద్యం సేవించడానికి, పొగాకు, సెల్‌ఫోన్లు కొనుగోలు చేసేందుకు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెడుతారు. కానీ, ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోలేరా' అని న్యాయమూర్తి ప్రశ్నించారు. మహిళకు విడాకులు మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించారు.

ఒలిఫెంటా స్టీల్‌బ్రిడ్జి బిగింపు పూర్తి



బిగింపు పూర్తయిన ఒలిఫెంటా స్టీల్‌బ్రిడ్జి

- సురక్షితంగా రైల్వే వంతెనకిరువైపులా పిల్లర్లతో అనుసంధానం
- దేశంలోనే ఇటువంటి స్టీల్ బ్రిడ్జి మొదటిది: ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: దేశంలోనే మరెక్కడా లేనివిధంగా మొట్టమొదటి ఉక్కువంతెనను నిర్మించి సురక్షితంగా బిగించిన ఘనతను హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు దక్కించుకున్నది. రైళ్ల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రద్దీ ప్రాంతంలో నిర్మిస్తున్నా ప్రజాజీవితానికి ఇబ్బందులు తలెత్తకుండా వంతెనను బిగించడంలో ఇంజినీర్లు, అధికారులు విజయం సాధించారు. మెట్రోరైలు నిర్మాణంలోనే అత్యంత కీలక వంతెనగా, అనేక ఇంజినీరింగ్ సవాళ్లతో కూడిన బ్రిడ్జిగా గుర్తించిన 1,100 టన్నుల బరువుగల వంతెనను శనివారం తెల్లవారుజామున సికింద్రాబాద్ రైల్వే బ్రిడ్జిని దాటి ఇరువైపులా ఉన్న మెట్రోపిల్లర్లతో అనుసంధానించారు. ఈ విషయాన్ని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తూ ఈ ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఈ బ్రిడ్జిని ఘజియాబాద్ నుంచి తెచ్చి ఇక్కడ రీఅసెంబుల్ చేశారు. చిలుకలగూడ చౌరస్తాలోని



రైల్వే స్థలాన్ని లీజుకు తీసుకుని అక్కడే దీనిని రీఫిట్టింగ్ కార్యక్రమం చేపట్టి విజయవంతంగా బిగించారు. బ్రిడ్జి నిర్మాణంలో స్పెషల్ హై స్ట్రెంత్ స్టీల్‌ప్లేట్స్‌తోపాటు 60 వేల హై స్ట్రెంత్ ఫ్రిక్షన్ గ్రిప్ బోల్టులను వాడారు. కొన్ని నెలలుగా రీఫిట్టింగ్ పనులు చేపట్టిన ఎల్ అండ్ టీ మెట్రో ఇంజినీర్లు 10 రోజులుగా స్టీల్ బ్రిడ్జిని ప్రత్యేకంగా తయారు చేసిన జాక్‌లతో కొద్దికొద్దిగా జరుపుతూ శనివారానికి పనులు పూర్తి చేశారు. దీనిని బిగించడంలో హైస్ట్రెంత్ పుల్లింగ్ జాక్స్, వర్టికల్ పుల్లింగ్ జాక్స్, హెవీ డ్యూటీ రోడ్ క్రేన్స్, ఇంపోర్టెడ్ అమెరికన్ హిల్‌మ్యాన్ రోలర్స్‌ను ఉపయోగించారు. పెద్ద నదులు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో జనసంచారం లేని చోట ఇటువంటి వంతెనలు నిర్మిస్తుంటారు. రద్దీగా ఉండే చిలుకలగూడ చౌరస్తాలో వంతెన నిర్మించి మెట్రోరైలు ప్రాజెక్టు కొత్త రికార్డును నెలకొల్పింది. ఇటువంటి రద్దీ ప్రాంతాల్లో దేశంలో ఎక్కడా నిర్మించిన దాఖలాలు లేవు. దీని నిర్మాణంలో ఎల్ అండ్ టీ ఇంజినీర్లు కేఎం రావు, ఎంవై కొండలుతోపాటు ఇంజినీర్ల బృందం ఏ పళ్లంరాజు, వీఆర్ శ్రావణకుమార్, జీ ఇమాయవరంబన్ నేతృత్వంలో రేయింబవళ్లు పనిచేసి బ్రిడ్జి పనులు పూర్తి చేశారని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. కీలకవంతెన పూర్తికావడంతో మియాపూర్ నుంచి నాగోల్ వరకు ఆపరేషన్స్‌కు మెట్రోరైలు దాదాపు సిద్ధమైందని ఆయన వివరించారు.

వంతెన ప్రత్యేకతలివే..

వంతెన వెడల్పు	272 అడుగులు
ఫిల్లర్ల సైజ్	15X8 అడుగులు
రోడ్డు నుంచి ఎత్తు	60 అడుగులు
మొత్తం వంతెన పొడవు	656 అడుగులు
పుల్లింగ్ జాక్స్ సామర్థ్యం	100 టన్నులు (రెండు కలిపి 200 టన్నులు)
వెర్టికల్ లిఫ్టింగ్ జాక్	400 టన్నులు



శామీర్‌పేట చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు



శామీర్‌పేట చెరువు వద్ద చేపలను తూకం వేస్తున్న దృశ్యం

మత్స్య విప్లవం

హైదరాబాద్ శివారు జిల్లాలకు 2.5 కోట్లకుపైగా సీడ్ పంపిణీ



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తెలంగాణ సర్కారు మత్స్య విప్లవానికి శ్రీకారం చుట్టింది. పల్లెలు మాత్రమే కాదు.. హైదరాబాద్ నగర శివారు చెరువులతోనూ ఉపాధి కల్పించాలని నిశ్చయించింది. పెట్టుబడి కష్టాలను తీరుస్తూ.. గరీబోళ్ల కడుపులు నింపాలని భావించి, తక్కువ ధరకే ఎక్కువ చేప విత్తనాలందించింది. మార్కెట్ చేసుకునేందుకు వీలుగా మరిన్ని వసతులు కల్పించింది. ఇతర రాష్ట్రాల నుంచి చేపలను తెప్పించుకోవాల్సిన పరిస్థితికి చెక్ పెట్టి.. ఇక్కడి మార్కెట్ అవసరాలకు మించి ఉత్పత్తి చేయడంతోపాటు వేరే ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు సహకారం అందిస్తున్నది. నగర శివారు జిల్లాల్లోని చెరువులకు 2.5 కోట్లకుపైగా చేప పిల్లలను పంపిణీ చేసింది. సీఎం కే చంద్రశేఖర్‌రావు ప్రోత్సాహానికి కాలం కలిసొస్తే.. తమకు బంగారు భవిష్యత్ ఉంటుందని మత్స్యకార కుటుంబాలు ధీమా వ్యక్తంచేస్తున్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహంతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు
గ్రేటర్‌లో ఏటా రూ.200 కోట్ల వరకు చేపల డిమాండ్
ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతికి చెక్ పెట్టేందుకు కృషి

చేప పిల్లల పంపిణీ (2016-17)

జిల్లా	నీరుచేరిన చెరువులు	కావాల్సిన చేప పిల్లలు (లక్షల్లో)	పంపిణీ చేసినవి (లక్షల్లో)
రంగారెడ్డి	43	14.7	14.7
మేడ్చల్	41	12.9	12.9
వికారాబాద్	81	30.8	30.8
యాదాద్రి	122	88.5	88.5
సిద్దిపేట	239	114.6	102.3

శామీర్‌పేట చెరువులో మత్స్యకారుల కోలాహలం

హైదరాబాద్ శివారులోని శామీర్‌పేట పెద్ద చెరువు రోజూ తెల్లవారుజాము నుంచే కోలాహలంగా మారుతున్నది. మత్స్యకారులు, వినియోగదారులు, వ్యాపారులతో కళకళలాడుతున్నది. 60 మంది మత్స్యకారులు తెల్లవారుజామున 3 గంటలకే చెరువులో వలలు బిగించి, 7 గంటల నుంచి చేపలను గట్టుకు తీసుకొస్తున్నారు. రవ్వ, బొచ్చ, బంగారు తీగ, మెరిగె చేపలను గట్టుకు తీసుకురాగానే అక్కడ వచ్చిన వినియోగదారులే కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారం నిర్వహించుకునేందుకు గతేడాది ప్రభుత్వం శామీర్‌పేట మత్స్యకార సంఘానికి ఆరు టీవీఎస్ మోపెడ్‌లు, ఆరు సైకిళ్లు, టాటా ఎస్ వాహనాన్ని సబ్సిడీపై అందించింది.

కాలం కలిసొచ్చింది..

ఉమ్మడి రాష్ట్రంలో ఏటా పెట్టిన పెట్టుబడి రావడమే గొప్పగా అనిపించేది. ఇప్పుడు ప్రభుత్వ సంకల్పంతో ఒక్క శామీర్‌పేట చెరువులోనే 1.32 లక్షల చేప పిల్లలను వదిలారు. సొసైటీ నుంచి మరో 2 లక్షల చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువులో వేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సబ్సిడీపై 12వేల చేప పిల్లలకు మించి ఏనాడూ ఇవ్వలేదని సొసైటీ సభ్యులు చెప్పారు. ఇప్పుడు పూర్తి సబ్సిడీతో పెద్దమొత్తంలో ఇవ్వడం, నామమాత్రపు ధరకే వాహనాలు, సైకిళ్లు అందివ్వడంపై శామీర్‌పేట మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు దొంతరబోయిన యాదగిరి హర్షం వ్యక్తంచేశారు. కులవృత్తుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలు అసాధారణమైనవని కొనియాడారు. చేపలను చిల్లరగా అమ్ముకోవడానికి సైకిళ్లు, టీవీఎస్ మోపెడ్ వాహనాలు ఇచ్చారని, పెద్ద మొత్తంలో చేపలు పడితే మార్కెట్‌కు చేర్చేందుకు టాటా ఎస్ ఆటో ఉపయోగపడుతుందన్నారు.

సీఎం కేసీఆర్ లక్ష్యం నెరవేరాలని ఆకాంక్ష

గోదావరి జలాలతో శామీర్‌పేట చెరువును నింపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు ఇటీవల మండలంలోని మూడుచింతలపల్లి సభలో సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆయన ఆకాంక్ష నెరవేరితే వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నది. ఒక్క శామీర్‌పేట చెరువు కిందే 2,500 ఎకరాలకుపైగా సాగుకు ఢోకా ఉండదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అన్నింటికీ మించి భూగర్భజలాల పెంపునకు తోడ్పడుతుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో చేపల డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి సాధ్యమవుతుంది. భువనేశ్వర్, ముంబై, కాకినాడ, ఏలూరు, విశాఖపట్నం, గుంటూరు, చీరాల, ఆకివీడు తదితర ప్రాంతాల నుంచి నగరానికి 90 శాతం వరకు చేపలు వస్తున్నాయి. కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి 10శాతం తీసుకొస్తున్నట్టు అంచనా. తెలంగాణలోనే ప్రత్యేకంగా ఉస్కెదోతులు, చందమామలు, జెల్లలు, కొర్రమీను వంటివి ఉత్పత్తి అవుతుండగా, రవ్వ, బొచ్చ వంటివి మిగితా ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్టు బేగంబజార్, ముషీరాబాద్ చేపల మార్కెట్లలోని వ్యాపారులు చెప్తున్నారు. గ్రేటర్‌లో ఏటా చేపల డిమాండ్ రూ.200 కోట్లకు పైగానే ఉన్నది. అందులో తెలంగాణ ఉత్పత్తి రూ.20 కోట్లు కూడా లేకపోవడం గమనార్హం. నగరానికి రోజూ 30 టన్నుల వరకు డిమాండ్ ఉన్నదని దిగుమతి లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.



చెరువును నింపితే చాలు

ప్రభుత్వ పోత్సాహం మరిచిపోలేనిది. 62 మంది సభ్యులం చెరువు మీదనే బతుకుతున్నాం. సీఎం కేసీఆర్ మొన్న ప్రకటించినట్టు చెరువును నింపితే చాలు. ప్రభుత్వమే చేప పిల్లలను వదులుతుంది. మార్కెట్ వస్తే చేపలను ఇక్కడే అమ్ముకుంటం.

– యాదగిరి, అధ్యక్షుడు, శామీర్‌పేట మత్స్యకార సంఘం



సీఎంకు రుణపడి ఉంటాం

మాపై సీఎం సార్ అనుగ్రహం ఉంది. కేసీఆర్‌కు మత్స్యకారుల సపోర్టు ఎల్లకాలం ఉంటుంది. ఆయనకు రుణపడి ఉంటాం. వైరస్ లేని సీడ్ అందించి, చెరువు నీళ్లను ఎప్పటికప్పుడు టెస్ట్ చేయాలి. చేపలు చచ్చిపోకుండా చూడాలి.

– దేశబోయిన నర్సింహ, మత్స్యకారుడు



సీడ్ ఉచితంగా ఇచ్చారు

గతంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వ సీడ్ ఉచితంగా ఇచ్చింది. ఇది కేసీఆర్ సారొచ్చాకే మొదలయింది. అప్పుడు ఆంధ్రాకే ఇచ్చుకునేటోళ్లు. అక్కడ మంత్రులకే చేపల చెరువులు ఉండేవి. అందుకే అప్పుడు మమ్మల్ని పట్టించుకోలేదు.

– దొంతరబోయిన మల్లేశ్, మత్స్యకారుడు

ఈ నామ్ అమలులో తెలంగాణ భేష్

- ఉత్తరప్రదేశ్ మండి పరిషత్ అధికారుల ప్రశంస
- మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ సందర్శన



మలక్‌పేట మార్కెట్ ఎస్‌జీఎస్ అనంతయ్యతో సమావేశమైన యూపీ అధికారులు

మలక్‌పేట: నగరంలోని మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌ను శనివారం ఉత్తరప్రదేశ్ మార్కెటింగ్‌శాఖ అధికారులు సందర్శించారు. ఉత్తరప్రదేశ్‌లోని మండి పరిషత్ అడిషనల్ డైరెక్టర్ జితేంద్ర ప్రతాప్‌సింగ్ నేతృత్వంలో శహనాజ్‌పూర్ మార్కెట్ కార్యదర్శి ఎస్‌కే సింగ్‌తోపాటు మరో ఇద్దరు అధికారులు మలక్‌పేట మార్కెట్‌ను సందర్శించి ఈ నామ్ ద్వారా నిర్వహిస్తున్న క్రయవిక్రయాలు, అమలుచేస్తున్న విధానాన్ని మార్కెట్ ఎస్‌జీఎస్(ఉపసంచాలకులు) అనంతయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌లో పర్యటించి జరుగుతున్న వ్యాపార లావాదేవీలను పరిశీలించారు. ఈ నామ్ ద్వారా రైతులతోపాటు వ్యాపారులకు మేలు కలుగుతుందని ఎస్‌జీఎస్ అనంతయ్య వారికి వివరించారు. తూకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నామ్ అమలుతో కొనుగోలుదారుల్లో పోటీ నెలకొనడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. అమ్మిన పంటకు సంబంధించిన డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమవుతాయన్నారు. ఈ సందర్భంగా యూపీ మార్కెటింగ్‌శాఖ అడిషనల్ డైరెక్టర్ జితేంద్ర ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ ఈ నామ్ అమలు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని ప్రశంసించారు. తెలంగాణలో అమలు చేస్తున్న విధానాన్ని తెలుసుకొని తమ రాష్ట్రంలో అమలుపరిచేందుకే ఇక్కడికి వచ్చామని తెలిపారు. ఈ నామ్ ద్వారా మార్కెటింగ్‌శాఖకు అత్యధికంగా లాభాలు చేకూరుతున్నది కూడా తెలంగాణ రాష్ట్రంలోనేనని, జాతీయస్థాయిలో కూడా ఈ నామ్ ద్వారా అత్యధికంగా వ్యాపారాలు నిర్వహిస్తూ తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో గ్రేడ్–2, 3 కార్యదర్శులు సాంబయ్య, కార్యదర్శి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్‌లోకి 'కూల్ రీపర్స్'

చైనా సాఫ్ట్‌వేర్ ఫోన్లలోనే ఈ వైరస్ అధికం.. అప్రమత్తం, అవగాహనతోనే వైరస్‌కు చెక్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఆండ్రాయిడ్ ఫోన్లు వాడుతున్నవారు జాగ్రత్తగా ఉండాలంటున్నారు సైబర్ నిపుణులు. హ్యాకర్స్ ఇప్పుడు ఆ ఫోన్లలోకి 'కూల్ రీపర్స్' అనే వైరస్‌ను పంపిస్తున్నారు. దీంతో మీ ఫోన్ మీకు తెలియకుండానే వారి చేతిలో ఆపరేట్ అవుతుంది. మీరు రహస్యంగా దాచుకున్న మీ బ్యాంకు లావాదేవీలు, వ్యాపార వ్యవహారాలు, ప్రైవేట్ ఫొటోలు, వీడియోలు వారికి సులభంగా దొరికిపోతున్నాయి. వీటితో వారు మిమ్మల్ని బ్లాక్ మెయిల్ చేయడంతోపాటు మీ విషయాలను సోషల్ మీడియాలో పెట్టే అవకాశం ఉన్నది. చైనా దేశానికి చెందిన సాఫ్ట్‌వేర్‌తో తయారయ్యే ఫోన్లతో ఈ ప్రమాదం చాలా ఉన్నదని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. చైనా కంపెనీల సాఫ్ట్‌వేర్‌లో కొన్ని లోపాలు ఉండడం వల్లే హ్యాకర్లు నేరుగా తయారీదారుల సర్వర్‌లోకి కూల్ రీపర్స్‌ను వదులుతున్నారు. దీంతో అవి ఆ సర్వర్ నుంచి మన ఫోన్‌లోకి ప్రవేశిస్తున్నాయి. ఈ కారణంగా చైనా సాఫ్ట్‌వేర్‌తో తయారైన సెల్‌ఫోన్లు హ్యాకర్లు చెప్పినట్టు వింటూ మీ సమాచారాన్ని తస్కరించి వారి చేతుల్లో పెడుతున్నాయి. ఇటీవల మార్కెట్‌లోకి వచ్చిన కొన్ని వివో, ఒప్పో, జియోనీ, గ్జియామీ, సెల్‌ఫోన్లలో చోటుచేసుకుంటున్న మార్పులను విశ్లేషించిన సైబర్ నిపుణులు చైనా ఫోన్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. మరో వైపు ఇటీవల చైనా, భారత్ మధ్య చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో చైనా వారి సాఫ్ట్‌వేర్ సర్వర్‌లోకి వైరస్‌ను పంపించి ఈ విధంగా మన దేశానికి సంబంధించిన ఆర్మీ, పోలీస్ అధికారులు, రాజకీయ నేతల ఫోన్ల సమాచారాన్ని దోచేస్తున్నారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. మొత్తానికి చైనా సాఫ్ట్‌వేర్‌తో కూడిన ఫోన్లు ఇప్పుడు వినియోగదారుల్లో కలవరం సృష్టిస్తున్నాయి.

తక్కువ ధరకు వస్తున్నాయని కొనొద్దు

ఐ ఫోన్‌తోపాటు పలు ప్రముఖ ఫోన్లు చైనాలో తయారైనప్పటికీ సాఫ్ట్‌వేర్‌ను మాత్రం ఆయా సంస్థలు ప్రత్యేకంగా రూపొందిస్తుండడంతో అలాంటి వాటిల్లో వైరస్ ప్రవేశించడం అసాధ్యం అంటున్నారు స్కైటెక్ ల్యాబ్స్, సైబర్ క్రైం ఇన్వెస్టిగేటర్ అండ్ కన్సల్టెంట్ సీఈవో సందీప్. చైనాకు చెందిన యూసీ బ్రౌజర్, వీ–చాట్, అలీబాబా.కామ్ వంటి అప్లికేషన్స్, వెబ్‌సైట్ల నుంచి కూడా కూల్ రీపర్స్ ప్రవేశించే ప్రమాదం ఉన్నదని, తక్కువ ధరలో సెల్‌ఫోన్ వస్తున్నదని కొనుగోలు చేయకుండా, సొంత సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకునే కంపెనీల ఫోన్లను కొనుగోలు చేయడం మంచిదంటున్నారు. సమర్థవంతమైన యాంటీ వైరస్‌ను ఇన్ స్టాల్ చేసుకోవాలని, ఫోన్లను ఇతరులకు, చిన్న పిల్లలకు ఎప్పుడూ ఇవ్వొద్దని సూచిస్తున్నారు.

సెట్టింగ్స్ ఇలా..

మాల్‌వేర్స్, హ్యాకర్స్ వైరస్‌ను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ మొదట వారి స్మార్ట్ ఫోన్లలోని సెట్టింగ్ ఆప్షన్స్‌లోకి వెళ్లాలి. అందులో సేఫ్టీ అండ్ ప్రైవసీ, సెక్యూరిటీ అండ్ ప్రైవసీ ఆప్షన్‌లోకి వెళ్లి అందులో ఉండే అన్ నోన్ సోర్స్‌సెస్ ఆప్షన్‌ను ఆఫ్ చేసుకుని పెట్టుకోవాలి. ఇలా చేడయం వల్ల మీ అనుమతి లేకుండా ఇతర అంశాలు మీ ఫోన్‌లోకి రాకుండా అడ్డుపడుతుంది.

వైరస్‌తో జరిగే మార్పులు

- బ్యాటరీ అకస్మాత్తుగా పడిపోవడం.. చార్జింగ్ పెట్టినా అదే పరిస్థితి కనపడడం
- మీ ఫోన్‌లో ఉన్నట్టుండి వేడి పెరిగిపోవడం
- వెబ్‌సైట్లను బ్రౌజ్ చేసినప్పుడు https కాకుండా httpతోనే పని చేయడం
- మీకు తెలియకుండానే మీ ఫోన్ అప్‌డేట్ అవడం
- మీ అనుమతి లేకుండానే వాణిజ్య ప్రకటనలు రావడం
- మీకు తరుచూ మీ ఫోన్‌లో దాచుకున్న డెటాతో లింక్ ఉన్న విషయాలపై ఫోన్లు రావడం
- ఫోన్ తరుచూ హ్యాంగ్ అయిపోవడం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఫోన్‌లో పటిష్టమైన యాంటీ వైరస్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి
- ఫోన్ పాస్‌వార్డును ప్యాట్రన్ రూపంలో పెట్టుకోవాలి
- డిఫాల్ట్ పాసువార్డులు అంటే 1234, 0000, ఫోన్ డయల్ ప్యాడ్ (నిలువు, అడ్డం)అంకెల ప్రకారం పాస్‌వార్డులను పెట్టుకోవద్దు
- బహిరంగ వైఫైతో బ్యాంకు లావాదేవీలు, ప్రైవేట్ వ్యవహారాలు జరుపొద్దు
- బ్లూటూత్‌ను ఎక్కువగా ఉపయోగించవద్దు
- బ్రౌజర్ సెర్చ్‌ను ఎప్పటికప్పుడు డిలీట్ చేయాలి
- వెబ్‌రూట్ అప్లికేషన్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలి

రద్దయిన నోట్ల మార్పిడి ముఠా అరెస్ట్

- కాచిగూడలో రూ.కోటితోపాటు ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న రద్దయిన నోట్లు

కాచిగూడ: రద్దయిన నోట్లు సుమారు రూ.కోటి మార్పిడికి యత్నిస్తున్న ముఠాను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పురకు చెందిన వ్యాపారి రాజ్‌కుమార్ బగాడియా(51) వద్ద రద్దయిన నోట్లు ఉన్నాయి. తలాబ్‌కట్టకు చెందిన అహ్మద్‌బిన్ అలీ(38), దూద్‌బౌలికి చెందిన సల్మాన్(28), చార్మినార్ ప్రాంతానికి మహ్మద్ షబ్బీర్(42), నేరేడ్‌మెట్‌కు చెందిన మహ్మద్ అహ్మద్ షరీఫ్(30), రెడ్డి శేఖర్(63)ని శనివారం బర్కత్‌పురలోని పాలెం టవర్స్‌లో ఈ నోట్ల మార్పిడికి యత్నిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి వారిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి 7,900 రద్దయిన వెయ్యినోట్లు, 4,200 రద్దయిన 500 నోట్లతో పాటు ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి రిమాండ్



మహ్మద్ ఇర్ఫాన్ అహ్మద్, షేక్ మహ్మద్ అహ్మద్

సుల్తాన్‌బజార్: సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో చేసిన ప్రయత్నం బెడిసి కొట్టి ఇద్దరు యువకులను కటకటాల పాలు చేసింది. శనివారం అఫ్జల్‌గంజ్ పోలీసులు ఎంజీబీఎస్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నల్లగొండకు చెందిన మహ్మద్ ఇర్ఫాన్ అహ్మద్(25), షేక్ మహ్మద్ అహ్మద్(28) దూల్‌పేట ప్రాంతంలో గంజాయి విక్రయించేందుకు బైక్‌పై వస్తున్నారు. ఎంజీబీఎస్ సమీపంలోకి రాగానే వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు వీరిని పట్టుకున్నారు. వీరి నుంచి ఏడు కిలోల గంజాయి, బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

మహిళల భద్రతకు ప్రభుత్వ భరోసా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం మహిళల రక్షణ, భద్రత కోసం పనిచేస్తున్నదని ఆర్అండ్‌బీ, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. శనివారం సచివాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా హెల్ప్‌లైన్-181ను మంత్రి ప్రారంభించారు. మహిళల భద్రత కోసం మేమున్నామనే భరోసా కలిగేలా ప్రభుత్వం హెల్ప్‌లైన్‌ను రూపొందించిందని చెప్పారు. పబ్లిక్, ప్రైవేటు ప్రదేశాల్లో, కుటుంబం, సమాజం, పనిప్రదేశాల్లో వేధింపులు, హింసకు గురవుతున్న మహిళలకు సహాయం అందించేలా ఈహెల్ప్‌లైన్ పని చేస్తుందన్నారు. ఈ హెల్ప్‌లైన్ ద్వారా 24 గంటలు, 365 రోజులు సలహా, కౌన్సెలింగ్, రక్షణ కోసం అవసరమైన సహాయ సహకారాలు పొందవచ్చని వెల్లడించారు. మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ 181 హెల్ప్‌లైన్‌ను ప్రతిశాఖకు అనుసంధానం చేశామన్నారు. మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి జగదీశ్వర్ మాట్లాడుతూ దేశంలో అత్యవసర సేవల నిర్వహణలో జాతీయస్థాయిలో అత్యంత నైపుణ్యం, అనుభవం కలిగిన జీవీకే-ఈఎంఆర్ఐ సంస్థ సాంకేతిక సహకారంతో హెల్ప్‌లైన్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంచే కేంద్ర ఆర్థిక సహకారంతో దీనిని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ విజయేందిర బోయి, హైదరాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రశాంతి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, రీజినల్ ఆర్గనైజర్స్ సుశీలరెడ్డి, శరణ్యారెడ్డి పాల్గొన్నారు.

మహిళా హెల్ప్‌లైన్ -181ను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



శనివారం సచివాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా హెల్ప్‌లైన్-181 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుండు సుధారాణి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, టీఎస్ ఐడీసీ చైర్మన్ ఎస్‌బీ బేగ్ తదితరులు

డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు మరోసారి కౌన్సెలింగ్

- దోస్త్ అధికారుల నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని డిగ్రీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపులో గందరగోళం తలెత్తడంతో మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించే అంశంపై శనివారం దోస్త్ అధికారులు చర్చించారు. ఎంపిక చేసుకున్న కాలేజీల్లో కాకుండా ఇతర కాలేజీల్లో సీట్లు వచ్చాయని విద్యార్థులు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో డిగ్రీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియను మరోసారి నిర్వహించాలని సూత్రప్రాయంగా దోస్త్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ అంశంపై సోమవారం మరోసారి సమావేశమై తుదినిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ నెల 10న దోస్త్-2017 మూడోవిడుత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించారు. సీజీజీ ఆధ్వర్యంలో తలెత్తిన సాంకేతిక కారణాల వల్ల వాటిని నిలిపివేశారు. తిరిగి మరోసారి గురువారం సీట్లు కేటాయించారు. ఇందులో తొలిసారి వచ్చిన కాలేజీలలో కాకుండా ఇతర కాలేజీలో సీట్లు వచ్చాయి. దీంతో విద్యార్థులు ఏ కాలేజీలో ప్రవేశం పొందాలో తెలియక అయోమయంలో పడ్డారు. దోస్త్ అధికారులకు విద్యార్థులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకులది జిల్లాకో మాట

మీరు రాజీనామాలు చేయండి.. మేము దానికి సిద్ధం
మంత్రి జూపల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం
టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు బాలరాజు, చిట్టెం, ఎమ్మెల్సీ కసిరెడ్డి ఫైర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రాజెక్టులపై కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లాకో మాట మాట్లాడుతున్నారని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు విమర్శించారు. కల్వకుర్తి, డిండి ప్రాజెక్టులపై కూడా ఇదేవైఖరి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి మంత్రి జూపల్లి కృష్ణారావుపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. శనివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి బాలరాజు మీడియాతో మాట్లాడారు. కల్వకుర్తి ప్రాజెక్టు డిజైన్‌లో ఆ గ్రామానికే నీళ్లు అందని విధంగా చేశారని, కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టులు కాంట్రాక్టర్ల కోసమే రూపొందించారనడానికి ఇలాంటి అనేక ఉదాహరణలు ఉన్నాయని చెప్పారు. జిల్లా అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న మంత్రి జూపల్లి ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. ప్రజల్లో ఉనికిని కోల్పోయామనే అక్కసుతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలందరు రాజీనామా చేయాలని, తమ పార్టీ ఎమ్మెల్యేలు కూడా రాజీనామాలకు సిద్ధంగా ఉన్నారని బాలరాజు ప్రకటించారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులపై చర్చించడానికి తాము ఎప్పుడూ సిద్ధమేనని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పెద్ద నాయకులపై నోటికొచ్చినట్లు మాట్లాడితే పెద్ద నాయకుడిని అవుతానని వంశీ అనుకోవడం అవివేకమన్నారు. పదేపదే మంత్రి జూపల్లి కృష్ణారావును విమర్శిస్తే ఊరుకోబోమని, పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి కింద 33 వేల ఎకరాల ఆయకట్టును 65 వేలకు పెంచిన విషయాన్ని ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి మరిచిపోయినట్లు ఉందన్నారు. మంత్రి జూపల్లి కృషితోనే కల్వకుర్తి ప్రాజెక్టు సామర్థ్యాన్ని 25 టీఎంసీల నుంచి 40టీఎంసీలకు పెంచారన్నారు. పాలమూరు కరువును పారదోలడానికి సీఎం కేసీఆర్ రూ.35వేల కోట్లతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించారని గుర్తుచేశారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం కావడానికి అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రి జూపల్లి ప్రజా జీవితంలో హీరో అని, కల్వకుర్తిలో వంశీచంద్‌రెడ్డి జీరో అన్నారు.

వర్గీకరణకాకుండా బీజేపీ, మంద కృష్ణ కుట్ర

- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ధ్వజం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎస్సీ వర్గీకరణ కాకుండా బీజేపీ, మంద కృష్ణ మాదిగ కుట్ర చేస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ దేశవ్యాప్త సమస్య కాదని, వర్గీకరణ చేసుకునే అధికారాన్ని రాష్ర్టాలకు కల్పించేవిధంగా 341(బీ) ఆర్టికల్‌కు సవరణ చేయాలని అన్నారు. శనివారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అనేక అంశాలపై రాజ్యాంగ సవరణలు చేశారని, ఎస్సీ వర్గీకరణపై కూడా చేయాలని సూచించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం వర్గీకరణకు కట్టుబడి ఉందని, అసెంబ్లీలో తీర్మానం సైతం చేసి, ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రధాని నరేంద్రమోదీకి లేఖ అందజేశారని ఆయన గుర్తుచేశారు. ఉషా మెహ్రా కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నారు. పోరాటాల ద్వారానే వర్గీకరణ సాధ్యమవుతుందని, పోరాటానికి మేధావులు, విద్యార్థులు, యువత కలిసి కలిసి రావాలని పిలుపునిచ్చారు. మంద కృష్ణ మాదిగ వర్గీకరణ సమస్యను 20 ఏండ్లుగా క్రికెట్‌లో 20-20 మ్యాచ్‌గా ఆడుకుంటున్నారని ఆరోపించారు. మాదిగలు మంద కృష్ణను తరిమికొట్టే రోజుల్లో దగ్గరల్లోనే ఉన్నాయన్నారు.

వాన జోరు

మూడోపేజీ తరువాయి...

నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. తాలిపేరు ప్రాజెక్టు 10 గేట్లను ఎత్తి 30 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. కిన్నెరసాని రిజర్వాయర్ నీటి మట్టం పెరుగుతుండడంతో గేట్లు ఎత్తి నీటిని వదిలారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురవగా మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇదిలాఉండగా శుక్రవారం నాటి అల్పపీడనం బంగాళాఖాతంలో ఉత్తరం వైపు ప్రయాణిస్తున్నది. ఒడిశా కోస్తా తీరాన్ని, కోస్తాంధ్ర తీరాన్ని శనివారం తాకింది. దీని ప్రభావంతో దక్షిణ తమిళనాడు, కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలలో ఆదివారం పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు చురుకుగా పనిచేస్తున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణ ప్రాంతం అంతటా వర్షాలు కురుస్తాయని వివరించింది. ఆదివారం తెలంగాణలోని జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి శనివారం ఉదయం 8:30 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏటూరునాగారంలో అత్యధికంగా 9 సెం.మీ, కోయిడా 8 సెం.మీ, వెంకటాపురం , ముల్కలపల్లెలో6 సెం.మీ, సత్తుపల్లి, గోవిందరావు పేట, వెంకటపూర్, మనుగూరు, నల్లబెల్లిలలో 5 సెం.మీ, అశ్వారావుపేట, బోనకల్,పినపాక, బూర్గంపాడు, ములుగు, కొణిజెర్ల, ఖానాపూర్, తొల్లాడలలో 4 సెం.మీ, అశ్వాపురం,జూలూరుపాడు,మధిర, గుండాల, చంద్రుగొండ, బయ్యారం, గూడూరు, కుసుమంచి, ఉట్నూరు, ఎన్కూరు, కొత్తగూడెంలలో 3 సెం.మీ, పరకాల, ఆత్మకూర్, జగిత్యాల, మహబూబాబాద్, కాళేశ్వరం, దోమలలో 2 సెం.మీ, గోల్కొండ, మక్తల్, తాండూర్, మగ్నూర్,తిమ్మాపూర్‌లలో 1 సెం.మీ చొప్పున, మరికొన్ని ప్రాంతాలలో ఓ మోస్తరు వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

హైదరాబాద్ సమావేశం మీద ఆశలు

జీఎస్టీలో మార్పులకు అవకాశం • 135 వస్తువుల పన్నులపై విజ్ఞప్తులు
ఫిట్‌మెంట్ కమిటీకి పంపిన కౌన్సిల్ • సహేతుకతపై కొనసాగుతున్న పరిశీలన
34 అంశాలపై తెలంగాణ విజ్ఞప్తులు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: జూలై 1 నుంచి జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఏర్పడిన ఇబ్బందులకు వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశం పరిష్కారం చూపిస్తుందని రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు, ప్రజలు కూడా ఎదురుచూస్తున్నారు. మొత్తం 1200 రకాల వస్తువులను నాలుగు శ్లాబుల పన్నుల కిందికి తీసుకొస్తూ జీఎస్టీ విధానాన్ని అమలుచేస్తున్నారు. ఈ క్రమంలో సుమారు 135 వస్తువులపై పన్నును తగ్గించడమో లేక పూర్తిగా ఎత్తివేయడమో చేయాలని కోరుతూ అనేక రాష్ర్టాలు, పరిశ్రమల నుంచి విజ్ఞాపనలు వచ్చాయి. వీటన్నింటినీ ఫిట్‌మెంట్ కమిటీకి పంపించిన కౌన్సిల్, వాటిలోని సహేతుకతను, వాస్తవిక స్వభావాన్ని అధ్యయనం చేసి తదుపరి సమావేశానికి స్పష్టమైన అభిప్రాయాన్ని వెల్లడించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఫిట్‌మెంట్ కమిటీ పరిశీలన ప్రక్రియ కొనసాగుతున్నది. జీఎస్టీ కౌన్సిల్ విధించిన పన్నుల్లో ఎలాంటి మార్పులు చేయాలన్నా మళ్లీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాల్సిందే తప్ప, కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదు. అందువల్ల వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే కౌన్సిల్ సమావేశంపై ఆసక్తి ఏర్పడింది. కొన్ని వస్తువుల పన్నుల విషయంలోనైనా మార్పులు చేసే అవకాశముంది.

క్రయ విక్రయాలపై ప్రభావం..

జీఎస్టీ విధింపు అనంతరం వివిధ వస్తువుల క్రయవిక్రయాల్లో ఒడిదొడుకులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో పిన్నీసులు



మొదలు లగ్జరీ కార్లు, బైకుల వరకు 135 వస్తువుల పన్ను తగ్గించాలంటూ విజ్ఞాపనలు వచ్చాయి. కౌన్సిల్ నిర్ధారించిన పన్నులను అమలు చేస్తున్న క్రమంలో వస్తున్న చేదు అనుభవాలు, ప్రజల నుంచి తలెత్తుతున్న అసంతృప్తి, క్రయ విక్రయాలపై ప్రభావం తదితర అంశాలను వీటిలో ఉటంకించారు. రక్షిత త్రాగునీటి క్యాన్లు, బాటిళ్లు, ప్యాకెట్లపై 18శాతం జీఎస్టీ విధింపువల్ల ఆ రంగంపై గణనీయ ప్రభావం పడింది. పట్టణ ప్రాంతాల్లో 20 లీటర్ల రీఫిల్ క్యాన్ల విక్రయం పడిపోయినట్లు ఆయా సంస్థలు విజ్ఞాపనల్లో పేర్కొన్నాయి. ప్రజలు ఆరోగ్య రక్షణకోసం వినియోగించే ఈ వస్తువులపై జీఎస్టీని పూర్తి స్థాయిలో ఎత్తివేయాలని ఆ సంస్థలు విజ్ఞప్తి చేశాయి.

హెల్మెట్ల మీదా పన్నేనా?..

హెల్మెట్ల మీద ఏకంగా 18శాతం పన్ను విధింపుపై పరిశ్రమ నుంచి, ప్రజలనుంచి కూడా వ్యతిరేకత వచ్చింది. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు ప్రాణరక్షణ కోసం హెల్మెట్లను ధరించాలని ప్రభుత్వాలు, పోలీసు యంత్రాంగం విస్తృతంగా అవగాహన కలిగిస్తున్న నేపథ్యంలో పన్నును 5%కి తగ్గించాలని ఉత్పత్తి సంస్థలు కోరాయి.

జీఎస్టీని తగ్గించాలని వచ్చిన విజ్ఞప్తుల్లో కొన్ని ...

- ఐటీ ఉత్పత్తులపై జీఎస్టీని 18% నుంచి 12%కు తగ్గించాలి.
- హార్డ్‌వేర్‌పై 28% నుంచి 18%కి తగ్గించాలి.
- చేనేతపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలి.
- గ్రానైట్ శ్లాబ్‌లను 28% నుంచి 18%కి తగ్గించాలి.
- ట్రాక్టర్లపై 12% నుంచి 5%కి తగ్గించాలి.
- చిప్స్, మిక్చర్, ఖార, నంకీన్ తదితరాలను 5%లో చేర్చాలి.
- నూడుల్స్‌పై 18% నుంచి 5%కి తగ్గించాలి.
- కుల్ఫీ, ఎండు ఖర్జూరం, చక్కెరతో చేసే పల్లీపట్టిలపై జీఎస్టీని తగ్గించాలి.
- చట్నీ పొడిపై 18% నుంచి 12%కి, పచ్చళ్ళపై 12% నుంచి 5%కి తగ్గించాలి.
- మహిళల న్యాప్‌కిన్స్‌పై జీఎస్టీని ఎత్తివేయాలి.
- చేపల వలలపై పన్నును 5%కి తగ్గించాలి. చెక్కతో చేసే ఫర్నీచర్‌పై 12%కి తగ్గించాలి.
- ముడి గ్రానైట్‌పై 12% నుంచి 5%కి, పాలిష్ చేసిన గ్రానైట్‌పై 28% నుంచి 18%కి తగ్గించాలి.
- ఫ్లైయాష్‌పై 18%, ఫ్లైయాష్‌తో చేసే ఇటుకలపై 12% పన్నును పూర్తిగా ఎత్తివేయాలి.
- పిన్నీసులు, ఎల్పీజీ స్టవ్‌లు, వెట్ గ్రైండర్లు, గొడుగులు, పిల్లల వస్తువులు, వస్త్ర పరిశ్రమల్లో వాడే యంత్రాలు, స్పేర్‌పార్టులు, తూకం యంత్రాలపై జీఎస్టీని తగ్గించాలి.
- ఈ విజ్ఞాపనలపై ఫిట్‌మెంట్ కమిటీ ఎలాంటి సిఫారసులు చేస్తుందో, ఇందులో ఎన్ని వస్తువులపై పన్ను తగ్గుతుందో వేచి చూడాలి.

34 వస్తువులపై తెలంగాణ విజ్ఞప్తి..

తెలంగాణ ప్రభుత్వం ప్రధానంగా ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపై జీఎస్టీ రూపంలో అదనపు భారం మోపవద్దని గట్టిగా డిమాండ్ చేస్తున్నది. అలాగే చిన్న తరహా గ్రానైట్, బీడీలు, చేనేత వస్ర్తాలు, నూలు, సిమెంటు పైపులు, ఉప్మా రవ్వ, బిస్కట్లు, వరిపొట్టు నుంచి తయారుచేసే వంటనూనె.. ఇలా మొత్తం 34 రకాల వస్తువులపై జీఎస్టీ పన్నును తగ్గించాలని పలు సమావేశాల్లో విజ్ఞప్తి చేసింది.

త్వరలో మరో ఏరోస్పేస్ సెంటర్





శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఆదిబట్ల- నాదర్‌గుల్ ఇండస్ట్రియల్ పార్కులో న్యూకాన్ ఏరోస్పేస్ మిసైల్ యూనిట్ ప్రారంభోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న ఐటీ, పురపాలక శాఖల మంత్రి కే తారకరామారావు. చిత్రంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి.. సంస్థ ఎండీ హేమంత్ జలాన్‌తో కలిసి మిసైల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

మూడోపేజీ తరువాయి...

ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఏదైనా కారణంతో అనుమతులు ఇవ్వడంలో నిర్లక్ష్యంచేసే అధికారులకు రోజుకు వెయ్యిరూపాయల జరిమానా విధించే అంశం ఈ విధానంలో ఉందని చెప్పారు. రెండేండ్లలోనే రాష్ట్రంలో 4,100 భారీ పరిశ్రమలను ఏర్పాటుచేసి, 2.37 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని కేటీఆర్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ఏర్పాటుచేసిన పరిశ్రమల్లో 50% వరకు వాణిజ్య కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో 10 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టించి పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని కేటీఆర్ చెప్పారు. ఐటీ, జీవశాస్త్ర రంగాల్లో తెలంగాణ మంచి పురోభివృద్ధిని సాధిస్తున్నదన్నారు. పారిశ్రామిక రంగంలో రాష్ర్టాన్ని నంబర్‌వన్‌గా నిలిపేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రత్యేక చొరవ చూపుతున్నారని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తలను తయారుచేయడంకోసం వైమానిక విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం లండన్‌కు చెందిన క్రాన్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వంద శాతం విదేశీ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నదని, దీంతో భారీ పరిశ్రమలను నెలకొల్పేందుకు పలువురు ముందుకొస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఆదిబట్ల, శంషాబాద్‌లో రెండు ఏరోస్పేస్ సంస్థలను ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటుచేసిందని, త్వరలో మరొకటి నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహికులకు అన్ని రకాల రాయితీలు, ప్రోత్సాహకాలను అందిస్తున్న నేపథ్యంలో పారిశ్రామికవేత్తల చూపులు తెలంగాణవైపు పడుతున్నాయన్నారు. సులభవాణిజ్య విధానంలో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో ఉందని మంత్రి గుర్తుచేశారు.

శాంతిభద్రతలకు ఢోకాలేదు: హోంమంత్రి

రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగుండడంతో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. పరిశ్రమలను ఏర్పాటుచేసి, ఉన్నత విద్యావంతులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రాష్ట్ర ఐటీ సలహాదారుడు డాక్టర్ సతీశ్‌రెడ్డి, ఇస్రో డైరెక్టర్ సోమనాథ్, బీడీఎల్ సీఎండీ ఉదయ్‌భాస్కర్, ఆర్సీఐ డైరెక్టర్ నారాయణ మూర్తి, డీఆర్డీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రమౌళి, న్యూకాన్ సీఎండీ హేమాంత్ జలాన్, డైరెక్టర్ ఉదయ్ జలాన్ పాల్గొన్నారు. బీడీఎల్ రూపొందిస్తున్న ఆకాశ్ క్షిపణి తోకభాగాన్ని న్యూకాన్ ఏరోస్పేస్‌లో తయారుచేస్తారు. ఇక్కడ తయారుచేసే వివిధ విడిభాగాలను జర్మనీకి ఎగుమతి చేస్తారు. ఇప్పటివరకు క్షిపణులకు సంబంధించిన పరికరాలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆదిబట్లలోని ఏరోస్పేస్ సెంటర్‌లో తయారయ్యే విడిభాగాలు ఇతర దేశాలకు ఎగుమతి కానుండటం విశేషం.హెచ్‌ఏఎల్, బీఈఎంఎల్, బీడీఎల్, బీఈఎల్, ఇస్రో, డీఆర్డీవో, బ్రహ్మోస్, రాఫెల్ తదితర ప్రఖ్యాత క్లయింట్లు తమకు ఉన్నారని కంపెనీ సీఎండీ హేమంత్ జలాన్ తెలిపారు.

భూ విజయం!

మూడోపేజీ తరువాయి...

దశాబ్దాలుగా న్యాయవివాదాల్లో నలుగుతున్నాయి. హైకోర్టులో ల్యాండ్ గ్రాబింగ్ కేసు పెండింగ్‌లో ఉంది. ఈ సమస్య మీద సీఎం సీరియస్‌గా దృష్టి పెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించి రెవెన్యూ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. ప్రభుత్వ భూములపై ప్రైవేటు పెత్తనాలను సహించబోమని, కేసును గెలిచి తీరాలని నిర్దేశించారు. ఫలితం.. ఇవాళ అన్ని దశలు దాటి సుప్రీంకోర్టులోనూ ప్రభుత్వం విజయం సాధించింది. బంజారాహిల్స్ రోడ్డు నెం.12లోని రూ.750 కోట్ల విలువైన 15 ఎకరాల భూమి చెర వీడింది. పేదల ఇండ్లు పోగా మరో నాలుగు ఎకరాలు ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించేందుకు మార్గం సుగమమైంది. మూడు దశాబ్దాలుగా పెండింగ్ ఉన్న ఈ కేసు సీఎం చొరవతో పరిష్కారమైంది. బస్తీవాసులు పండుగ చేసుకుంటున్నారు. ఇదొక్కటే కాదు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇలాంటి అనేక విజయగాథలున్నాయి. గత మూడేండ్లనుంచి ప్రభుత్వం భూరాబందుల రెక్కలు విరిచేస్తున్నది. కబ్జాకు గురైన స్థలాలు ఒక్కొక్కటిగా సర్కారు ఖాతాలోకి చేరుతున్నాయి.

విలువైన భూమి కథ

బంజారాహిల్స్ రోడ్డు నం.12లో టీఎస్ నెం.7/3, 18, 21, 23, 24, బ్లాక్-కె, వార్డు-12, సర్వే నెం.403లో సుమారు రూ.750 కోట్ల విలువైన భూమి తనదేనంటూ షేక్ అహ్మద్ బిన్ ఆమూదీ అనే వ్యక్తి క్లెయిమ్ చేస్తున్నాడు. అతనిపై 118/1989 కింద ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదైంది. ఎవరి దగ్గరో కొనుగోలు చేశానంటూ అతడు చూపించింది తప్పుడు డాక్యుమెంటని రుజువైంది. రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా అది ప్రభుత్వ స్థలంగా ఉంది. ల్యాండ్ గ్రాబింగ్ కోర్టులో ఓడిపోయిన ఆమూదీ హైకోర్టుకు అప్పీల్‌కు వెళ్లాడు. అక్కడ ఏండ్ల తరబడి కేసు పెండింగ్‌లో పడింది. ఈలోగా స్థల వివాదాన్ని అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వంలో ఉన్న కొందరు పెద్దలు ఈ స్థలంలో వాటా కొట్టేద్దామని యత్నించారు. స్థానిక ప్రజాప్రతినిధి అండతో కొంత స్థలాన్ని ఓ ఉత్తరాంధ్ర మంత్రి తన బంధువు పేరిట కొనుగోలు చేసినట్లు బోగస్ డాక్యుమెంట్లు సృష్టించాడు. ఈ స్థలంలో నిర్మాణాలు చేపడుతుండగా అప్పట్లో షేక్‌పేట మండల తహసీల్దార్‌గా ఉన్న చంద్రకళ అడ్డుకున్నారు. కక్ష పెంచుకున్న సదరు ప్రజాప్రతినిధి అమెను బదిలీ చేయించారు. హైకోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చినా.. అప్పటి ప్రభుత్వ పెద్దలు స్థలాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నించలేదు. ఈలోగా ఆమూదీ సుప్రీంకోర్టుకు వెళ్లాడు. ఆ సాకుతో నాటి ప్రభుత్వం యథాతథస్థితిని కొనసాగించింది. తర్వాత తెలంగాణ ప్రభుత్వం రావడం.. సీఎం కేసీఆర్ సీరియస్‌గా స్పందించడంతో పరిస్థితి తలకిందులైంది. ఈనెల 16వ తేదీన సుప్రీంకోర్టు తుది తీర్పు ఇస్తూ పిటిషన్‌దారుడికి ఎలాంటి హక్కులు లేవంటూ కేసును కొట్టేసింది. 15 ఎకరాలపై పూర్తి హక్కులు ప్రభుత్వానివేనని స్పష్టం చేసింది. 1989 నుంచి ఈ కేసు నడువడం వెనుక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రులుగా, ఎంపీలుగా పనిచేసిన వారి హస్తం ఉందని, అందుకే రెవెన్యూ యంత్రాంగం ఈ భూమిమీద దృష్టి సారించలేదని తెలిసింది. ప్రస్తుతం ప్రభుత్వం చేతికి వచ్చిన 15 ఎకరాల భూమిలో 10 ఎకరాల మేర ఎన్‌బీటీనగర్, రేషంబాగ్, మరికొన్ని బస్తీలుండగా మరో 4 ఎకరాల ఖాళీ స్థలాలున్నాయని డిప్యూటీ కలెక్టర్ కే చంద్రకళ 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు.



2015 మే 19న హైదరాబాద్‌లోని ఎన్బీటీ నగర్ పర్యటనలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



బంజారాహిల్స్‌లోని ఎన్బీటీ నగర్

మూడేండ్లలో ప్రభుత్వ ఖాతాలోకి వందల ఎకరాలు..

గత మూడేండ్లలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని రూ.50 వేల కోట్ల విలువజేసే భూములను ప్రభుత్వం కాపాడింది. ఒక్క బంజారాహిల్స్ ప్రాంతంలోనే 300 స్థలాలను కాపాడి వాటిని ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ బోర్డులు కూడా పాతింది. ఏండ్ల తరబడి కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయని కేసుల్లోనూ సీఎం చొరవతో సానుకూలత సాధించింది. అక్రమార్కులపై పీడీ యాక్టులను ప్రయోగిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డిని జైలుకు కూడా పంపించింది. కబ్జాలకు యత్నించిన వారిలో బడా నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, గండిపేట, శంషాబాద్, బాలాపూర్, మహేశ్వరం మండలాలు, మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి, మేడ్చల్, శామీర్‌పేట, కాప్రా, ఘట్‌కేసర్ తదితర మండలాల్లో అనేక చిక్కుముళ్లను విప్పేందుకు రెవెన్యూ యంత్రాంగం సమాయత్తమవుతున్నది. దీని ద్వారా ప్రజాప్రయోజనాలకు అవసరమైన భూమి కొరత తీరే అవకాశాలు ఉన్నాయని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
ఆదివారం 20 ఆగస్టు 2017

WWW. NTNEWS.COM



వయా యూట్యూబ్!

వెల్ కమ్ టు యూట్యూబ్ వరల్డ్ ఇక్కడ సెలబ్రిటీలను తయారు చేయబడును. టాలెంట్ ఉన్న వ్యక్తులను అందలం ఎక్కించబడును. ఒక్క అవకాశం.. ఒకే ఒక్క అవకాశం అని ఎదురుచూసిన ఎంతోమంది యంగ్‌స్టర్స్ ఇప్పుడు యూట్యూబ్ స్టార్లుగా ఓ వెలుగు వెలుగుతున్నారు. యూట్యూబ్ వేదికగా తమకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ట్రెండ్ సెట్టర్ల గురించి ఈ ప్రత్యేక కథనం..

యూట్యూబ్ చాలా మంది నటులకు, ఫిలిం మేకర్లకు వరంగా మారింది. వాళ్ల టాలెంట్ నిరూపించుకోవడానికి, లక్షలమంది నెటిజనులకు చేరువ చేస్తుంది. సూటిగా చెప్పాలంటే జనాల దగ్గరకి తీసుకెళ్లే ఓ వేదిక అయింది. యూట్యూబ్‌లో షార్ట్‌ఫిలిం, వీడియోల్లో నటించి తెలుగు చిత్రసీమకు ఇప్పటికే ఎంతోమంది పరిచయం అయ్యారు. అవుతున్నారు. హీరో, హీరోయిన్, కమెడియన్, డైరెక్టర్ వాట్‌నాట్ అన్ని క్రాఫ్టుల్లో కాలుమోపుతున్నారు.యూట్యూబర్‌గా కెరీర్ స్టార్ట్ చేసి సినిమా అవకాశాల్లో దూసుకుపోతున్నారు. యూట్యూబ్ వేదికగా వాళ్లకున్న టాలెంట్‌ను చూపించుకుంటున్నారు. ఇదే వేదికగా చాలా మంది యువ కళాకారులు కెరీర్ మొదలుపెట్టి సక్సెస్‌ఫుల్ యూట్యూబర్లుగా ఖ్యాతికెక్కారు. అవకాశాల కోసం వెతుకడం కాదు.. అవకాశాలను సృష్టించుకొని తక్కువ కాలంలో స్టార్‌డమ్ తెచ్చుకున్నారు. సరదాగా ఇంట్లో జరిగే సంఘటనలను, ఊర్లో జరిగే సందర్భాలను, కామెడీ స్కిట్లను, రూరల్ తిట్లను అన్నింటినీ వీడియో తీసి యూట్యూబ్‌లో పెడుతున్నారు. కుప్పలు తెప్పలుగా వ్యూస్ సంపాదిస్తున్నారు. ఊహించని పాపులారిటీ తెచ్చుకుంటున్నారు.

యూట్యూబ్ వీడియోల ప్రపంచం. ఇక్కడ దొరుకని వీడియో ఉండదు. సెర్చ్ కొడితే క్షణాల్లో వీడియో ప్రత్యక్షమవుతుంది. రోజుకు ప్రపంచవ్యాప్తంగా లక్షల వీడియోలు అప్‌లోడ్ అవుతున్నాయి. ఎంతో మందిని స్టార్స్‌ని చేస్తున్నాయి. కొందరికి కాసులు కురిపించే కల్పవల్లిగా మారితే ఇంకొందరికి అవకాశాలిచ్చే అన్నపూర్ణ అయింది. కొందరు యూట్యూబ్ ద్వారా లక్షల రూపాయలు సంపాదిస్తుంటే.. కొందరు మాత్రం లక్షలాది మంది అభిమానుల్ని సంపాదించుకుంటున్నారు. మీరూ ట్రై చేయండి. విషయం ఉంటే చాలు.. విపరీతమైన పాపులారిటీ వస్తుంది. మీకున్న టాలెంట్‌ను వీడియో చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయండి. కటౌట్‌లను కాదు.. కంటెంట్‌ను నమ్ముకొని ఎదిగిన యూట్యూబ్ స్టార్స్ విశేషాలివి..

సుహాస్ :
అతిథి అనే షార్ట్‌ఫిలిమ్‌తో ఆకట్టుకున్న సుహాస్.. చాయ్ బిస్కెట్ కోసం యూట్యూబ్‌లో ఇప్పటికే ఎన్నో వీడియోలు చేశాడు. సృజనాత్మకతను జోడించి అద్భుతమైన వీడియోలు తీస్తూ తనదైన మార్క్ వేసుకున్నాడు. మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు.



జాహ్నవి (మహాతల్లి) :
యూట్యూబ్ వేదికగా జాహ్నవి దాశెట్టి కెరీర్ మొదలుపెట్టింది. సరదాగా ఇంట్లో జరిగే సంఘటనలు వీడియో తీసి యూట్యూబ్‌లో పెట్టింది. ఊహించని స్పందన. టైమింగ్ కామెడీతో, అర్థవంతమైన సీన్‌లతో నెటిజనులకు నైబర్‌గా మారింది. ఊహించని పాపులారిటీ వచ్చింది. వైరల్లీ సౌత్ ప్రజెంట్స్ 'మహాతల్లి' వీడియోలు యూట్యూబ్‌లో ట్రెండ్ సెట్టర్ అయ్యాయి. లిల్లీ సింగ్ సూపర్ ఉమన్ సిరీస్‌ను ఆదర్శంగా తీసుకొని ఈ వీడియోలు చేస్తున్నది. సినిమాలు ప్రమోట్ చేసే స్థాయికి ఎదిగింది. సినిమాల్లో నటించే చాన్స్ కూడా దక్కించుకున్నది.



వైవా హర్ష :
చిన్న ఐడియా యూట్యూబ్‌లో హర్షకు మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది. హర్ష అండ్ టీమ్ చేసిన ఈ వీడియో హర్ష ఇంటి పేరునే వైవాగా మార్చింది. చూడగానే నవ్వు తెప్పించే వైవా హర్ష వైవా షార్ట్‌ఫిలింతో యూట్యూబ్‌లో ఓవర్ నైట్ యూట్యూబ్ స్టార్ అయిపోయాడు. వైవాతో మెరిసి ఇప్పుడు మూవీ ఆఫర్లతో ఫుల్ బిజీగా ఉన్నాడు. వైవా పేరుతో యూట్యూబ్ చానల్ పెట్టి ఉపాధి కల్పించే స్థాయికి వెళ్లాడు.



ఫన్‌బకెట్ :
తెలుగు వన్ యూట్యూబ్ చానెల్‌లో ప్రారంభమైన 'ఫన్‌బకెట్' ఎందరో యాక్టర్లను తయారుచేసింది. మహేష్ అనే కమెడియన్ మంచి టైమింగ్‌తో స్టార్ అయ్యాడు. సినిమా అవకాశాలు రావడంతో ఇప్పుడిప్పుడే బిజీ అవుతున్నాడు.



షణ్ముఖ్ జస్వంత్ :
వైజాగ్‌కు చెందిన యంగ్ డాన్సర్ షణ్ముఖ్. షన్నుగా పిలువబడే షణ్ముఖ్ డాన్స్‌లో తన అసాధారణ ప్రతిభతో ఓ ఊపు ఊపుతున్నాడు. ఎంతోమంది ఫ్యాన్స్‌ను సంపాదించాడు.





మై విలేజ్ షో :
ఊర్లలో జరిగే సరదా సన్నివేశాలను వీడియోలు తీసి కాస్త సందేశం అనే మసాలా వేసి ఆలోచింపజేస్తున్నాడు జగిత్యాల కుర్రాడు శ్రీరాం శ్రీకాంత్. మై విలేజ్ షో పేరుతో యూట్యూబ్ చానల్ పెట్టి రెగ్యులర్‌గా కాకుండా కాస్త డిఫరెంట్ నవ్వొచ్చే వీడియోలు తీస్తున్నాడు. ఇంకేముంది? వ్యూస్ పెరిగాయి.. విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ మొదలైంది.

యూట్యూబ్ ద్వారా సినిమా అవకాశాలు అందిపుచ్చుకున్న లక్కీస్టార్స్ వీళ్లు..

రాజ్ తరుణ్ : బ్లైండ్ డేట్ అనే షార్ట్ ఫిలిం ద్వారా ఉయ్యాల జంపాల సినిమాలో హీరోగా అవకాశం సంపాదించాడు.

రెజీనా : కానల్ నీర్ షార్ట్ ఫిలింతో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టి 'శివ మనసులో శృతి' సినిమాలో నటించే అవకాశాన్ని అందుకున్నది.

అనీషా అంబ్రోస్ : పీకే ప్రేమలో పడ్డాడు అనే షార్ట్‌ఫిలింలో నటించి అలియాస్ జానకీ అనే ఫీచర్ ఫిలింలో నటించే చాన్స్ దక్కించుకున్నది.

చైతన్య కృష్ణ : తొక్కలో లవ్ స్టోరీ షార్ట్‌ఫిలింలో ఇరగదీసి అలా మొదలైంది సినిమాలో కనిపించాడు.

చాందినీ చౌదరి : మధురం షార్ట్‌ఫిలింతో ఆకట్టుకొని కేటుగాడు హీరోయిన్‌గా దర్శనమిచ్చింది.

రీతూ వర్మ : పెళ్లిచూపులు సినిమాతో ప్రతి ఇంటికి పరిచయమైన రీతూ, 'అనుకోకుండా' అనే షార్ట్‌ఫిలింలో నటించి మెప్పించింది.

సుదర్శన్ : మోదీ ఈజ్ మై డాడీ అనే షార్ట్ ఫిలింలో నటనతో నవ్వించి ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు. వరుస ఆఫర్లతో బిజీ అయిపోయాడు.

గీతాంజలి



శ్లో. యావద్భ్రియేత జఠరం, తావత్ స్వత్వం హి దేహినాం,
అధికం యోఽభిమన్యేత, స స్తేనో దండ మర్హతి.

పొట్టలో పట్టినంత వరకు పదార్థాల మీద అధికారం ఉంటుంది. అంతకు మించి అంటే దాచుకోవడం కోసం ఎవరైతే తీసుకుంటారో వాళ్లు దొంగలు. అలాంటి వాళ్లు దండనకు అర్హులు.

– భాగవతం (7–14–9)

నిన్ను నీవే సరిదిద్దుకో!

బుద్ధమార్గం



మనం చేసే మంచి పనుల వల్ల మనకు కీర్తి వస్తుంది. చేసే చెడ్డ పనుల వల్ల అపకీర్తి చుట్టుకుంటుంది. మనం చేసే పనుల ఫలితాలు మనకు దక్కుతాయి. ఈ పనుల ఫలితాలను అనుభవించడానికి వేరే లోకాలు లేవు. అక్కడి దాకా పోనవసరం లేదు. వాటి ఫలితాలను ఇక్కడే ఇప్పుడే ఈ లోకంలోనే అనుభవిస్తామంటుంది బౌద్ధం.

'ఎవరో రావాలని, ఏదో చేయాలని ఎదురుచూడకు. నిన్ను నీవే సంస్కరించుకో' అంటాడు అనేక సందర్భాలలో బుద్ధుడు. బౌద్ధ బిక్షువుల్లో అంగుళిమాలుడు ఒకడు. అతని అసలు పేరు అహింసకుడు. పుట్టిన నక్షత్రాన్ని బట్టి తల్లిదండ్రుల ఆ పేరు పెట్టారు. పెరిగి, పెద్దవాడై తక్షశిలకు పోయి ఒక గురువు దగ్గర విద్యనభ్యసించాడు. అతని తెలివి తేటలు, పాండిత్యాన్ని చూసి ఈర్ష్య చెందిన తోటి విద్యార్థులు అహింసకుని మీద కామ దురాచారానికి పాల్పడ్డాడని అబద్ధాలు చెప్తారు. గురుపత్నితో అక్రమ సంబంధం అంటగడ్తారు. కోపించిన గురువు అహింసకుని చంపాలని నిర్ణయించుకొని, 'శిష్యా! నాకు మానవుల కుడిచేతి వేళ్లు వెయ్యి గురుదక్షిణగా ఇవ్వు' అంటాడు. దక్షిణ చెల్లించడం కోసం శ్రావస్తి సమీపంలోని జ్వాలిని అనే మహారణ్యంలోకి పోయి, దారి కాచి, మనుషుల్ని చంపి, వారి చేతి వేళ్లు జంధ్యానికి ముడివేసుకొంటూ ఉంటాడు. చివరికి ఒక్క మనిషిని చంపితే వెయ్యి అంగుళీలు పూర్తవుతాయి. దానికోసం దారి కాచి, వేచి చూస్తూ ఉంటాడు.

ఈ విషయం తెలిసి రాజు అంగుళీమాలుణ్ణి చంపమని ఆజ్ఞాపిస్తాడు. ఈ విషయం తెలిసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతారు. తల్లి ఏడుస్తూ బుద్ధుని దగ్గరకు వచ్చి తన బిడ్డను రక్షించమని వేడుకుంటుంది.

బుద్ధుడు ఆ తల్లిని వెంటబెట్టుకుని అడవికి పోతాడు. ఆమెను ముందు వెళ్లమంటాడు. మనిషి కోసం చూస్తున్న అంగుళీమాలునికి తల్లి కన్పిస్తుంది. ఉన్మాదంతో ఆమెను చంపడానికి ఆమె పైకి లంఘిస్తాడు. వెంటనే బుద్ధుడు అడ్డుకుంటాడు. ధర్మ ప్రబోధం చేస్తాడు. అతని మనసు మార్చడానికి ప్రయత్నిస్తాడు. చివరికి తన తప్పు తెలుసుకున్న అంగుళీమాలుడు 'భగవాన్! నన్ను ఈ పాపం నుండి రక్షించేది ఎవరు? నా పాప భారాన్ని తొలగించేది ఎవరు?' అని దీనంగా ప్రార్థిస్తాడు.

'అంగుళీమాలా! ఒక పుణ్యం ఒకరు ఎలా పంచుకోలేరో, ఒకరి పాపాన్ని మరొకరు మోయలేరు. నీవు చేసే పనులన్నింటికీ నీ ఆలోచన, మనస్సే మూలం. ముందు నీ మనస్సును నీవు సరిదిద్దుకో. మానవత్వంతో దాన్ని నింపుకో.

ఉదకంహి నమయంతి నేత్తికా
ఉసుకారా నమయంతి తేజ్యం
దారుం నమయంతి తచ్ఛకా
అత్తానం దమయంతి పండితా!

రైతు తన పొలానికి నీరు తెచ్చే కాలువను ఎప్పుడూ సరిచేసుకుంటూ ఉంటాడు. దాని పూడిక తీసి, వంకలు తీస్తాడు. విల్లు తయారుచేసే ఉసుకారుడు వెదురు బద్దల్ని తనకు కావలసిన విధంగా వంచుకుంటాడు. నాగలి, ఇతర వస్తువులు తయారుచేసే వడ్రంగి చెక్క కర్రల్ని సరిచేసుకొని, వంపులు చెక్కి, చిత్రిక పట్టి తనకు అవసరమైన రీతిగా మలచుకొంటాడు. అలాగే పండితుడైనవాడు తన మనస్సుని నిరంతరం మంచి మార్గంలో మలచుకుంటాడు.

అలాగే నీవూ ఈనాటి నుండి నీ మనసును మలచుకో.. అని చెప్పాడు. అంగుళిమాలుడు తిరిగి అహింసకునిగా మారాడు. బౌద్ధ బిక్షువుగా రాణించాడు. మనస్సు పరివర్తన చెందితే మృగం లాంటి వాడు మనిషిగా మారతాడనీ, మనిషి మనీషి కాగలడనీ, దుర్మార్గుణ్ణి చంపడం కంటే అతనిలోని దుర్మార్గాన్ని మాత్రమే చంపాలనే మానవీయ సిద్ధాంతం బుద్ధునిది. ఇలా మారిన వారిలో అంగుళీమాలుడు, అశోకుడు ప్రత్యక్ష దృష్టాంతాలు.

– బొర్రా గోవర్ధన్

పాపం - పశ్చాత్తాపం



ఖురాన్ మాట

మానవులన్న తరువాత తప్పులు జరగడం సహజం. అయితే తప్పు దిద్దుకొని నడవడిని మార్చుకున్నవారు మాత్రమే విజ్ఞులు. పొరపాటునో, గ్రహపాటునో తప్పులు జరగవచ్చు. మానవ మాత్రులెవరూ దీనికి అతీతులు కాదు. అనుకోకుండా తెలియక జరిగిన తప్పుల్ని దైవం మన్నించే అవకాశం ఉంది. కాని తెలిసి కూడా చేస్తే దైవం క్షమించడు. అందువల్ల దేవుని ముందు తప్పు ఒప్పుకొని క్షమాపణ కోరుకోవాలి. మేలుకోరి తప్పును ఎత్తిచూపిన వారికి కృతజ్ఞతలు కూడా చెప్పాలి. నిజాయతీగా తప్పు ఒప్పుకొని పశ్చాత్తాపం చెందేవారే నిజమైన విశ్వాసులు. ఇలాంటి వారిని గురించి పవిత్ర ఖురాన్ ఇలా అంటోంది..

'వారివల్ల ఏదైనా నీతిమాలిన పని గాని, పాపకార్యం గాని జరిగిపోతే వెంటనే వారు దైవాన్ని స్మరించి క్షమాపణ వేడుకుంటారు. అంతేతప్ప తాము చేసినదానిపై మంకుపట్టు పట్టరు.' (3–135)

ఖురాన్‌లో మరొక చోట ఇలా ఉంది 'మీరు దైవాన్ని క్షమాపణ కోరుకొని ఆయన వైపునకు మరలండి. నిస్సందేహంగా మీ ప్రభువు అమిత దయాసాగరుడు. ఆయనకు తన దాసుల పట్ల అపారమైన ప్రేమానురాగాలున్నాయి' (11–90)

'ఆత్మలకు అన్యాయం చేసుకున్న దాసులారా! దైవకారుణ్యం పట్ల నిరాశ చెందకండి. దేవుడు మీ పాపాలన్నింటినీ తప్పకుండా క్షమిస్తాడు. ఆయన గొప్ప క్షమాశీలి. అమిత దయాళువు. కనుక (దేవుని) శిక్ష వచ్చి, ఎలాంటి సహాయం లభించని పరిస్థితి రాకముందే పశ్చాత్తాపంతో మీ ప్రభువు మీ పాపాలను మన్నించి, సెలయేర్లు ప్రవహించే స్వర్గ వనాలలో మిమ్మల్ని ప్రవేశింపజేస్తాడు'.

మనస్ఫూర్తిగా క్షమాపణ వేడుకోవడమంటే మనో మస్తిష్కంలో సైతం ఎలాంటి దుష్ట ఆలోచన మొగ్గ తొడగని విధంగా వేడుకోవడమన్నమాట. దీనికి సంబంధించి ప్రధానంగా మూడు విషయాలు దృష్టిలో ఉంచుకోవాలి. 1. జరిగిన తప్పులు, పాపాల పట్ల సిగ్గుపడాలి. పశ్చాత్తాపం చెందాలి. 2. ఇకముందు ఖచ్చితంగా ఇలాంటి వాటికి దూరంగా ఉండామని దృఢ నిర్ణయం తీసుకొని దానిపై స్థిరంగా ఉండాలి. 3. జీవితాన్ని సంస్కరించుకోవడానికి, సరిదిద్దుకోవడానికి నిరంతరం కృషి చేస్తూ సత్కార్యాల్లో నిమగ్నమవ్వాలి. మానవ సంబంధాల విషయమైతే అదనంగా మరో విషయాన్నీ గమనంలో ఉంచుకోవాలి. ఒకవేళ సాటి మానవుల పట్ల దురుసుగా, దౌర్జన్యంగా ప్రవర్తించి ఉన్నట్లయితే ఏ విధంగానైనా ఎవరి హక్కులనైనా హరించి ఉన్నట్లయితే వారిని కూడా క్షమాపణ కోరాలి. వారి హక్కుల్ని తిరిగి నెరవేర్చాలి. ఈ విధంగా నిజాయతీగా, చిత్తశుద్ధితో పశ్చాత్తాపం చెంది, భావి జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి, ఇహ పర సాఫల్యం పొందడానికి శక్తివంచనలేని ప్రయత్నం చేయాలి. ఎలాంటి నిరాశా నిస్పృహలకు చోటు కల్పించకుండా ఆశావహ దృక్పథంతో ధర్మబద్ధమైన జీవితం గడపాలి. అల్లాహ్ గొప్ప క్షమాశీలి. దయాసాగరుడు.

– మదీహా అర్జుమంద్

జ్ఞానవివేచనలే కీర్తికి సోపానాలు

సువార్త



'దేవుని యందు భయభక్తులు కలిగియుండుట జ్ఞానమునకు మూలం' అంటాడు సొలోమోను రాజు. ఆయన గొప్ప సాహితీవేత్త. నీతి న్యాయములు తెలిసిన ధర్మశాస్త్ర పరిశీలకుడు. ఇతనికి ఒక ప్రవక్త 'యదీద్యా' అంటే దేవునికి ప్రియుడు అనే మరో పేరును ఇచ్చాడు. ఆయన వివేకానికి, సమయోచిత తీర్పునకు ఉదాహరణ ఈ సన్నివేశం.

వేశ్యలైన ఇద్దరు స్త్రీలు ఒకే ఇంట్లో ఉంటూ ఒకరి తర్వాత ఒకరు బిడ్డలకు జన్మనిస్తారు. ఒకామె ఆదమరిచి నిద్రిస్తూ బిడ్డపై పడిపోతుంది. అలా చనిపోయిన తన బిడ్డను ఇంకో స్త్రీ పక్కలో పెట్టి, ఆమె బిడ్డను తన దగ్గర చేర్చుకుంటుంది. మరుసటి రోజు అనుమానించిన ఆమె ఘర్షణకు దిగుతుంది. బతికి ఉన్న బిడ్డ తనదంటే తనదని ఇద్దరూ తగువులాడుతూ, న్యాయం కోసం సొలోమో రాజు దగ్గరికి వస్తారు. ఇద్దరి వాదాలు విన్న రాజు భటులతో బిడ్డను కత్తితో రెండుగా చీల్చి చెరిసగం ఇవ్వమంటాడు. బిడ్డ ఎవ్వరికీ దక్కకుండా పోతున్నందుకు రాజు తీర్పుకు లోలోన సంతోషపడింది బిడ్డను మార్చిన స్త్రీ. అయితే బతికిన బిడ్డ తల్లి మాత్రం బిడ్డను చంపకుండా ఆమెకే ఇవ్వమని రాజును ప్రార్థిస్తుంది. వెంటనే రాజు ఈ బిడ్డకు నిజమైన కన్నతల్లి ఈమెనే అని తీర్పునిస్తాడు. సభలోని వారంతా ఆయన సమయోచిత జ్ఞానానికి ఆశ్చర్యపోతారు. ప్రజల కోసం సొలోమోను కొన్ని సామెతలను రచించాడు. నీ తల్లి చెప్పే బోధను తోసివేయకుము. అవి నీ తలకు సొగసైన మాలికగా, నీ కంఠానికి హారంగా ఉన్నాయి. బుద్ధిలేని కుమారుడు తన తల్లికి దుఃఖాన్ని కలిగించును. జ్ఞానము గల కుమారుడు తండ్రిని సంతోషపరుచును. నిజమైన స్నేహితుడు విడువక ప్రేమించును. దుర్దశలో అట్టివాడు సోదరుడిగా ఉండును. ద్రాక్ష రసం వెక్కిరింతల పాలు చేస్తుంది. మద్యము అల్లరి పుట్టిస్తుంది. ధనము గలవానికి స్నేహితులు అధికంగా ఉంటారు. భార్య గలవానికి మేలు దొరికెను. సుబుద్ధి గల భార్య యెహోవా దానము. ఘనతకు ముందు వినయముండును. ఇలాంటి వేలాది నైతిక సూత్రాలను వ్రాశాడాయన.

సొలోమోను 7 సంవత్సరాలు శ్రద్ధగా కట్టించిన యెహోవా ఆలయ ప్రతిష్ఠ సమయంలో దేవునికి సంగీత నాదాలతో గొప్ప స్తుతి, ఆరాధన చేసి యెహోవా సాక్షాత్కారాన్ని పొందాడు. ఇంతగా వర్ధిల్లిన సొలోమోను రాజు దేవుని యందు భక్తి విధేయతలు చూపి, జ్ఞానాన్ని పొంది కీర్తి గడించాడు. ఇతని పాలనలో జనులు స్వేచ్ఛగా దైవభయము కలిగి జీవించారు.

– డాక్టర్ గుడిపాటి విలియం కేరి



విజ్ఞానమిచ్చే విఘ్నేశ్వరుడు

వినాయకుడి జననము, ఆ పుట్టు పూర్వోత్తరాలన్నీ మనలో చాలామందికి తెలిసిన విషయాలే. ఆయన గణాధిపతి కావడానికిగల కారణాల్లో మానవాళికి వినాయకుడి మార్గదర్శనం ఇమిడి ఉంది. బొజ్జ గణపయ్యను గణాధిపతిగా చేసినవి రెండు అంశాలు. ఒకటి మంత్ర జపము, రెండు తల్లిదండ్రులే ముక్కోటి దేవతలు, మూడుకోట్ల యాభై పుణ్యనదులుగా భావించడం. ఈ రెండు అంశాలు వినాయకుడిని ముక్కోటి దేవతలకు నాయకుడిని చేశాయి. వినాయకుడి చరితంలోని ఈ రెండు అంశాలు మానవాళిని మహోన్నత శిఖరాలకు తీసుకెళ్లగల అద్భుత మంత్రదండాలు. ఈ రెండు విషయాలు సమాజంలో కొరవడినందువల్ల అరాచకాలు అల్లకల్లోలాలు జరుగుతున్నాయి. మానవాళి ఎప్పుడైతే ఈ రెండు అంశాలను మంత్రదండాలుగా పట్టుకుంటారో అప్పుడే ఈ లోకం పుణ్యలోకం అవుతుంది. వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఆ విశేషాలు..

ప్రతి మానవుడు సర్వోన్నతమైన, సర్వవ్యాప్తమైన, అనంతమైన తమ దైవాన్ని తప్పనిసరిగా జపిస్తూ ఉండాలి. అది ఏ మతమైనా నమ్మకం ప్రధానం. తమ దైవం సర్వోన్నతుడు, సర్వవ్యాపకుడు, అనంతమైనవాడిగా నమ్మితే సృష్టి రహస్య విజ్ఞానమంతా మంత్రంలోనే దాగివుంది. సనాతన ధర్మంలో మంత్రానికి అత్యధిక ప్రాధాన్యాన్ని ఇచ్చారు. సృష్టికి సంబంధించిన శక్తి కేంద్రాల తాళం చెవులు ఆ మంత్రంలో ఇమిడివున్నాయి. మనం పట్టుకునే మంత్రాన్ని బట్టి సృష్టికి సంబంధించిన మనలోని శక్తి బయటకు వస్తుంది. అందుకే గురుస్థానాన్ని చేరుకున్న వారు ఏ సాధకుడికి ఎటువంటి మంత్రాన్ని ఇవ్వాలి, వారిలో ఎటువంటి శక్తులు ఉద్భవిస్తే ఎటువంటి ఫలితాలు వస్తాయనేది అంచనా వేసి వేర్వేరు మంత్రాలను వేర్వేరు సాధకులకు ఇస్తుంటారు. అలాంటి సర్వోన్నతమైన నారాయణ మంత్రాన్ని శివుడు బొజ్జ గణపయ్యకు ప్రసాదించాడు.

సృష్టి రహస్యాన్ని చెప్పిన మంత్రం

ఒక రోజు దేవతలు, మునులు పరమేశ్వరుని దగ్గరకు వెళ్లి 'మాకు ఏ పని చేసినా విఘ్నం రాకుండా కొలుచుకోవడానికి వీలుగా ఒక దేవుడిని కనికరించమ'ని కోరారు.

ఆ పదవికి గజాననుడు, కుమారస్వామి ఇద్దరూ పోటీ పడ్డారు. ఆ సమస్య పరిష్కరించడానికి శివుడు 'మీలో ఎవరైతే ముల్లోకముల లోని అన్ని పుణ్యనదులలో స్నానం చేసి ముందుగా వస్తారో వాళ్లే ఈ పదవికి అర్హులు' అన్నాడు. దానికి అంగీకరించిన కుమారస్వామి వెంటనే తన నెమలి వాహనమెక్కి వెళ్లిపోయాడు. గజాననుడు మాత్రం చిన్నబోయిన ముఖంతో 'తండ్రీ! నా బలాబలాలు తెలిసీ మీరు ఇలాంటి షరతు విధించడం సబబేనా? నేను మీ పాద సేవకుడిని కదా! నా మీద దయ తలచి ఏదైనా తరుణోపాయం చెప్పు'మని కోరాడు. అంతట శివుడు దయతో ఈ మంత్రం చెప్పాడు.

'సకృన్ నారాయణే త్యుక్త్వా పుమాన్ కల్పశత త్రయం! గంగాది సర్వతీర్థేషు స్నాతో భవతి పుత్రక!' కుమారా! ఇది నారాయణ మంత్రం. ఇది ఒకసారి జపిస్తే మూడు వందల కల్పాలు పుణ్యనదులలో స్నానం చేసినట్టవుతుంది. షరతు విధించిందీ తండ్రే, తరుణోపాయం చెప్పిందీ తండ్రే కాబట్టి ఇంక తాను గెలవగలనో లేదో, కుమారస్వామి తిరుగుతూ ఉంటే నేను ఇక్కడే ఉండి ఎలా గెలుస్తాను? అని సందేహించకుండా, ఆ మంత్రాన్ని భక్తి శ్రద్ధలతో జపిస్తూ మూడు సార్లు తల్లిదండ్రులకు ప్రదక్షిణ చేసి కైలాసంలోనే ఉండిపోయాడు. అక్కడ కుమారస్వామికి మూడు కోట్ల యాభై నదులలో ఏ నదికెళ్లినా అప్పటికే గజాననుడు ఆ నదిలో స్నానం చేసి తనకెదురు వస్తున్నట్లు కనిపించేవాడు. అన్ని నదులూ తిరిగి, కైలాసానికి వచ్చేసరికి అన్నగారు తండ్రి పక్కనే ఉన్నాడు. తన అహంకారానికి చింతించి, 'తండ్రీ! అన్నగారి మహిమ తెలియక ఏదో అన్నాను. నన్ను క్షమించి అన్నకు ఆధిపత్యము ఇవ్వండి' అన్నాడు. ఆ విధంగా భాద్రపద శుద్ధ చవితి రోజునే గజాననుడు విఘ్నేశ్వరుడైనాడు.

31	90/అ	తరి	పట్టా	00-23	జుర్రు నర్సింలు తండ్రి: దుర్గయ్య	ఆకుల శ్రీరాములు	వాగు	ఆకుల శ్రీరాములు	మల్లపర్తి లక్ష్మీ				
32	91	తరి	పట్టా	00-03	ఆకుల శ్రీరాములు తండ్రి: వైకుంఠం	PWD రోడ్డు	వాగు	మల్లపర్తి భారతి	వడ్ల సుధాకర్				
33	92	తరి	పట్టా	01-15	ఆకుల శ్రీరాములు తండ్రి: వైకుంఠం	PWD రోడ్డు	వాగు	మల్లపర్తి భారతి	వడ్ల సుధాకర్				
34	93/ఆ	తరి	పట్టా	00-07	ఆకుల శ్రీరాములు తండ్రి: వైకుంఠం	PWD రోడ్డు	వాగు	మల్లపర్తి భారతి	వడ్ల సుధాకర్				
35	93/అ	తరి	పట్టా	00-07	వై.అన్నమ్మ భర్త వెంకట్ నారాయణరెడ్డి	PWD రోడ్డు	వాగు	మల్లపర్తి భారతి	వడ్ల సుధాకర్				
36	94/ఆ	తరి	పట్టా	00-35	ఆకుల శ్రీరాములు తండ్రి: వైకుంఠం	PWD రోడ్డు	వాగు	మల్లపర్తి భారతి	వడ్ల సుధాకర్				
37	94/అ	తరి	పట్టా	00-34	వై.అన్నమ్మ భర్త వెంకట్ నారాయణరెడ్డి	PWD రోడ్డు	వాగు	మల్లపర్తి భారతి	వడ్ల సుధాకర్				
38	95	తరి	పట్టా	01-14	ఆకుల సుభద్ర భర్త: వైకుంఠం	PWD రోడ్డు	వాగు	మల్లపర్తి భారతి	వడ్ల సుధాకర్				
39	98/అ	తరి	పట్టా	00-22 1/2	బోయిని పుష్పమ్మ భర్త: శ్రీనివాస్	బోయిని శేఖర్	PWD రోడ్డు	PWD రోడ్డు	గుమ్ముల బాలామణి	వేప	(1)		
40	98/ఆ	తరి	పట్టా	00-22 1/2	బోయిని శేఖర్ తండ్రి: బాలయ్య	బోయిని పుష్పమ్మ	బోయిని పుష్పమ్మ	రోడ్డు	గుమ్ముల బాలామణి				
41	98	తరి	పట్టా	00-05	రోడ్డు								
42	99/ఆ1	తరి	పట్టా	00-15	గుమ్ముల బాలామణి భర్త: లక్ష్మయ్య	పాంబండ్ల నర్సింలు	లంబాడి బీమల	బోయిని శేఖర్	బోయిని పుష్పమ్మ	ఉడుగు	(6)		
43	103/ఆ/2	ఖుష్కి	పట్టా	00-10	చీలమంతుల మల్లేష్ తండ్రి: లింగయ్య	డి.మాధవి రోడ్డు	PWD శ్రీనివాస్	చిలమంతుల బాలామణి	గుమ్ముల				
44	103/ఆ 103/అ 103/ఇ	ఖుష్కి	పట్టా	00-12 00-04 00-12	చీలమంతుల శ్రీనివాస్ తండ్రి: లింగయ్య	డి.మాధవి రోడ్డు దాక్యా	PWD మల్లేష్ తండ్రి	చిలమంతుల హీర్య	కాట్రోతు				
45	104/ఈ/2	ఖుష్కి	పట్టా	00-36	కె. శ్రీలత భర్త: రామకృష్ణ	తండ ఇండ్లు	బి.టి. రోడ్డు	బి.టి. రోడ్డు	నాయిని రామరావు			1బోరు	
46	104/ఈ/1 104/ఆ/2	ఖుష్కి	పట్టా	00-09 00-01	నాయినేని రామరావు తండ్రి: లింగారావు	తండ ఇండ్లు	బి.టి. రోడ్డు	బి.టి. రోడ్డు	నాయిని రామరావు				
47	104/ఇ1 00-01	ఖుష్కి	పట్టా	00-21 00-09	గడీల సత్యనారాయణ తండ్రి: గండయ్య	కాట్రోతు లక్ష్మణ్	గడీల సత్య నారాయణ	నాయిని రామరావు	బి.టి. రోడ్డు			1 బావి	
48	105/అ1	ఖుష్కి	పట్టా	00-22	మస్కురి సాయమ్మ భర్త:మల్లయ్య	P.W.D రోడ్డు	ఎర్కలి పోచయ్య	మస్కురి దుర్గయ్య	ఎర్కలి దుర్గయ్య				
49	105/అ2	ఖుష్కి	పట్టా	00-21	మస్కురి దుర్గయ్య తండ్రి: పెద్ద లక్ష్మయ్య	P.W.D రోడ్డు	నీరడి కిష్టమ్మ	మస్కురి అంజయ్య	మస్కురి సాయమ్మ				
50	105/అ3	ఖుష్కి	పట్టా	00-21	మస్కురి ఆంజనేయులు తండ్రి: పెద్ద లక్ష్మయ్య	P.W.D రోడ్డు	ఎర్కలి బుచ్చయ్య	మస్కురి చిన్న అశోక్	మస్కురి దుర్గయ్య				
51	105/ఆ	ఖుష్కి	పట్టా	01-23	మస్కురి చిన్న అశోక్ తండ్రి: లక్ష్మయ్య	P.W.D రోడ్డు	మల్లపర్తి భారతి	ఎర్కలి దుర్గయ్య	మస్కురి అంజయ్య	వేప	1	1బోరు పైపులైను	
52	113/అ	ఖుష్కి	పట్టా	00-24	వై.అన్నమ్మ భర్త: వెంకట్ నారాయణ్ రెడ్డి	బి.టి. రోడ్డు	ఆయన్నగారి అయమ్మ	చిలమంతుల బాలయ్య	కుంట				
53	113/ఆ	ఖుష్కి	పట్టా	00-24	వై.ప్రమీల భర్త: రాజ మల్లా రెడ్డి	బి.టి. రోడ్డు	ఆయన్నగారి జయమ్మ	చిలమంతుల బాలయ్య	కుంట				
54	114/1/అ	ఖుష్కి	పట్టా	00-03	వై.అన్నమ్మ భర్త: వెంకట్ నారాయణ్ రెడ్డి	బి.టి. రోడ్డు	ఆయన్నగారి జయమ్మ	చిలమంతుల బాలయ్య	కుంట కట్ట				
55	114/1/ఆ	ఖుష్కి	పట్టా	00-03	వై.ప్రమీల భర్త: రాజ మల్లా రెడ్డి	బి.టి. రోడ్డు	ఆయన్నగారి జయమ్మ	చిలమంతుల బాలయ్య	కుంట కట్ట				
56	114/1/ఇ	ఖుష్కి	పట్టా	00-03	బోయిని పుష్పమ్మ భర్త: శ్రీనివాస్	బి.టి. రోడ్డు	ఆయన్నగారి జయమ్మ	చిలమంతుల బాలయ్య	కుంట కట్ట				
57	114/1/ఈ	ఖుష్కి	పట్టా	00-03	బోయిని శేఖర్ తండ్రి: బాలయ్య	బి.టి. రోడ్డు	ఆయన్నగారి జయమ్మ	చిలమంతుల బాలయ్య	కుంట కట్ట				
58	116	తరి	పట్టా	01-22	పిచ్చకుంట్ల శ్రీశైలం తండ్రి: పోచయ్య	ఆయన్నగారి మంజుల	పిచ్చకుంట్ల ఎల్లమ్మ	ఆయన్నగారి మణెమ్మ	కొండరికుంట	వేప	1	1బోరు పైపులైను	
59	117	తరి	పట్టా	01-05	పిచ్చకుంట్ల ఎల్లమ్మ భర్త: గంగయ్య	పిచ్చకుంట్ల శ్రీశైలం	ఆయన్నగారి రత్నమ్మ	ఆయన్నగారి మణెమ్మ	ఆయన్నగారి శ్రీనివాస్			1 బోరు 1 బావి	
60	118	తరి	పట్టా	01-21	పిచ్చకుంట్ల ఎల్లమ్మ భర్త: గంగయ్య	కొండరి కుంట	అయ్యన్నగారి రత్నమ్మ	ఆయన్నగారి మణెమ్మ	ఆయన్నగారి శ్రీనివాస్ గౌడ్				
61	119/అ	తరి	పట్టా	00-20	ఆయన్నగారి శ్రీనివాస్ గౌడ్: తండ్రి మల్లగౌడ్	కుంట కట్ట	అయ్యన్నగారి నరసగౌడ్	పిచ్చకుంట్ల ఎల్లమ్మ	వాగు				
62	119/ఆ	తరి	పట్టా	00-19	ఆయన్న గారి రత్నమ్మ, భర్త లక్ష్మా గౌడ్	ఆయన్న గారి శ్రీనివాస్ గౌడ్	ఆయన్న గారి నరస గౌడ్	పిచ్చకుంట్ల ఏలమ్మ	వాగు	జామ	1	(1)బోరు పైపు లైను	
63	120/ఇ	ఖుష్కి	పట్టా	00-24	ఆయన్న గారి రత్నమ్మ, భర్త లక్ష్మా గౌడ్	పిచ్చ కుంట్ల ఏలమ్మ గౌడ్	ఆయన్న గారి దేవ గౌడ్	ఆయన్న గారి సంజీవ్ గౌడ్	ఆయన్న గారి రమేష్				
64	120/ఆ3	ఖుష్కి	పట్టా	00-10	ఆయన్న గారి శ్రీనివాస్ గౌడ్, తండ్రి మల్ల గౌడ్	కుంట కట్ట	ఆయన్న గారి వీర గౌడ్	శ్రీనివాస్ గౌడ్	వాగు			2)బోరు, పైపు లైను	
65	120/ఆ	ఖుష్కి	పట్టా	00-02	ఆయన్న గారి దేవ గౌడ్ తండ్రి రామ గౌడ్	ఆయన్న గారి రత్నమ్మ	వాగు	ఆయన్న గారి మణెమ్మ	ఆయన్న గారి రత్నమ్మ				
66	124	ఖుష్కి	పట్టా	01-23	ఆయన్న గారి మణెమ్మ భర్త సత్య గౌడ్	ఆయన్న గారి అరుణ	ఆయన్న గారి సత్తెమ్మ	ఆయన్న గారి సుజాత	పిచ్చ కుంట్ల ఏలమ్మ			3)బోరు, పైపు లైను	
67	127/ఆ	ఖుష్కి	పట్టా	00-11	పి.పోచయ్య తండ్రి చెన్నయ్య	ఆయన్న గారి రామ గౌడ్	పిచ్చ కుంట్ల మల్లమ్మ	పిచ్చ కుంట్ల పెద్ద లక్ష్మయ్య	పిచ్చ కుంట్ల నర్సయ్య			(2)బోరు, పైపు లైను	
68	127/ఆ	ఖుష్కి	పట్టా	00-12	పి.నర్సయ్య తండ్రి లక్ష్మయ్య	ఆయన్న గారి రామ గౌడ్	పిచ్చ కుంట్ల సాలమ్మ	పిచ్చ కుంట్ల పోచయ్య	ఆయన్న గారి నగేష్ గౌడ్				
69	127/ఈ	ఖుష్కి	పట్టా	00-23	అయ్యన్న గారి నగేష్ గౌడ్ తండ్రి వీరా గౌడ్	రావి లక్ష్మి ప్రసాద్	పిచ్చ కుంట్ల లచమ్మ	పిచ్చ కుంట్ల పోచ గౌడ్	ఆయన్న గారి సుజాత				
70	127/ఇ	ఖుష్కి		00-20	వెంకట్ రెడ్డి తండ్రిలక్ష్మి చెన్న రెడ్డి	రావి పాటి కుంట్ల ప్రసాద్	పిచ్చ కుంట్ల లచమ్మ	పిచ్చ గారి పోచయ్య	ఆయన్న సుజాత				
71	128/ఇ	ఖుష్కి	పట్టా	00-20	ఆయనగారి నగేష్ గౌడ్ తండ్రి వీర గౌడ్	రావి పాటి లక్ష్మి ప్రసాద్	పిచ్చ కుంట్ల లచమ్మ	పిచ్చ కుంట్ల పోచయ్య	ఆయన్న గారి సుజాత				
72	128/అ	ఖుష్కి	పట్టా	00-10	పై మణెమ్మ భర్త ప్రతాప్ రెడ్డి	రావి పాటి లక్ష్మి ప్రసాద్	పిచ్చ కుంట్ల లచమ్మ	పిచ్చ కుంట్ల పోచయ్య	ఆయన్న గారి సుజాత				
73	128/ఆ	ఖుష్కి	పట్టా	01-00	వెంకట్ రెడ్డి తండ్రి చెన్న రెడ్డి	రావి పాటి లక్ష్మి ప్రసాద్	పిచ్చ కుంట్ల లచమ్మ	పిచ్చ కుంట్ల పోచయ్య	ఆయన్న గారి సుజాత				
74	128/అ2	ఖుష్కి	పట్టా	00-10	వై.భారతి బాయి భర్త గోపాల్ రెడ్డి	వై సంజీవ రెడ్డి	వాగు	చంద్రన్న గుట్ట	నాగయ్య				
75	129/అ2	ఖుష్కి	పట్టా	00-13	పై సంజీవ్ రెడ్డి తండ్రి రాం రెడ్డి	రావి పాటల లక్ష్మి ప్రసాద్	పిచ్చ కుంట్ల పోచయ్య	ఆయన్న గారి మణెమ్మ	ఆయన్న గారి జయమ్మ				
76	129/ఆ	ఖుష్కి	పట్టా	00-31	వై.వెంకట్ రెడ్డి తండ్రి చెన్నా రెడ్డి	రావిపాటి లక్ష్మి ప్రసాద్	ఆయన్న గారి జయమ్మ	రావి పాటి లక్ష్మి ప్రసాద్	చిలమంతుల బాలయ్య				
77	129/ఇ	ఖుష్కి	పట్టా	00-15	ఆయన్న గారి నగేష్ గౌడ్ తండ్రి వీర గౌడ్	రావిపాటి లక్ష్మి ప్రసాద్	పిచ్చ కుంట్ల లచ్చమ్మ	పిచ్చ కుంట్ల పోచమ్మ	ఆయన్న గారి సుజాత			2)బోర్లు పైపు లైన్	
78	129/అ1	ఖుష్కి	పట్టా	00-03	వై భారతి బాయి భర్త గోపాల్ రెడ్డి	వై.సంజీవ రెడ్డి	వాగు	చంద్రన్న గుట్ట	నాగయ్య				
79	130/ఆ2	ఖుష్కి	పట్టా	00-21	ఆయన్న గారి జయమ్మ భర్త శ్రీనివాస్ గౌడ్	రావిపాటి లక్ష్మి ప్రసాద్	ఆయన్న గారి రామ గౌడ్	పిచ్చ కుంట్ల ఏలమ్మ	ఆయన్న గారి మణెమ్మ			1)బోర్లు పైపు లైన్	
80	130/అ	ఖుష్కి	పట్టా	00-36	రావిపాటి లక్ష్మి ప్రసాద్ తండ్రి సత్యనారాయణ	బి టి రోడ్డు	ఆయన్న గారి జయమ్మ	చిల మంతుల బాలయ్య	కుంట కట్ట				
81	130/ఆ1	ఖుష్కి	పట్టా	00-15	ఆయన్న గారి నగేష్ గౌడ్ తండ్రి వీర గౌడ్	ఆయన్న గారి రామగౌడ్	ఆయన్న గారి సుజాత	ఆయన్న గారి రామ గౌడ్	ఆయన్న గారి మణెమ్మ				
82	131/ఆ2	ఖుష్కి	పట్టా	01-02	ఆయన్న గారి రామ గౌడ్ తండ్రి మల్లగౌడ్	ఆయన్న గారి జయమ్మ గౌడ్	ఆయన్న గారి నగేష్	పిచ్చ కుంట్ల ఏలమ్మ	ఆయన్న గారి మణెమ్మ			2)బోర్లు పైపు లైను	
83	131/ఆ1	ఖుష్కి	పట్టా	01-14	ఆయన్న గారి జయమ్మ భర్త శ్రీనివాస్ గౌడ్	రావిపాటి లక్ష్మి ప్రసాద్	ఆయన్న గారి రామ గౌడ్	పిచ్చ కుంట్ల ఏలమ్మ	ఆయన్న గారి మణెమ్మ			1)బోరు పైపు లైను	
84	131/అ	ఖుష్కి	పట్టా	02-17	రావిపాటి లక్ష్మీప్రసాద్ తండ్రి సత్య నారాయణ	బి టి రోడ్డు	ఆయన్న గారి జయమ్మ	చిల మంతుల బాలయ్య	కుంట కట్ట				
85	132/అ	ఖుష్కి	పట్టా	00-32	రావిపాటి లక్ష్మీప్రసాద్ తండ్రి సత్యనారాయణ	బి టి రోడ్డు	ఆయన్న గారి జయమ్మ	చిల మంతుల బాలయ్య	కుంట కట్ట				
86	132/ఆ	ఖుష్కి	పట్టా	00-33	ఆయన్న గారి రామ గౌడ్ తండ్రి మల్ల గౌడ్	రావిపాటి లక్ష్మి ప్రసాద్	ఆయన్న గారి నగేష్ గౌడ్	పిచ్చ కుంట్ల నర్సయ్య	ఆయన్న గారి మణెమ్మ				
87	133/అ	ఖుష్కి	పట్టా	00-30	రావిపాటి లక్ష్మీప్రసాద్ తండ్రి సత్యనారాయణ	బి టి రోడ్డు	ఆయన్న గారి జయమ్మ	చిల మంతుల బాలయ్య	కుంట కట్ట	చింత	6	3)బోర్లు	
88	133/ఆ	ఖుష్కి	పట్టా	00-29	వై ప్రమీల భర్త రాజ మల్లా రెడ్డి	బి టి రోడ్డు జయమ్మ	ఆయన్న గారి బాలయ్య	చిల మంతుల కట్ట	కుంట				
89	137	ఖుష్కి	పట్టా	00-30	పి.ఎల్లమ్మ భర్త ఎల్లయ్య బాలయ్య	చిలమంతుల చెరువు	ఖాజీపేట చెరువు	ఖాజీపేట కిష్టయ్య	పిచ్చ కుంట్ల చిన్న				
90	138/అ	ఖుష్కి	పట్టా	00-35	పిచ్చకుంట్ల పోచయ్య తండ్రి రామయ్య	చిలమంతుల బాలయ్య	ఖాజీపేట చెరువు	ఖాజీపేట చెరువు	పిచ్చ కుంట్ల చిన్న కిష్టయ్య			1)బోరు పైపు లైను	
91	138/ఆ	ఖుష్కి	పట్టా	00-35	పిచ్చకుంట్ల చిన్న కిష్టయ్య తండ్రి రామయ్య	చిలమంతుల బాలయ్య	పిచ్చకుంట్ల చిన్న లక్ష్మయ్య	పిచ్చకుంట్ల పోచయ్య	పిచ్చకుంట్ల ఏలమ్మ			1 బోరు పైపు లైను	
92	139/అ	ఖుష్కి	పట్టా	00-03	పిచ్చకుంట్ల పోచయ్య తండ్రి రామయ్య	చిలమంతుల బాలయ్య	వాగు	ఖాజీపేట చెరువు	పిచ్చకుంట్ల చిన్న కిష్టయ్య			(1) బావి	
93	139/ఆ	ఖుష్కి	పట్టా	00-03	పిచ్చకుంట్ల చిన్న కిష్టయ్య తండ్రి రామయ్య	చిలమంతుల బాలయ్య	పిచ్చకుంట్ల చిన్న లక్ష్మి	పిచ్చకుంట్ల పోచయ్య	పిచ్చకుంట్ల ఏలమ్మ				
	మొత్తం విస్తీర్ణము			56.17									

ప్రభుత్వ భూముల షెడ్యూల్

వరుస సంఖ్య	సర్వే నం.	భూమి స్వభావము	భూమి రకం	భూ సేకరణ చేయు విస్తీర్ణం	భూమి పట్టాదారు/ అనుభవదారు/ ఆసక్తిదారు పేరు మరియు చిరునామా	సరిహద్దులు (సర్వే నెంబర్) తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు రకం	సంఖ్య	నిర్మాణములు రకం	సంఖ్య
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	47	ఖుష్కి	లావుని పట్టా	00-16	జంగం బుచప్ప తండ్రి వీరప్ప	దుద్దల పెంటయ్య	తుజాల్ పూర్ శివార్	జంగం బుచప్ప	వై.సుప్రియ				
2	49/అ1 49/ఆ	ఖుష్కి	లావుని పట్టా	00.16	తమ్మలి లక్ష్మి భర్త రామయ్య	తుజాల్ పూర్ శివారు	వాగు	గుట్ట	వాగు	వేప	1		
3	50/అ	ఖుష్కి	లావుని పట్టా	00.10	తమ్మలి శ్రీనివాస్ తండ్రి రామయ్య	తుజాల్ పూర్ శివారు	వాగు	గుట్ట	వాగు				
4	50/ఆ	ఖుష్కి	లావుని పట్టా	00-06	తమ్మలి మల్లేష్ తండ్రి రామయ్య	తుజాల్ పూర్ శివారు	వాగు	తమ్మలి శేకులు	వాగు				
5	51/3/1	ఖుష్కి	లావుని పట్టా	01.06	తమ్మలి యాదగిరి తండ్రి కిష్టయ్య	రోడ్డు	తమ్మలి కిష్టయ్య	వాగు	రోడ్డు				
6	51/5/ఆ	ఖుష్కి	లావుని పట్టా	00-05	వడ్ల సుధాకర్ తండ్రి వీరయ్య	సాలె జగతి	రోడ్డు	వాగు	వడ్ల శ్రీనివాస్	వేప తుమ్మ	5 3	(1) బావి	
7	51/5/అ	ఖుష్కి	లావుని పట్టా	00-05	వడ్ల శ్రీనివాస్ తండ్రి వీరయ్య	సాలె జగతి	రోడ్డు	వడ్ల సుధాకర్	రోడ్డు				
8	51/3/2	ఖుష్కి	లావుని పట్టా	01-02	తమ్మలి సుగుణ భర్త హన్మయ్య	రోడ్డు	తమ్మలి కిష్టయ్య	వాగు	రోడ్డు				
9	51/2/3	ఖుష్కి	లావుని పట్టా	00-20	దుద్దాల శివయ్య తండ్రి లక్ష్మయ్య	వాగు	రోడ్డు	రోడ్డు	సాలె జగతి				
10	51/2/1	ఖుష్కి	లావుని పట్టా	00-20	దుద్దాల పెంటయ్య తండ్రి లక్ష్మయ్య	వాగు	రోడ్డు	రోడ్డు	సాలె జగతి				
11	51/2/2	ఖుష్కి	లావుని పట్టా	00-20	దుద్దాల యాదయ్య తండ్రి లక్ష్మయ్య	సాలె జగతి	వాగు	రోడ్డు	రోడ్డు				
12	51/1/అ	ఖుష్కి	లావుని పట్టా	00-30	ఎద్దు శ్యామమ్మ భర్త మల్లేశం	సాలె జగతి	వాగు	రోడ్డు	రోడ్డు				
13	51/1	ఖుష్కి	ప్రభుత్వము	01-18	కారీజ్ ఖాతా								
14	54	ఖుష్కి	లావుని పట్టా	00-17	సాలె జగతి భర్త లక్ష్మయ్య	వాగు	వడ్ల ఈశ్వరమ్మ	తమ్మాలి లక్ష్మి	వడ్ల సుధాకర్	అల్లనేరేడు వేప ఈత	1, 2 2	(2) బోర్లు	
15	55	ఖుష్కి	లావుని పట్టా	00-29	సాలె జగతి భర్త లక్ష్మయ్య	వాగు	వడ్ల కమలమ్మ	వాగు	వడ్ల సుధాకర్				
16	64/1	ఖుష్కి	ప్రభుత్వము	00-04	ప్రభుత్వము								
17	64/4	ఖుష్కి	లావుని పట్టా	00-01	వడ్ల శ్రీనివాస్ తండ్రి వీరయ్య	తమ్మలి కిష్టయ్య	రోడ్డు	తమ్మలి మల్లేశ్	తమ్మలి లక్ష్మి				
18	72	ఖుష్కి	ప్రభుత్వము	00-28	కారీజ్ ఖాతా								
19	74/1 74/2	ఖుష్కి	లావుని పట్టా	01-06 00-08	తమ్మలి సుగుణ భర్త హన్మయ్య	రోడ్డు	తమ్మలి కిష్టయ్య	వాగు	రోడ్డు				
20	74	ఖుష్కి	ప్రభుత్వము	00-12	రోడ్డు								
21	75/1	ఖుష్కి	ప్రభుత్వము	01.00	కారీజ్ ఖాతా								
22	75/2	ఖుష్కి	లావుని పట్టా	01-05	తమ్మలి సుగుణ భర్త హన్మయ్య	తమ్మలి కిష్టయ్య	రోడ్డు	తమ్మలి మల్లేశ్	తమ్మలి లక్ష్మి	వేప అల్లనేరేడు	7 1	(4) బోర్లు పైపు లైన్	
23	76	ఖుష్కి	లావుని పట్టా	00-18	తమ్మలి కిష్టయ్య తండ్రి మల్లయ్య	తమ్మలి సుగుణమ్మ	తమ్మలి మల్లేశం	తమ్మలి కిష్టయ్య	రోడ్డు			(2) బోర్లు పైపు లైను	
24	78/1	ఖుష్కి	లావుని పట్టా	00-19	తమ్మలి శ్రీనివాస్ తండ్రి రామయ్య	తమ్మలి కిష్టయ్య	తమ్మలి లక్ష్మి	తమ్మలి శేఖర్	తమ్మలి మల్లేష్			(2) బోర్లు	
25	78/2	ఖుష్కి	లావుని పట్టా	00-19	తమ్మలి మల్లేష్ తండ్రి రామయ్య	తమ్మలి కిష్టయ్య	తమ్మలి శ్రీను	రోడ్డు లక్ష్మి	తమ్మలి				
26	78/3	ఖుష్కి	లావుని పట్టా	00-19	తమ్మలి శేకర్ తండ్రి రామయ్య	తమ్మలి లక్ష్మి	ఎల్లారెడ్డి గారి మల్లారెడ్డి	వాగు	వాగు				
27	79	ఖుష్కి	లావుని పట్టా	00-24	తమ్మలి సుగుణ భర్త హన్మయ్య	తమ్మలి కిష్టయ్య	రోడ్డు	తమ్మలి మల్లేష్	తమ్మలి లక్ష్మి				
28	84	ఖుష్కి	లావుని పట్టా	01-05	ఆకుల సుభద్ర భర్త వైకుంఠం	తమ్మలి కిష్టయ్య	రోడ్డు	తమ్మలి మల్లేష్	తమ్మలి లక్ష్మి				
29	96	ఖుష్కి	లావుని పట్టా	01-05	కొమిరె శంకర్ తండ్రి మల్లయ్య	కాట్రోతు లాలు	లంబాడి విఠల్	లంబాడి కిషన్	లంబాడి విఠల్				
30	96	ఖుష్కి	ప్రభుత్వము	00-09	రోడ్డు								
31	97/2	ఖుష్కి	లావుని పట్టా	01-10	బోయిని పుష్పమ్మ భర్త శ్రీనివాస్	కాట్రోతు లాలు	లంబాడి విఠల్	లంబాడి కిషన్	లంబాడి విఠల్	వేప జామ	2 1	2బోర్ పైపులైన్	
32	97/3	ఖుష్కి	లావుని పట్టా	00-29	బోయిని శేకర్ తండ్రి బాలయ్య	కాట్రోతు లాలు	లంబాడి విఠల్	లంబాడి కిషన్	లంబాడి విఠల్	వేప జామ	2 1	3బోర్ పైపులైన్	
33	97	ఖుష్కి	ప్రభుత్వము	00-08	రోడ్డు								
34	100/ఆ	ఖుష్కి	లావుని పట్టా	00-22 1/2	లంబాడి హీర్యా తండ్రి డాఖ్యా	కాట్రోతు లాలు	లంబాడి విఠల్	లంబాడి కిషన్	లంబాడి విఠల్				
35	100/అ	ఖుష్కి	లావుని పట్టా	00-22 1/2	లంబాడి విఠల్ తండ్రి డాఖ్య	కాట్రోతు హీర్యా	రోడ్డు	లంబాడి కిషన్	లంబాడి హీర్య				
36	106/4/3	ఖుష్కి	లావుని పట్టా	00-03 1/2	ఎరుకలి బుచ్చయ్య తండ్రి నాగయ్య	రోడ్డు	రోడ్డు	చెరువు	నీరది కిష్టమ్మ			పైపు లైను	
37	106/4/5	ఖుష్కి	లావుని పట్టా	00-03 1/2	ఎరుకలి శివయ్య తండ్రి నాగయ్య	మస్కురి సాయమ్మ	ఎర్కలి బుచ్చయ్య	ఎర్కలి రాములు	ఎర్కలి దుర్గయ్య			(1) బోరు	
38	106/4/1	ఖుష్కి	లావుని పట్టా	00-03	ఎరుకలి దుర్గయ్య తండ్రి నాగయ్య	రోడ్డు	చెరువు	కాట్రోతు హీర్య	ఎర్కలి నాగయ్య				
39	106/4/2	ఖుష్కి	లావుని పట్టా	00-03 1/2	ఎరుకలి రాములు తండ్రి నాగయ్య	రోడ్డు	ఎర్కలి బుచ్చయ్య	నీరడి కిష్టమ్మ	ఎర్కలి బుచయ్య				
40	106/4/4	ఖుష్కి	లావుని పట్టా	00-03 1/2	ఎరుకలి పోచయ్య తండ్రి నాగయ్య	రోడ్డు	చెరువు	లంబాడి హీర్య	మన్నే చిన్న అశోక్				
41	106/2/ఆ	ఖుష్కి	లావుని పట్టా	00-08 1/2	లంబాడి హీర్యా తండ్రి డాఖ్య	రోడ్డు	చెరువు	మల్లాపర్తి భారతి	లంబాడి విఠల్			(1)బోరు పైపు లైను	
42	106/2/అ	ఖుష్కి	లావుని పట్టా	00-08 1/2	లంబాడి విఠల్ తండ్రి డాఖ్య	రోడ్డు	చెరువు	మల్లాపర్తి భారతి	లంబాడి విఠల్				
43	106/5	ఖుష్కి	లావుని పట్టా	00-18	నీరడి కిష్టమ్మ భర్త పుల్లయ్య	మస్కురి చిన్న అశోక్	చెరువు	ఎర్కలి బుచ్చయ్య	మల్లపర్తి భారతి			(1)బోరు పైపు లైను	
44	106/3/ఆ	ఖుష్కి	లావుని పట్టా	00-08 1/2	మల్లపర్తి లక్ష్మి భర్త రాములు	మస్కురి చిన్నఅశోక్	లంబాడి హీర్య	ఎర్కలి బుచ్చయ్య	పెద్ద చెరువు				
45	106/3/ఇ	ఖుష్కి	లావుని పట్టా	00-08 1/2	మల్లపర్తి భారతి భర్త సాయిలు	మస్కురి చిన్నఅశోక్	లంబాడి విఠల్	ఎర్కలి బుచ్చయ్య	మల్లపర్తి లక్ష్మి				
46	106/1/2	ఖుష్కి	లావుని పట్టా	00-04	చింతకింది మల్లయ్య తండ్రి పోచయ్య	మస్కురి చిన్నఅశోక్	లంబాడి విఠల్	ఎర్కలి బుచ్చయ్య	మల్లపర్తి భారతి				
47	106/1/3	ఖుష్కి	లావుని పట్టా	00-04	చింతకింది మల్లేష్ తండ్రి పోచయ్య	మస్కురి చిన్నఅశోక్	లంబాడి విఠల్	ఎర్కలి బుచ్చయ్య	మల్లపర్తి భారతి				
48	106/1/1	ఖుష్కి	లావుని పట్టా	00-09	చింతకింది నర్సమ్మ భర్త నర్సింలు	మస్కురి చిన్నఅశోక్	చెరువు	ఎర్కలి బుచ్చయ్య	చిలమంతుల మల్లేష్				
49	107	శిఖం	ప్రభుత్వము	01-14	రాఘవ కుంట శిఖం								
50	108/1	ఖుష్కి	లావుని పట్టా	00-13	చిలమంతుల శోభ భర్త దుర్గయ్య	రోడ్డు	చెరువు	చిలమంతుల మల్లేష్	చిలమంతుల శ్రీనివాస్	నిమ్మ, వేప ఈత	2, 1 2	(4) బోర్లు పైపు లైన్	
51	108/2	ఖుష్కి	లావుని పట్టా	00-12	చిలమంతుల మల్లేష్ తండ్రి లింగయ్య	చిలమంతుల శోభ	కాలువ	చిలమంతుల శ్రీనివాస్	చెరువు				
52	108/3	ఖుష్కి	లావుని పట్టా	00-13	చిలమంతుల శ్రీనివాస్ తండ్రి లింగయ్య	రోడ్డు	చెరువు	లంబాడి లక్ష్మణ్	చిలమంతుల మల్లేశం				
53	110/1/3	ఖుష్కి	లావుని పట్టా	00-16	పిచ్చకుంట్ల మల్లమ్మ భర్త రామయ్య	రోడ్డు	పిచ్చకుంట్ల పోచయ్య	ఆయన్న గారి శాంతమ్మ	కుంటా కట్టా				
54	110/11/4/2	ఖుష్కి	లావుని పట్టా	00-05	పి.సుజాత భర్త మల్లేషం	రోడ్డు	ఏపుగారి వెంకటయ్య	చిన్న కిష్టయ్య	పిచ్చకుంట్ల పెద్ద మల్లయ్య				
55	110/11/6	ఖుష్కి	లావుని పట్టా	00-15	పి.చిన్న కిష్టయ్య తండ్రి రామయ్య	రోడ్డు	ఏపుగారి వెంకటయ్య	పెద్ద కిష్టయ్య	సుజాత				
56	110/11/3	ఖుష్కి	లావుని పట్టా	00-25	పి.కిష్టయ్య తండ్రి రామయ్య	రోడ్డు	ఏపుగారి వెంకటయ్య	పిచ్చకుంట్ల కిషన్	పిచ్చకుంట్ల మల్లమ్మ	మామిడి	(1)బోరు పైపు లైను		
57	110/1/2/3 110/11/1	ఖుష్కి	లావుని పట్టా	00-03 00-33	పి. మల్లమ్మ భర్త దుర్గయ్య	రోడ్డు	కుంట	కుంట	పెద్ద కిష్టయ్య				
58	110/11/2/ 110/1/2/1	ఖుష్కి	లావుని పట్టా	01 -10	పి. నర్సయ్య తండ్రి రామయ్య	రోడ్డు	కుంట	కుంట	పెద్ద కిష్టయ్య				
59	110/11/4/1	ఖుష్కి	లావుని పట్టా	00- 10	పి. పోచయ్య తండ్రి రామయ్య	రోడ్డు	కుంట	చిన్న కిష్టయ్య	పిచ్చకుంట్ల నర్సయ్య				
60	110/1/17	ఖుష్కి	లావుని పట్టా	00- 08	పి. మన్నెమ్మ భర్త పోచయ్య	ఆయన్నగారి రామ గౌడ్	పిచ్చకుంట్ల మల్లమ్మ	ఆయన్నగారి సుధాకర్	కుంట				
61	110/1/21	ఖుష్కి	లావుని పట్టా	00- 23	ఆయన్న గారి అరుణ భర్త కిషన్ గౌడ్	రోడ్డు	ఆయన్నగారి మణెమ్మ	ఆయన్నగారి జయమ్మ	ఆయన్నగారి జయమ్మ			(2) బోర్లపైపు లైను	
62	110/1/20	ఖుష్కి	లావుని పట్టా	00- 15	ఆయన్నగారి జయమ్మ భర్త శ్రీనివాస్ గౌడ్	రోడ్డు	పిచ్చకుంట్ల పోచయ్య	ఆయన్నగారి అరుణ	ఆయన్నగారి శాంతమ్మ				
63	110/1/18	ఖుష్కి	లావుని పట్టా	00- 12	ఆయన్నగారి శాంతమ్మ భర్త యాదా గౌడ్	రోడ్డు	పిచ్చకుంట్ల పోచయ్య	ఆయన్నగారి జయమ్మ	ఆయన్నగారి మంజుల				
64	110/1/19	ఖుష్కి	లావుని పట్టా	00- 12	ఆయన్నగారి మంజుల భర్త రామా గౌడ్	రోడ్డు	పిచ్చకుంట్ల పోచయ్య	ఆయన్నగారి శాంతమ్మ	కుంతల్ కట్ట			(1) బోరు పైపు లైను	
65	110/5/1	ఖుష్కి	లావుని పట్టా	02-10	లంబాడి లక్ష్మణ్ తండ్రి అర్జు	కాట్రోతు పీకల	చిలమంతుల పోచమ్మ	రోడ్డు	రంగాన్న కుంట				
66	110/6/1	ఖుష్కి	లావుని పట్టా	00-15	ఎరుకలి దుర్గయ్య తండ్రి నాగయ్య	రోడ్డు	చెరువు	లంబాడి విట్టల్	మల్లపర్తి భారతి				
67	110/1	ఖుష్కి	ప్రభుత్వము	07.02	పరంపోగు								
68	115	శికం	ప్రభుత్వము	02.15	కొండ్రి వాణికుంట								
69	125/1	ఖుష్కి	ప్రభుత్వము	00.03	కారీజ్ ఖాతా								
70	125/3/3	ఖుష్కి	లావుని పట్టా	01-20	ఆయన్నగారి మణెమ్మ భర్త సత్యాగౌడ్	ఆయన్నగారి జయమ్మ	ఆయన్నగారి సత్తెమ్మ	ఆయన్నగారి నగేష్ గౌడ్	పిచ్చకుంట్ల శ్రీశైలం				
71	125/3/4	ఖుష్కి	లావుని పట్టా	00-20	ఆయన్నగారి సుజాత భర్త సంజీవ్‌గౌడ్	ఆయన్నగారి మణెమ్మ	ఆయన్నగారి సత్తెమ్మ	ఆయన్నగారి నిర్మల	ఆయన్నగారి సత్తెమ్మ			(2) బోర్లు	
72	125/1/2	ఖుష్కి	లావుని పట్టా	00-26	పిచ్చకుంట్ల శ్యామ్మమ భర్త పోచయ్య	ఆయన్నగారి నగేష్ గౌడ్	పిచ్చకుంట్ల శ్యామమ్మ	పిచ్చకుంట్ల బిక్షపతి	ఆయన్నగారి నగేష్‌గౌడ్			(2)బోర్లు పైపులైను	
73	125/1/3	ఖుష్కి	లావుని పట్టా	00-02	పి లచ్చమ్మ భర్త నర్సయ్య	ఆయన్నగారి నగేష్ గౌడ్	పిచ్చకుంట్ల శ్యామమ్మ	పిచ్చకుంట్ల బిక్షపతి	ఆయన్నగారి నగేష్‌గౌడ్				
74	125/1/1	ఖుష్కి	లావుని పట్టా	00-12	పిచ్చకుంట్ల బిక్షమయ్య తండ్రి నర్సయ్య	పిచ్చకుంట్ల నర్సయ్య	పిచ్చకుంట్ల శ్యామమ్మ	పిచ్చకుంట్ల మలమ్మ	పిచ్చకుంట్ల శ్యామమ్మ			(1)బోర్లు పైపులైన్	
75	125/3/2	ఖుష్కి	లావుని పట్టా	00-27	ఆయన్నగారి దేవగౌడ్ తండ్రి రామాగౌడ్	ఆయన్నగారి నగేష్ గౌడ్	పిచ్చకుంట్ల మలమ్మ	ఆయన్నగారి నగేష్ గౌడ్	ఆయన్నగారి లింగమ్మ				
76	134/ఆ/2	ఖుష్కి	లావుని పట్టా	00-12	పి మల్లమ్మ భర్త దుర్గయ్య	ఆయన్నగారి జయమ్మ	వాగు	పిచ్చకుంట్ల నర్సయ్య	పిచ్చకుంట్ల పెదలక్ష్మి			(1)బోరు (1/2 బావిలో హిస	
77	134/ఆ/1	ఖుష్కి	లావుని పట్టా	00-11	పి నర్సయ్య తండ్రి రామయ్య	వై. అనమ్మ	వాగు	పిచ్చకుంట్ల నరసమ్మ	పిచ్చకుంట్ల మల్లమ్మ			(1/2) హిస బోరు (2) పైపులైను	
78	134/అ	ఖుష్కి	లావుని పట్టా	00-17	పి మల్లమ్మ భర్త అంజయ్య	తునికి పోచయ్య	పిచ్చకుంట్ల మల్లమ్మ	పిచ్చకుంట్ల పెద్దలక్ష్మయ్య	పిచ్చకుంట్ల బిక్షపతి			(1) బోరు పైపులైను	
79	134/ఇ	ఖుష్కి	లావుని పట్టా	00-12	పి లక్ష్మి భర్త కిష్టయ్య	తునికి పోచయ్య	పిచ్చకుంట్ల మల్లమ్మ	పిచ్చకుంట్ల పెద్దలక్ష్మయ్య	పిచ్చకుంట్ల బిక్షపతి				
80	136	ఖుష్కి	లావుని పట్టా	00-16	పి నర్సమ్మ భర్త పోచయ్య	పిచ్చకుంట్ల ఎలమ్మ	వాగు	పిచ్చకుంట్ల లచమ్మ	పిచ్చకుంట్ల నర్సయ్య			(1) బోరు పైపులైను &1/2 హిస్స	
81	136/అ	ఖుష్కి	లావుని పట్టా	00-08	పి లక్ష్మి భర్త కిష్టయ్య	పిచ్చకుంట్ల కిష్టయ్య	వాగు	చెరువు	పిచ్చకుంట్ల ఏలమ్మ			పైపులైను & 1/2 హిస్స (1) బోరు	
82	136/ఆ	ఖుష్కి	లావుని పట్టా	00-10	పి ఏలమ్మ భర్త ఎల్లయ్య	పిచ్చకుంట్ల ఏలమ్మ	పిచ్చకుంట్ల నరసమ్మ	పిచ్చకుంట్ల నరసమ్మ	పిచ్చకుంట్ల నర్సయ్య				
83	140	శికం	చెరువు శికం	25.20	ప్రభుత్వము								
84	141/1	ఖుష్కి	లావుని పట్టా	00-22	జుర్రు మల్లమ్మ భర : మల్లయ్య	పిచ్చకుంట్ల ఏల్లమ్మ	వాగు	పిచ్చకుంట్ల లచ్చమ్మ	పిచ్చకుంట్ల నర్సయ్య				
85	141/2	ఖుష్కి	లావుని పట్టా	00-15	జుర్రు కిష్టయ్య తండ్రి: భూమయ్య	జుర్రు మల్లేశం	యం.డి. ముర్తుజ	జుర్రు ఆంజనేయులు	జుర్రు మల్లమ్మ				
86	142/1	ఖుష్కి	లావుని పట్టా	00-35	జుర్రు నాగమణి భర్త: సత్తయ్య	జుర్రు మల్లేశం	యం.డి. ముర్తుజ	జుర్రు ఆంజనేయులు	జుర్రు మల్లమ్మ				
87	150/26 150/30	ఖుష్కి	లావుని పట్టా	00-15 00-05	ఎర్కలి దుర్గయ్య తండ్రి: నాగయ్య	మన్నేపల్లి ఖ్యాతమ్మ	చెరువుకట్ట	జుర్రు మల్లమ్మ	చెరువు కట్ట				
88	150/12/1	ఖుష్కి	లావుని పట్టా	00-30	లంబాడి హీర్య తండ్రి: డాఖ్య	జుర్రు మల్లేశం	యం.డి. ముర్తుజ	జుర్రు ఆంజనేయులు	జుర్రు మల్లమ్మ				
89	150/12	ఖుష్కి	లావుని పట్టా	00-30	లంబాడి విట్టల్ తండ్రి: డాఖ్య	జుర్రు కొమురయ్య	పెద్ద చెరువు	మన్నే నాగ రత్నం	మన్నేపల్లి ఖ్యాతమ్మ				
90	150/2/2 150/29/2 150/1/అ	ఖుష్కి	లావుని పట్టా	00-20 00-30 01-05	మల్పర్తి భారతి భర్త: సాయిలు	జుర్రు మల్లేశం	యం.డి. ముర్తుజ	జుర్రు ఆంజనేయులు	జుర్రు మల్లమ్మ	ఈత వేప	9 1	1బోర్ పైపు లైను	
91	150/29/1 150/2/1 150/1ఇ	ఖుష్కి	లావుని పట్టా	00-30 00-20 01-05	మల్పర్తి లక్ష్మీ భర్త: రాములు	జుర్రు కొమురయ్య	పెద్ద చెరువు	మన్నే నాగ రత్నం	మన్నేపల్లి ఖ్యాతమ్మ	ఈత	9	1బోర్ పైపు లైను	
92	150/24/అ	ఖుష్కి	లావుని పట్టా	00-20	మహమ్మద్ ముర్తుజ తండ్రి: సయ్యద్	మన్నేపల్లి ఖ్యాతమ్మ	చెరువు కట్ట	జుర్రు మల్లమ్మ	చెరువు కట్ట				
93	150/24/ఆ/1	ఖుష్కి	లావుని పట్టా	00-10	మనేపల్లి క్యాతమ్మ భర్త: బాల మల్లయ్య	జుర్రు మల్లేశం	యం.డి ముర్తుజ	జుర్రు ఆంజనేయులు	జుర్రు మల్లమ్మ			1బోరు	
94	150/8/ఆ	ఖుష్కి	లావుని పట్టా	01-25	జుర్రు ఆంజనేయులు తండ్రి: రామయ్య	జుర్రు కొమురయ్య	పెద్ద చెరువు	మన్నే నాగ రత్నం	మన్నేపల్లి ఖ్యాతమ్మ	ఈత వేప తుమ్మ	5 2 1		
95	150/1	ఖుష్కి	ప్రభుత్వము	10.27	పరం పోగు								
	మొత్తము			96.21									

మొత్తము విస్తీర్ణము : 152.38

ఇట్టి ప్రకటన భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నం. 21/2017) ద్వారా సవరించబడిన భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013, సెక్షన్ 11(1) (కేంద్ర చట్టం నెం. 30/2013) ప్రకారం సంబంధం కలిగిన వ్యక్తులు అందరికి తెలియజేయుటకు గాను ఈ నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాన్, మరియు వివరములు జిల్లా కలెక్టర్, మెదక్ మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, నర్సాపూర్ వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏవైనా పనిదినములలో కార్యాలయ పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ మెదక్ గారు, రెవిన్యూ డివిజనల్ అధికారి, నర్సాపూర్ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబంధించిన సెక్షన్-12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదేని ప్రదేశములో ప్రవేశించి సర్వే జరిపి భూ కమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూ స్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూ సేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, మెదక్ గారి అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి కొనుగోలు/ అమ్మకాలు/ తాకట్లకు సంబంధించిన చర్యలు చేపట్టరాదు.

సెక్షన్ (15) ప్రకారం, ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ తరువాత పైన చూపించిన భూములలో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైన భూసేకరణపై అభ్యంతరములు ఉన్నచో అట్టి వ్యక్తులు, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములలో జిల్లా కలెక్టర్, మెదక్ గారి/ భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, నర్సాపూర్ గారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/-	సం/-	సం/-	సం/-
తహశీల్దార్, నర్సాపూర్ మండలము	రెవెన్యూ డివిజినల్ అధికారి నర్సాపూర్	జాయింట్ కలెక్టర్, మెదక్ జిల్లా.	జిల్లా కలెక్టర్, మెదక్ జిల్లా



పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ ఆదివరహాస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి

మూడేండ్లలో బంగారు తెలంగాణకు బాటలు

శాసన సభ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి

కమాన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ.. సీఎం కేసీఆర్ ఈ మూడేండ్లలో బంగారు తెలంగాణకు బాటలు వేశారని శాసన సభ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లోని ఆదివరహాస్వామి ఆలయంలో శనివారం ఆమె పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందన్నారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్‌ను అందించడం గొప్ప విషయమన్నారు. కుల, చేతి వృత్తుల వారి సంక్షేమానికి కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మంథని సర్పంచ్ పుట్ట శైలజ, ఎంపీపీ ఇనగంటి ప్రేమలత, జెడ్పీటీసీ సభ్యులు మేకల సంపత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వరంగల్‌లో 'టాస్క్'

సుబేదారి(వరంగల్): సాంకేతిక రంగంలో వస్తున్న నైపుణ్యాలను యువత మెరుగుపర్చుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం వరంగల్‌లో తెలంగాణ అకడమిక్ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నదని సీఈవో సుధీర్‌అయ్యర్ తెలిపారు. వరంగల్‌లో టాస్క్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఇటీవల ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి కోరడంతో అందుకు మంత్రి సుముఖత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం హన్మకొండ నక్కలగుట్ట హరిత హోటల్‌లో ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ కంపెనీల ప్రతినిధులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా నగరంలోని కార్పొరేట్ కంపెనీలు, షాపింగ్‌మాల్స్, ఐటీ సెక్టార్ కంపెనీ, కాటన్ ఇండస్ట్రీ, వైద్యశాలల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వరంగల్‌లో టాస్క్ సెంటర్ ఏర్పాటు చేస్తే యువతలో స్కిల్స్ పెరిగి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా 14 వెల్‌నెస్ సెంటర్లు

కరీంనగర్ హెల్త్: ఉద్యోగులు, జర్నలిస్టులకు వైద్య సేవలందించేందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా 14 వెల్‌నెస్ సెంటర్లు (దవాఖానలు) ఏర్పాటు చేస్తున్నట్టు ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సీఈవో డాక్టర్ పద్మ తెలిపారు. శనివారం ఆమె కరీంనగర్ జిల్లా కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కోసం ఖాళీగా ఉన్న మాతా శిశు సంరక్షణ భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు దాదాపు అన్ని జిల్లాల్లో భవనాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. తొమ్మిది పాత జిల్లాలతోపాటు హైదరాబాద్‌లో 4, సిద్దిపేటలో ఒక వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో ఓపీ సేవలతోపాటు అన్ని వ్యాధులకు ఒకే దవాఖానలో చికిత్స అందించేలా ప్రణాళికలు చేపడుతున్నామన్నారు.

ముగిసిన న్యాక్ బృందం తనిఖీలు

ఉస్మానియా యూనివర్సిటీ: రెండు రోజులుగా ఉస్మానియా యూనివర్సిటీలో న్యాక్ బృందం తనిఖీలు శనివారం ముగిశాయి. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఉన్నత విద్యా సంస్థలకు గ్రేడింగ్ ఇచ్చే న్యాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం ఓయూలో గురువారం, శుక్రవారం రెండు రోజులపాటు అన్ని విభాగాలను సందర్శించింది. క్షేత్ర పర్యటన శుక్రవారమే పూర్తయినప్పటికీ, చివరిరోజైన శనివారం సభ్యులంతా కలిసి నివేదికను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. నివేదికను రూపొందించిన అనంతరం దానిని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రామచంద్రానికి వివరించారు. తర్వాత ఆయన నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని నివేదికకు తుదిరూపు ఇచ్చారు. బృందం సభ్యుల్లో కొంతమంది శనివారమే వెళ్లిపోగా, మరికొంత మంది ఆదివారం తమ స్వస్థలాలకు వెళ్లనున్నారు. కీలకమైన న్యాక్ బృందం పర్యటన ముగిసిపోగా, ఎక్కడ చూసినా వర్సిటీకి ఏ గ్రేడ్ వచ్చే అవకాశమున్నదనే అంశంపైనే చర్చ జరుగుతుండటం విశేషం.

నెలాఖరులోగా సంస్కరణలు పూర్తిచేయాలి



శనివారం సచివాలయంలో ఈవోడీబీపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్పీ సింగ్

- ఈవోడీబీపై సమీక్షలో సీఎస్ ఎస్పీ సింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సులభ వాణిజ్య విధానంలో కేంద్ర ప్రభుత్వం సూచించిన సంస్కరణలను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అధికారులను ఆదేశించారు. ఈవోడీబీపై శనివారం సచివాలయంలో వివిధశాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈవోడీబీలో ఈ ఏడాది కూడా మొదటిస్థానంలో నిలిచేలా అధికారులు కృషిచేయాలన్నారు. మొత్తం 372 సంస్కరణల్లో ఇప్పటికే 315 పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. మరో 57 నెలాఖరులోగా పూర్తిచేయాలని సూచించారు. న్యాయ, రెవెన్యూ శాఖల అంశాలపై ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఒక్కో సంస్కరణ విజయవంతంగా అమలు చేస్తే 0.5 మార్కులు ఉన్నాయని తెలిపారు. సంస్కరణల అమలుపై అభిప్రాయ సేకరణకు 0.5 మార్కులు ఉన్నాయని వెల్లడించారు. ఈవోడీబీ సంస్కరణలపై సెప్టెంబర్ 1 నుంచి అవగాహన కార్యక్రమాలను అన్నిశాఖల అధికారులు ఏర్పాటు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సీఎస్ సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్‌మిశ్రా, బీఆర్ మీనా, ముఖ్యకార్యదర్శులు సునీల్‌శర్మ, జయేశ్‌రంజన్, రజత్‌కుమార్, శశాంక్ గోయల్, వికాస్‌రాజ్, కార్యదర్శులు నవీన్‌మిట్టల్, పరిశ్రమల కార్యదర్శి అహ్మద్ నదీమ్, వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి పీ సత్యనారాయణ రెడ్డి, పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్, సీజీజీ డీజీ రాజేంద్ర, పీసీసీఎఫ్ పీకే ఝా, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ డైరెక్టర్ శ్రీదేవి, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, పరిశ్రమలశాఖ సంయుక్త కార్యదర్శి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ కోటా సీట్లకు తూట్లు!

నిబంధనలకు నీళ్లొదిలిన జేఎన్‌యూఎఫ్‌ఏ.. ఏపీ అధికారుల పెత్తనంతో.. ఆందోళనలో టాప్ ర్యాంకర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్‌యూఎఫ్‌ఏ) ప్రవేశాల ప్రక్రియలో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేస్తూ, ఇష్టారాజ్యంగా సీట్ల భర్తీ చేపడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీలో ఏపీ అధికారుల పెత్తనంతో 15 శాతం ఓపెన్ కోటా సీట్లకు తూట్లు పొడిచి మెరిట్ విద్యార్థులకు కేటాయించాల్సిన సీట్లను భర్తీ చేయకుండా పక్కకు పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జేఎన్‌యూఎఫ్‌ఏలో ఫొటోగ్రఫీ కోర్సులో 30 సీట్లు ఉన్నాయి. వాటిలో 15 శాతం సీట్లు ఓపెన్ కోటా.. 85 శాతం కోటా సీట్లు స్థానికులతో భర్తీచేస్తారు. ఆ ప్రాతిపదికన 4 సీట్లు ఓపెన్ కోటాకు కేటాయించాలి. ఓపెన్ కోటాలో ఓయూ పరిధిలో 6వ ర్యాంకు సాధించిన విద్యార్థికి సీటు కేటాయించలేదు. ఓపెన్ కోటా సీట్లలో రెండింటిని పీహెచ్‌సీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, క్యాప్ కోటా వారికి కేటాయించామని అధికారులు అంటున్నారు. వాస్తవానికి ఈ కోటాల్లో ఎవరు దరఖాస్తు చేసుకోలేదని సమాచారం. ఈ క్యాటగిరీలకు కేటాయించామని చెప్పిన రెండుసీట్లను భర్తీ చేయకుండా పక్కనపెట్టారు. దరఖాస్తులే రానప్పుడు సీట్లను కౌన్సెలింగ్‌లో ఎందుకు పెట్టలేదనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. వర్సిటీ పరిధిలోని అన్నిరకాల కోర్సులకు ఇదే విధానం అమలుచేసినట్టు బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సంబంధించిన పత్రాలను, ఆధారాలను చూపిస్తున్నారు. ఓపెన్ కోటాలో పీహెచ్‌సీ, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్ కోటాకు కేటాయించాలి. విద్యార్థులు అందుబాటులో లేకపోతే వారికోసం సీట్లను ఖాళీగా పెట్టడం నిబంధనలకు విరుద్ధం. కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేయని ఆంధ్ర విద్యార్థుల కోసమే అధికారులు సీట్లను ఖాళీగా పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఆంధ్రా యూనివర్సిటీ, శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో భర్తీ కావాల్సిన సీట్ల కోసం అక్కడి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోలేదు. వీటిని తెలంగాణ విద్యార్థులతో భర్తీ చేయకుండా.. కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు చేసుకోని ఏపీ విద్యార్థుల కోసం ఖాళీగా పెట్టడం ఎంత వరకు సమంజసమని తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. తొలివిడుతలో అన్నిసీట్లు కౌన్సెలింగ్‌లో పెట్టాలి. కానీ తొలివిడుత కౌన్సెలింగ్‌లో చూపకుండా.. రెండోవిడుతలో సీట్లను చూపిస్తామని వర్సిటీ అడ్మిషన్ డైరెక్టర్ చెప్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని నిపుణులు అంటున్నారు. ఈ సీట్లు కౌన్సెలింగ్‌లో పెట్టకపోవడం వల్ల తర్వాత మెరిట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సీట్లు కేటాయించలేదు. ఇతర కోటాల్లో మిగిలిపోయిన సీట్లను అర్హులకు కేటాయించకుండా, అక్రమంగా కట్టబెట్టేందుకు పక్కనపెట్టడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

మన అధికారులను దూరంపెట్టి..

తెలంగాణ వచ్చినా జేఎన్‌యూఎఫ్‌ఏలో ఏపీ అధికారుల పెత్తనమే నడుస్తున్నది. తెలంగాణ ప్రొఫెసర్లను, అధికారులను దూరంపెట్టి, దొడ్డిదారిలో కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నట్టు తెలుస్తున్నది. ఏపీ విద్యార్థులకు న్యాయం చేసేందుకు ఓయూ పరిధిలో మెరిట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సీట్లు రాకుండా కుట్రలు చేస్తున్నట్టు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ సమయంలో న్యాయబద్ధంగా రిజర్వ్‌డ్ కోటాలో సీట్లు రావాల్సిన విద్యార్థులను సెల్ఫ్ సపోర్టింగ్ సీట్లు పొందేలా ప్రేరేపించారని, ఎస్సీ రిజర్వ్‌డ్ కోటాలో ఓయూ విద్యార్థికి కూడా ఈ విధంగానే అన్యాయం జరిగిందని అంటున్నారు.



శనివారం రాయచూర్‌లో వ్యవసాయ యంత్రాన్ని పరిశీలిస్తున్న ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి తదితరులు

సెల్‌ఫోన్‌తో పంట చీడల గుర్తింపు

- వెబ్‌సైట్‌ను రూపొందించిన రాయచూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు
- వర్సిటీని సందర్శించి వివరాలు తెలుసుకొన్న రాష్ట్ర బృందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గతంలో పంటలకు చీడపీడలు ఆశిస్తే, కొంత పంటను, పురుగులను రైతులు స్వయంగా తీసుకెళ్లి వ్యవసాయ అధికారులకు చూపించేవారు. వాటిని పరిశీలించి నివారణ చర్యలు సూచించేవారు. ఈ ప్రక్రియ వ్యయప్రయాసలతో కూడుకున్నది. ఇప్పుడు రైతులు సెల్‌ఫోన్ ద్వారా ఈ ప్రక్రియ చాలా సులభంగా నిర్వహించవచ్చని కర్ణాటకలోని రాయచూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు నిరూపించారు. పంటకు సోకిన తెగులు గుర్తించి, దాని నివారణోపాయాలు తెలిపేందుకు ఆ వర్సిటీ శాస్త్రవేత్తలు కొత్త 'వెబ్‌సైట్'ను రూపొందించారు. రైతు ఏ పంట వేసినా చీడపీడలు ఆశిస్తే సెల్‌ఫోన్‌లో పంట ఆకులను, పంటలోని కీటకాలను ఫొటోతీసి ఆ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే వెంటనే తెగులు నివారణకు ఏ రసాయన ఎరువులు వాడాలి? ఎంత మొత్తంలో వాడాలి? ఎలా వాడాలి? వంటి సలహాలను వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. రైతు ఎక్కడికి వెళ్లకుండా తను ఉన్న ప్రదేశంలోనే రోగానికి పరిష్కారం దొరుకుతుంది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆధునిక వ్యవసాయ పద్ధతులను అధ్యయనం చేయడానికి కర్ణాటక రాష్ట్ర పర్యటనకు వెళ్లిన ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు, ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త సుధాకర్, ఇతర అధికారుల బృందం రెండోరోజు శనివారం రాయచూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించింది. రాయచూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రూపొందించిన ఈ వెబ్‌సైట్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్రబృందం పేర్కొన్నది. రెండురోజుల పర్యటనలో అధ్యయనం చేసిన అంశాలను నివేదిక రూపంలో సీఎం కేసీఆర్‌కు అందజేయనున్నట్టు ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు తెలిపారు.

ప్రేమించలేదని నిప్పంటించాడు..

- తానూ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు
- విశాఖలో ఉన్మాది దారుణం

విశాఖ, ఆగస్టు 19: ఉన్మాదం రెండు నిండుప్రాణాలను బలిగొన్నది. తన ప్రేమను అంగీకరించలేదనే ఆక్రోశంతో ఓ యువకుడి ఉన్మాద చర్యకు బాలిక చనిపోయింది. తన అక్కను కాపాడేక్రమంలో తమ్ముడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ దారుణానికి ఒడిగట్టిన యువకుడు సైతం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా భీమిలి మండలం టీనగరపాలెంలో శనివారం జరిగింది. తగరపువలసకు చెందిన హరిసంతోష్ అనే 20 ఏండ్ల యువకుడు టీనగరపాలెంలో నివాసముండే రూప అనే 17 ఏండ్ల బాలికను ప్రేమిస్తున్నానంటూ వేధించసాగాడు. సంతోష్ ప్రేమను రూప నిరాకరించింది. దీంతో రగిలిపోయిన సంతోష్ శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న రూపపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా కాలిన గాయాలతో బాలిక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. బాలికను రక్షించేందుకు యత్నించిన ఆమె తమ్ముడు ఉపేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని బంధువులు కేజీహెచ్ దవాఖానకు తరలించారు. సంఘటనాస్థలం నుంచి పరారైన హరిసంతోష్ విజయనగరం జిల్లా గోకపేట వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడి ఉన్మాదానికి అక్క బలికావడం, తమ్ముడు తీవ్రగాయాలతో ప్రాణాపాయస్థితిలో ఉండటం, బాధిత కుటుంబంలో విషాదం నింపింది.

రూ.25 లక్షల విలువైన గుట్కా స్వాధీనం

కూకట్‌పల్లి, నమస్తే తెలంగాణ: ముంబై నుంచి గుట్కా ప్యాకెట్లను దిగుమతి చేసి కార్గో సర్వీసెస్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రూ.25 లక్షల విలువైన 38 బ్యాగుల గుట్కా ప్యాకెట్లను కూకట్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. గుట్కా ప్యాకెట్లను సరఫరా చేస్తున్న ముఠాలోని ముఖ్య సభ్యులు పరారీలో ఉండగా గుట్కాతో పట్టుబడిన ఓ వ్యక్తిని పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ భుజంగరావు వివరాలు వెల్లడించారు. కూకట్‌పల్లి సాగర్ హోటల్ సమీపంలో ఉండే కావేరి కార్గో ట్రాన్స్‌పోర్ట్ యజమాని పెంచల నాయుడు, తన వద్ద మేనేజర్‌గా పని చేస్తున్న గద్దె నరేంద్ర, విశాఖపట్నంకు చెందిన జగన్, భీమవరానికి చెందిన శ్రీరాం, రాజమండ్రికి చెందిన అప్పారావుతో కలిసి ముంబై నుంచి గుట్కా ప్యాకెట్లను అక్రమంగా దిగుమతి చేసి కావేరి కార్గో ట్రాన్స్‌పోర్ట్ ద్వారా ఆంధ్రప్రదేశంలోని భీమవరం, వైజాగ్, రాజమండ్రికి సరపరా చేస్తున్నారు. కావేరి కార్గో ట్రాన్స్‌పోర్టు యజమాని పెంచల నాయుడు, మేనేజర్ గద్దె నరేంద్ర ఆరు నెలల కిందట ఈ వ్యాపారాన్ని ప్రారంభించారు. ఇందుకు సాగర్ హోటల్ వెనుక ఓ షెడ్డును, ఓ డీసీఎంను కిరాయికి కిరాయికి తీసుకున్నారు. ఆరు నెలలుగా ముంబైలోని ఓ వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకుని డీసీఎంలో గుట్కాలను కూకట్‌పల్లిలోని తమ గోదాముకు తీసుకువచ్చి అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో కూకట్‌పల్లి పోలీసులు గుట్కాలు దిగుమతి చేస్తున్న గోదాముపై దాడి చేశారు. కావేరి కార్గో ట్రాన్స్‌పోర్ సూపర్‌వైజర్‌గా పని చేసున్న మూసాపేట్‌కు చెందిన కమ్మెర శ్రీరామ్‌కుమార్(29)ను అదుపులో తీసుకుని, ముంబై నుంచి దిగుమతి చేసి రూ.25 లక్షల విలువైన 38 గుట్కా బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. అసలు సూత్రదారులైన పెంచల నాయుడు, గద్దె నరేంద్ర, జగన్, శ్రీరాం, అప్పారావు, డీసీఎం యజమాని, డ్రైవర్ పరారీలో ఉన్నారు. కేసును ఛేదించిన కూకట్‌పల్లి సీఐ ప్రసన్నకుమార్, ఎస్సైలు సురేశ్, గోపీనాథ్, క్రైం సిబ్బంది ముజఫర్, శ్రీమన్నారాయణ, తిరుమలరావును ఏసీపీ అభినందించారు.



నిందితుడు కమ్మెర శ్రీరాంకుమార్‌ను మీడియాకు చూపి.. వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ భుజంగరావు

ఏపీకి వెళ్లేందుకు స్థానిక ఉద్యోగుల ఆసక్తి

- సొంత రాష్ట్రానికి వెళ్తామని రెండువేల మంది దరఖాస్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో ఉన్న ఏపీ స్థానికతగల ఉద్యోగులు స్వచ్ఛందంగా తమ సొంత రాష్ట్రానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని వివిధశాఖల్లో పనిచేస్తున్న రెండువేల మంది ఉద్యోగులు ఈ మేరకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఏపీ ప్రభుత్వం తమ సొంత ఉద్యోగులను తీసుకునే విషయంపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్ల బదిలీ ప్రక్రియ ఆలస్యమవుతున్నది. ఏపీ స్థానికతగల ఉద్యోగులందరినీ తమ రాష్ట్రంలోకి తీసుకునేందుకు చంద్రబాబు సర్కార్ సంసిద్ధతను వ్యక్తంచేస్తే ఇంకా ఎక్కువసంఖ్యలో దరఖాస్తులు వస్తాయని తెలుస్తున్నది.

ఏసీఎస్వోలకు పదోన్నతి కల్పించండి

- పౌరసరఫరాలశాఖ కమిషనర్‌కు టీజీవో విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పెండింగ్‌లో ఉన్న డిప్యూటీ తహసీల్దార్లు, అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్లకు (ఏసీఎస్వో) పదోన్నతులు కల్పించాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్‌కు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం (టీజీవో) విజ్ఞప్తి చేసింది. కేంద్రం, తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం నుంచి సీవీ ఆనంద్‌కు పురస్కారాలు వచ్చిన నేపథ్యంలో టీజీవో బృందం సభ్యులు సంఘం హైదరాబాద్‌శాఖ అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్ నేతృత్వంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతుల గురించి ప్రస్తావించారు. ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పినట్టు కృష్ణయాదవ్ తెలిపారు.

28 పట్టణాలకు మాస్టర్ ప్లాన్లు

ప్రపంచ బ్యాంకు నిధులతో 17, అమృత్ నిధులతో 11 పట్టణాల అభివృద్ధి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడంపై పురపాలకశాఖ దృష్టి సారించింది. ఈ మేరకు 28 పట్టణాలకు బృహత్ ప్రణాళికలను రూపొందించడంపై పట్టణ ప్రణాళికావిభాగం డైరెక్టరేట్ (డీటీసీపీ) నిమగ్నమైంది. ప్రపంచబ్యాంకు నిధులతో తెలంగాణ పురపాలక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 17 పట్టణాలకు బేస్ మ్యాపులను పూర్తి చేసింది. వీటికి సంబంధించిన లోటుపాట్లు, తప్పొప్పులను సరిదిద్దేందుకు వచ్చే నెలలో ప్రత్యేక కన్సల్టెంట్‌ను నియమించుకోనున్నది. ఈ పని పూర్తి కాగానే 2017 అక్టోబర్ నుంచి పనుల్లో వేగం పెంచాలని, 28 వారాల్లో డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్లను పూర్తి చేయాలని నిర్ణయించింది. మొదట నిర్మల్, భైంసా, కాగజ్‌నగర్, జగిత్యాల్, సిరిసిల్ల, కొత్తగూడెం, పాల్వంచ, జనగాం, నారాయణ్‌పేట్, వనపర్తి, గద్వాల, మెదక్, సదాశివ్‌పేట, జహీరాబాద్, బోధన్, కామారెడ్డి, తాండూరు పట్టణాలను అభివృద్ధి చేయనున్నది.

అమృత్‌లో 11 పట్టణాలు..

అమృత్ పథకం కింద కేంద్రం సాయంతో రాష్ట్రంలోని 11 పట్టణాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఆదిలాబాద్, కరీంనగర్, రామగుండం, ఖమ్మం, వరంగల్, మిర్యాలగూడ, నల్లగొండ, సూర్యాపేటట్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, నిజామాబాద్ వంటి నగరాలు, పట్టణాలకు మాస్టర్ ప్లాన్లను కొత్తగా రూపొందిస్తున్నారు. ఈ ప్రక్రియను పద్దెనిమిది నెలల్లో పూర్తి చేయాలని డీటీసీపీ లక్ష్యం నిర్దేశించుకున్నది. ఒకసారి ప్రణాళికలంటూ పూర్తి కాగానే దాని ఆధారంగా, ఆయా నగరాలు, పట్టణాలను అభివృద్ధి చేసే విషయంపై ఉన్నతాధికారులకు సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది. నివాస ప్రాంతాలు ఎక్కడ రావాలి? వాణిజ్య సముదాయాలను ఏయే ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తారు? ఇలా ప్రతి అంశం పక్కాగా తెలుస్తుంది.



రోబోటిక్స్ శిక్షణ కార్యక్రమంలో ఎలక్ట్రిక్ పరికరాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

నేటితో ముగియనున్న రోబోటిక్స్ శిక్షణ

- 42 మైనారిటీ గురుకులాల్లో 4200మంది విద్యార్థులకు శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మైనారిటీ రెసిడెన్షియల్ గురుకులాల విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మూడురోజుల రోబోటిక్స్ శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగియనున్నది. తొలివిడుతగా 12, 13 తేదీల్లో రెండురోజులు శిక్షణనిచ్చారు. మూడోరోజు ఆదివారం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కొద్ది నెలలకిందట ఎనిమిది పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన వచ్చింది. దీంతో అధికారులు రాష్ట్రంలోని 42 మైనారిటీ గురుకులాల్లో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏడో తరగతి విద్యార్థులు సుమారు 4200మంది శిక్షణ తరగతులకు హాజరవుతున్నట్లు మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ (టెమ్రీస్) కార్యదర్శి బీ షఫీఉల్లా శనివారం మీడియాకు తెలిపారు. రోబోమింటన్, పెరెంట్స్ అండ్ చైల్డ్ రోబోట్, క్వాడ్‌కాప్టర్, ఒసియన్ రోవర్‌బోట్, స్పైడర్‌బోడ్, క్లీనర్ బోర్డు వంటి చాలెంజింగ్ ప్రాజెక్టుల్లో విద్యార్థులు జాతీయస్థాయిల్లో ప్రతిభను కనబరిచేలా శిక్షణ ఇచ్చామన్నారు. టెమ్రీస్ ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన ముఫఖంజా ఇంజినీరింగ్ టెక్నాలజీ కాలేజీతో (ఎమ్జేసీఈటీ) ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాల సాధనలో భాగంగా 204 మైనారిటీ గురుకులాలు, మరో రెండు రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో మైనారిటీ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించేందుకు రోబోటిక్ శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. ముఫఖంజా ఇంజినీరింగ్ కాలేజ్‌లోని రోబోటిక్స్ సెంటర్‌కు చెందిన 480 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు శిక్షణ ఇస్తున్నారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయి రోబోటిక్స్ సెంటర్‌ను ఏర్పాటుచేసే ఆలోచన ఉన్నట్లు షఫీఉల్లా తెలిపారు.

భారీ నిర్మాణాలకు నేరుగా డీటీసీపీ నుంచి అనుమతి!

1200 గజాలు దాటిన కట్టడాలకు అనుమతుల మంజూరులో వేగం పెంపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ :

ఇండ్ల నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతులిచ్చే ప్రక్రియను పురపాలకశాఖ వేగవంతం చేసింది. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న తరువాత అనుమతిపత్రం చేతికి రావడానికి మూడు నుంచి ఆరు నెలల సమయం పడుతున్నది. ఒక పట్టణంలో ఇంటి అనుమతికి చేసుకున్న దరఖాస్తు ప్రధాన కార్యాలయానికి చేరుకోవడంలో ఆలస్యమయ్యేది. డీపీఎంఎస్ (డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం) కారణంగా ఇక నుంచి అలాంటి బాదరబందీలుండవు. 1200 గజాలు లేదా ఆపై విస్తీర్ణం దాటిన నిర్మాణాలకు ఇక నుంచి నేరుగా డీటీసీపీ (ప్రణాళికా విభాగం ప్రాంతీయ సంచాలకుల కార్యాలయం) ద్వారా అనుమతిని మంజూరు చేస్తారు. రాష్ట్రంలోని దాదాపు 58 పట్టణాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి తెచ్చారు. సులభతర వాణిజ్య విధానంలో భాగంగా అనుమతుల ప్రక్రియలో వేగం పెంచాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కే తారక రామారావు డీటీసీపీ విభాగం అధికారుల్ని ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన డీటీసీపీ డైరెక్టర్ అనుమతుల్లో ఆలస్యాన్ని నివారించడంపై దృష్టి పెట్టారు. స్వయంగా, వివిధ పట్టణాలకు వెళ్లి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సర్వర్ల సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనుమతుల మంజూరులో నిర్లక్ష్యం చేయకూడదని రాష్ట్రవ్యాప్తంగా గల టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను హెచ్చరించారు. ఇదే సమయంలో కొత్త అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇక నుంచి ఎవరైనా 1200 గజాలు దాటిన నిర్మాణాలకు అనుమతికి దరఖాస్తు చేసుకుంటే ఆ ఫైలు ఆన్‌లైన్ ద్వారా నేరుగా డీటీసీపీకి చేరుతుంది. దీంతో ఆయన వీలైనంత త్వరగా అనుమతినివ్వడానికి వీలు కలుగుతుంది. ఇదివరకు దరఖాస్తు ఫైలు మొదట కమిషనర్‌కు, అక్కడ్నుంచి డీటీసీపీకి వెళ్లేది. అందుకే జాప్యమయ్యేది. ఇక నుంచి అలా జరుగదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

రోడ్డు కటింగ్ పనులకు అనుమతి తప్పనిసరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రోడ్డు తవ్వకాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం విధిగా అనుమతి తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్లకు స్పష్టంచేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే వారం రోజుల్లో అనుమతి ఇస్తామని వెల్లడించింది. ఈ నెల నుంచే ఈ విధానం అమల్లోకి వచ్చింది. రోడ్డు కటింగ్ అనుమతులపై ఇటీవల రోడ్లు భవనాలశాఖ విధి విధానాలను తెలుపుతూ ఆదేశాలు జారీచేసింది. రోడ్డు కటింగ్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెళ్లి పరిశీలించి తర్వాత అనుమతి ఇస్తారు. ఆరురోజులపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఒక్కరోజులో సర్టిఫికెట్ జారీచేస్తారు. దీనికి సంబంధించి వినియోగదారుడి ఫోన్‌కు సమాచారం అందిస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తు సరిగ్గా ఉందా? ఇంకేమైనా సర్టిఫికెట్లు జత చేయాలా? అనే అంశాలపై ఎస్సెమ్మెస్ పంపిస్తారు.

అవసరం మేరకు సర్టిఫికెట్లు దాఖలు చేయాలి

రోడ్డు ఎందుకు తవ్వుతున్నారు? వ్యక్తిగత ప్రయోజనమా? సామాజిక అవసరమా? అనే అంశపై పూర్తిస్థాయి సర్టిఫికెట్లను దరఖాస్తుతోపాటు జత చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. రోడ్డు ఏ ప్రాంతంలో ఉన్నది? ఏ రకమైన రోడ్డు? అనే వాటి వివరాలతోపాటు దాని చిరునామా స్పష్టంగా ఉండాలి. ఇందుకు సంబంధించి నిర్ధారిత రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలని స్పష్టంచేశారు. ఆన్‌లైన్ దరఖాస్తుల విధానం ప్రవేశపెట్టినప్పటి నుంచి వినియోగదారుల నుంచి భారీ స్పందన వస్తుందని ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొంటున్నారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపించి వెంటనే అనుమతులు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ రవీందర్‌రావు తెలిపారు. రోజుకు వంద వరకు దరఖాస్తులు వస్తున్నాయని పేర్కొన్నారు.

రోడ్డు కటింగ్ ఫీజుల వివరాలు..

రోడ్డు రకం	చార్జి
సీసీ రోడ్లు	రూ.1,844
బీటీ రోడ్లు	రూ. 2,275
ఫుట్‌పాత్‌లు	రూ.799
బెర్మ్/ డబ్ల్యూబీఎం	రూ. 285
రోడ్డుకు మట్టికట్ట అవతల (గ్రామాల్లో)	రూ. 156
రోడ్డుకు మట్టికట్ట అవతల (పట్టణాల్లో)	రూ.195

జంతువుల దత్తతకు ప్రోత్సాహం

- ఐటీ కంపెనీలకు ఆహ్వానం
- జూపార్కుల సలహా మండలి నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కులో జంతువుల దత్తతపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని, దత్తతకు ముందుకొచ్చేవారిని ప్రోత్సహించాలని, ఇందుకు ఐటీ, ఇతర కార్పొరేట్ కంపెనీల యజమానులను ప్రత్యేకంగా ఆహ్వానించాలని జూపార్కుల సలహా మండలి నిర్ణయించింది. శనివారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో సమావేశమైన మండలిసభ్యులు నెహ్రూ జూలో ఒంటరిగా ఉన్న జిరాఫీ, చింపాంజీ, లయన్ టెయిల్డ్ మకాక్ వంటి వన్యప్రాణులకు జంతు మార్పిడి పథకం కింద దేశంలోని వివిధ జూపార్కుల నుంచి జతలను తేవాలని నిర్ణయించారు. జంతువుల పోషణభారాన్ని భరించేందుకు ముందుకొచ్చే దాతల పేర్లను యానిమల్ అడాప్షన్ స్కీం కింద ఎన్‌క్లోజర్ల ముందు ప్రదర్శించడమే కాకుండా ప్రత్యేక గౌరవం ఉండేలా చర్యలు చేపట్టాలని తీర్మానించారు. జూ సందర్శకులకు వన్యప్రాణులపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక టాక్‌షోలను నిర్వహించాలని నిర్ణయించారు. జూపార్కును ఆనుకుని ఉన్న మీరాలంట్యాంకులో కలుషిత జలాలు జంతువులపై ప్రభావం చూపుతున్నాయని సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డ్ అధికారుల సమన్వయ సహకారంతో కాలుష్యనియంత్రణకు చర్యలు తీసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా మిగతా జూపార్కులు, మినీపార్కుల్లో కెమెరాల నిఘాను పెంచాలని నిర్ణయించారు. సమావేశంలో అటవీశాఖ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ మనోరంజన్ బాంజా, పర్యాటకశాఖ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టీనా చోంగ్తు, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ కుక్రేటీ, జూ క్యూరేటర్ శివానీ డోగ్రా, సీసీఎంబీ శాస్త్రవేత్త కార్తికేయన్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఎస్ శ్రీనివాస్‌రెడ్డి ఇతర సంస్థల అధికారులు పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా దుమ్ముగూడెం మండలంలో నీటమునిగిన సీతమ్మ నారచీరల ప్రాంతం



కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో జలమయమైన రోడ్డు



నిజామాబాద్ నగరంలో జలమయమైన హైదరాబాద్ రోడ్డు

విస్తారంగా వర్షాలు

- పొంగిన వాగులు, వంకలు
- పలుచోట్ల స్తంభించిన రాకపోకలు
- పంటలకు ఊతమిచ్చిన వాన

న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ:

అల్ప పీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. నగరంలో కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు కురువగా మరికొన్ని చోట్ల మోస్తరు వాన పడింది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనూ మోస్తరు వర్షం పడింది. నగరంలో 9.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్‌లోని బేగంపేట వాతావరణ కేంద్రం ప్రకటించింది. అల్పపీడన ప్రభావంతో రాబోయే 24 గంటల్లో నగరంలో పలు చోట్ల వర్షం కురిసే అవకాశాలున్నట్టు పేర్కొంది. ఖమ్మం నగరంతో పాటు పాలేరు. మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలలో సైతం నిరంతరాయంగా వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 32.6 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. అత్యధికంగా పెనుబల్లి మండలంలో 56.8 మి.మీ వర్షం కురిసింది. జనగామ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. జిల్లాలో శనివారం ఒక్కరోజు 120.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో శనివారం మోస్తరు జల్లులు కురిశాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో సగటున 3.6మి.మీ, నాగర్‌కర్నూల్ జిల్లాలో 5.5 మి.మీ, వనపర్తి జిల్లాలో 10.6, జోగుళాంబ గద్వాల జిల్లాలో 4.7 నమోదైనట్టు అధికారులు తెలిపారు. వరంగల్ అర్బన్ జిల్లా వ్యాప్తంగా 6.5 సెంటీమీటర్ల వాన పడింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆదివారం వర్షం కురిస్తే పలు చెరువులు అలుగుపారే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. మహబూబాబాద్ జిల్లా అంతటా వర్షం కురిసింది. కొత్తగూడ మండలంలో బుర్కపెల్లి వాగు, వంతెన వాగులు కాజేవేలపై నుంచి పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 282.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. ఏజెన్సీలో కొన్ని మండలాల ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏటూరునాగారం ఏజెన్సీలో అత్యధికంగా 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్-భూపాలపట్నం 163 జాతీయ రహదారిలో గోవిందరావుపేట మండలం పస్రా వద్ద ఉన్న సల్ల ఒర్రె బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహించడంతో మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ బ్రిడ్జి వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా పస్రా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ములుగు మండలం రాయినిగూడెం-దుబ్బగూడెం గ్రామాల మధ్య కల్వర్టు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మంగపేట మండలం మల్లూరు గ్రామం వద్ద ఉన్న నర్సింహసాగర్ ప్రాజెక్టు ఎడుమ కాలువకు గండి పడింది. వాజేడు మండల పరిధిలోని బొగత జలపాతం వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరంగల్ రూరల్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఖానాపూర్ మండలంలోని పాకాల సరస్సులో నీటి మట్టం క్రమంగా పెరుగుతున్నది. కరీంనగర్ జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. హుజూరాబాద్, జమ్మికుంటలో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. ఆసిఫాబాద్ జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తిగా వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సగటున 23 మండలాల్లో 41.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల వద్ద సీతమ్మవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నారచీరెల ప్రాంతం నీట మునిగిపోయింది. సూర్యాపేట జిల్లాలో సగటున 1.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లాలో 7 సెంటీమీటర్ల వాన పడిందని అధికారులు చెప్పారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 64.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 9.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లాలో 5.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లో కురిసిన వర్షానికి కుంటలు నిండి జలకళ సంతరించుకున్నాయి.వేములవాడ వీధులు జలమయమయ్యాయి. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. మెదక్ జిల్లాలో సగటున 1.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.



జలమయమైన హన్మకొండ బస్టాండ్ - ఇండోర్ స్టేడియం రోడ్డు

జలదిగ్బంధంలో కానిస్టేబుల్..

ములుగు మండలం పంచోత్కులపల్లి గ్రామం వద్ద కాజ్‌వే దాటే ప్రయత్నంలో వరద ఉధృతికి పోలీసు కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు ఒర్రెలో పడిపోయాడు. కొద్దిదూరం కొట్టుకుపోయిన ఆయనను వెంట ఉన్న పోలీసులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. మంగపేట పోలీసు స్టేషన్‌లో పనిచేసిన ఏఎస్సై సారయ్య శుక్రవారం గుండెపోటుతో మరణించడంతో ఆయన స్వగ్రామమైన రాయినిగూడెంలో అంత్యక్రియలు జరిగాయి. పోలీసు అధికారులు, సిబ్బంది అంత్యక్రియలకు తరలివెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. నాగేశ్వర్‌రావు వరంగల్ రూరల్ జిల్లా నల్లబెల్లి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.



మణుగూరు ఓసీలోకి చేరిన వరద నీరు

వర్షంతో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, టేకులపల్లి ప్రాంతాల్లో ఉన్న సింగరేణి ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో ఉత్పత్తికి ఆటంకం కలిగింది. సుమారు 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయిందని సింగరేణి అధికారులు తెలిపారు.

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	3003	3003	1705	1704.72	128.72	128.19
నారాయణపూర్	2055	582	1615	1607.71	37.646	28.18
జూరాల	2232	2591	1045	1038.94	9.66	6.202
తుంగభద్ర	4394	930	1633	1617.87	100.86	52.65
శ్రీశైలం	2242	40	885	780.50	215.807	20.56
నాగార్జునసాగర్	865	865	590	500.30	312.045	115.785
పులిచింతల	804	0	175	119.26	45.77	3.62
ప్రకాశం బ్యారేజీ	9184	9184	54.95	55.75	3.070	2.75



(జూన్1 నుంచి ఇప్పటివరకు 391.112 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	0	2455	1522	1511.31	102.732	64.00
కడెం	217	629	700	684.98	7.6	4.303
ఎస్సారెస్పీ	500	174	1091	1054.90	90.313	9.214
సింగూరు	0	355	1717.93	1708.60	29.91	17.50
నిజాంసాగర్	253	60	1405	1380.66	17.803	1.430
ఎల్లంపల్లి	1018	418	485	473.16	20.175	11.10
లోయర్‌మానేరు	0	129	920	893.50	24.07	7.333
ధవళేశ్వరం	79245	79477	45	45	2.93	2.93



సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి వద్ద విప్రహిత భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ సతీశ్‌కుమార్ తదితరులు

విద్యా వికాస కేంద్రంగా విప్రహిత భవన్

విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, నమస్తేతెలంగాణ ప్రతినిధి: విప్రహిత బ్రాహ్మణ సదనాన్ని ఆధ్యాత్మిక, విద్యా వికాస కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి వద్ద 65వ జాతీయ రహదారి పక్కన తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న విప్రహిత బ్రాహ్మణ సదనానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ డాక్టర్ కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి సముద్రాల వేణుగోపాలాచారి తదితరులతో కలిసి మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం సూర్యాపేటలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో బ్రాహ్మణులకు అత్యంత గౌరవమిచ్చి సత్కరిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతున్నదన్నారు. అన్నివర్గాల వారి సంస్కృతులు, సంప్రదాయాలను గౌరవించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరువ తీసుకుంటున్నదన్నారు.




మహబూబ్‌నగర్ జిల్లా లింగారంలో చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

ప్రైవేటుకు దీటుగా సర్కారు వైద్యం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి

రాజాపూర్: ప్రైవేటుకు దీటుగా సర్కారు దవాఖానల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సీ లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం హేమాజీపూర్‌లో శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో మంత్రి పాల్గొని పరీక్షలు నిర్వహించారు. లింగారం, గాంధీపాలెంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు టీకాలు వేశారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చొరువతో ప్రభుత్వ దవాఖానలను ఆధునీకరించి కార్పొరేట్ తరహా వైద్య సేవలందిస్తున్నామన్నారు.



నిర్మల్ జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

దళారులు లేని రాష్ట్రంగా తెలంగాణ

రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్, నమస్తే తెలంగాణ: విత్తనాల కొనుగోళ్లు మొదలుకొని పంటలు అమ్ముకునే దాకా రైతుల వెంటపడి దోచుకుతినే దళారీ వ్యవస్థను రూపుమాపడంలో తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించిందని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్మించనున్న షాపింగ్‌కాంప్లెక్స్‌కు శనివారం ఆయన భూమిపూజ చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దళారుల బారిన పడకుండా రైతులను కాపాడేందుకు మార్కెట్ యార్డులను బలోపేతం చేస్తున్నామన్నారు. సరుకుల నిల్వ కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి గోదాములను నిర్మిస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలతో రాష్ట్ర ముఖచిత్రమే మారిపోయిందన్నారు. దేశంలోనే విద్యుత్ కోతలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. సందర్భంగా మంత్రి సమక్షంలో దిలావర్‌పూర్ మండలానికి చెందిన 500 మంది మైనార్టీలు టీఆర్‌ఎస్‌లో చేరారు.

ప్రాజెక్టులకు జలకళ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టు గేట్లు ఎత్తిన దృశ్యం

న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని మధ్యతరహా ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టు నీటి మట్టం ప్రస్తుతం 71.20 మీటర్లుగా ఉంది. ఇన్‌ఫ్లో 12వేల క్యూసెక్కులుగా నమోదవుతున్నది. శనివారం ఉదయం నీటి మట్టం 71.30 మీటర్లకు చేరడంతో పది గేట్లు ఎత్తి 30 వేల క్యూసెక్కులను గోదావరిలోకి విడుదల చేశారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్‌లో నీటి మట్టం 406.2 అడుగులకు చేరుకుంది. మూడు గంటలకు రెండు గేట్లు ఎత్తి పదివేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఒక గంటలోనే గేట్లను మూసివేశారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 1500 క్యూసెక్కులుగా ఉంది. నీటి మట్టం పెరిగితే మళ్లీ గేట్లు ఎత్తే అవకాశం ఉంది. అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టు నీటి మట్టం 21 అడుగులు దాటడంతో ఒక గేటును మీటరు ఎత్తు కు ఎత్తి 2840 క్యూసెక్కుల నీటిని విడుదల చే శారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లిలోని శ్రీపాదసాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతున్నది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, 11.1302 టీఎంసీల నిల్వకు చేరింది. గోదావరిలోకి ఎగువ నుంచి 1325 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల ప్రాజెక్టులోకి 133.49 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. నిర్మల్ జిల్లాలోని కడెం జలాశయానికి 217 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 684.975 అడుగుల నీరుంది.

5లోగా బతుకమ్మ చీరలు సిద్ధం చేయాలి



సిరిసిల్ల, నమస్తేతెలంగాణ: బతుకమ్మ చీరల ఉత్పత్తులను సెప్టెంబర్ 5లోగా ప్రభుత్వానికి అందించాలని చేనేత జౌళిశాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్ అన్నారు. ప్రభుత్వం రూపొందించిన క్యాలండర్ ప్రకారమే వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు సిరిసిల్లకే ఇస్తామన్నారు. పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘ భవనంలో శనివారం మ్యాక్స్ సొసైటీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గడువులోగా బతుకమ్మ చీరలు అందించాలని వస్త్ర ఉత్పత్తిదారులకు సూచించారు. ఇప్పటివరకు రూ.6.11 కోట్ల విలువైన 2.75 కోట్ల మీటర్ల వస్త్రాలు తయారు చేసినట్టు చెప్పారు. బయటి నుంచి 2.36 కోట్ల మీటర్లు కొనుగోలు చేస్తున్నామన్నారు.



రైలు కిందపడి 58 గొర్రెలు మృతి

రామగుండం రూరల్: రైలు కిందపడి 58 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. పెద్దపల్లి జిల్లా రామగుండం-రాఘవాపూర్ రైల్వేస్టేషన్ల మధ్య కిలోమీటర్ నంబర్ 294 వద్ద గూడ్స్ బండి వేగంగా ఢీ కొనడంతో గొర్రెలు మృతిచెందాయి. మహబూబ్‌నగర్ నుంచి గొర్రెల కాపర్లు మందలతో బుగ్గ అటవీ ప్రాంతం వైపు వలస వచ్చారు. రాజీవ్‌రహదారి నుంచి బుగ్గ అడవి వైపు గొర్రెలు ట్రాక్ దాటుతుండగా ఈ దుర్ఘటన జరిగింది.

మీ జలయజ్ఞంలో పూర్తయిన ప్రాజెక్టేదీ?

- 34 ప్రాజెక్టుల్లో ఒక్కటీ పూర్తి చేయలేదు
- కాంగ్రెస్‌పై మంత్రి హరీశ్‌రావు మండిపాటు
- సాగును పండుగ చేసేందుకు సీఎం కృషిచేస్తున్నారని వెల్లడి

మెదక్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: జలయజ్ఞంలో భాగంగా గత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో 34 ప్రాజెక్టులను నిర్మించాలని నిర్ణయించి పదేండ్లు అయినా ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తిచేయలేకపోయిందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. స్వరాష్ట్రంలో సాగును పండుగ చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేస్తున్నారని తెలిపారు. శనివారం మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో భారీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరైన మంత్రి హరీశ్‌రావు కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. పదేండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేయకుండా, అనుమతులు తేకుండా మధ్యలోనే వదిలేశారని మండిపడ్డారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టులను పూర్తిచేసుకుంటూ రైతులకు సాగు నీరందిస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఖమ్మంలోని పాలెంవాగు, కిన్నెరసాని ప్రాజెక్టులను తమ ప్రభుత్వమే పూర్తిచేసి నీళ్లందిస్తున్నదన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో దశాబ్దకాలంగా పెండింగ్‌లోఉన్న ఐదు ప్రాజెక్టులను పూర్తిచేసి ఏడులక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు సిద్ధంగా ఉన్నామని, మెదక్ జిల్లాలోని సింగూరు లిఫ్టు ఇరిగేషన్ పథకంతోపాటు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ఐదు ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామని మంత్రి వివరించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఐదు మధ్యతరహా ప్రాజెక్టులు పూర్తిచేసి సాగునీరందిస్తున్నట్టు చెప్పారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగునీటి రంగానికి పెద్దపీట వేయడంతో మెదక్ జిల్లాలోని అన్నాసాగర్, అందోల్ చెరువు కింద ఎక్కడ చూసినా వరినాట్లు కనిపిస్తున్నాయని, వర్షాలు బాగా కురిసి రైతులు బాగుండాలని దేవుడిని మొక్కుకున్నట్టు హరీశ్‌రావు వెల్లడించారు. సింగూరు ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగిలో 35 వేల ఎకరాలకు నీరందించామని, వానకాలం 40 వేల ఎకరాలకు నీరందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార సంస్థ మాజీ చైర్మన్ విగ్రాం రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో భారీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనలో మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తదితరులు



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాబ్ మేళాలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి దత్తాత్రేయ

'నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం'

వినాయక్‌నగర్/నిజామాబాద్ స్పోర్ట్స్: నిరుద్యోగులకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నదని కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని హరిచరణ్ మార్వాడీ హైస్కూల్‌లో శనివారం కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబామేళాను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేళాలో 150 కార్పొరేట్ కంపెనీలు, 5 జాతీయ బ్యాంకులు పాల్గొన్నాయని తెలిపారు. పెద్దపెద్ద కంపెనీలు, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పించడానికి కృషిచేస్తున్నట్టు చెప్పారు. ఈ మేళాకు 3500 మంది హాజరయ్యారు.

జీఎస్టీ రిటర్నుల ఫైలింగ్ గడువు 25వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 19: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) హయాంలో తొలి రిటర్నుల ఫైలింగ్‌తోపాటు పన్ను చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో ఐదు రోజుల సమయం ఇచ్చింది. తొలుత ప్రకటించిన ప్రకారం ఈనెల 20తో ముగియనున్న గడువును 25 వరకు పొడిగించింది. డెడ్‌లైన్ ముంచుకు రావడంతో భారీ సంఖ్యలో పన్ను చెల్లింపుదారులు రిటర్నులు దాఖలు చేసేందుకు ప్రయత్నించారు. ఏకకాలంలో చాలామంది లాగిన్ కావడంతో లోడ్ అనూహ్యంగా పెరిగి శనివారం ఉదయం నుంచి జీఎస్టీఎన్ పోర్టల్ మొరాయించింది. ఫలితంగా పన్ను చెల్లింపుదారులు రిటర్నుల ఫైలింగ్‌లో తీవ్ర ఇబ్బందులెదుర్కోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో రిటర్నుల ఫైలింగ్‌కు మరింత సమయం కల్పించేందుకు గడువు తేదీని పొడిగించినట్లు తాజా స్టేట్‌మెంట్‌లో ఆర్థిక శాఖ పేర్కొంది. వరద ప్రభావిత రాష్ట్రాలతోపాటు జమ్ము అండ్ కశ్మీర్ కూడా గడువు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. ట్రాన్స్ 1 ఫామ్ ఫైలింగ్ ద్వారా గతంలో చెల్లించిన పన్నులపై ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్ చేయదలుచుకున్నవారికి మాత్రం జీఎస్టీ రిటర్నుల దాఖలుకు ఈనెల 28వరకు అవకాశం ఉంటుంది.

జీఎస్టీలోకి కొత్తగా 59వేల దరఖాస్తులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జీఎస్టీ చట్టం కింద రాష్ట్రంలో కొత్తగా దాదాపు 59,660 మంది దరఖాస్తు చేసుకున్నట్టు రెవెన్యూ (వాణిజ్య పన్నులు, ఆబ్కారీ) ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ వెల్లడించారు. 47వేల మంది జీఎస్టీ కింద నమోదయ్యారని చెప్పారు. వ్యాట్ కింద 2.16 లక్షల మంది డీలర్లు నమోదై ఉండగా, ఇప్పటికే జీఎస్టీలోకి 1,96,000 మంది మారారని తెలిపారు. మిగతావారు వార్షిక టర్నోవర్ రూ.20లక్షల లోపు ఉన్నవారు కావచ్చన్నారు. వ్యాట్‌లో నమోదైన వారితో పోలిస్తే జీఎస్టీ కింద కొత్తగా 59వేల మంది రిజిస్టరయ్యారని వివరించారు.

డార్జిలింగ్‌లో పేలుడు.. పలు దుకాణాలు ధ్వంసం

కోల్‌కతా, ఆగస్టు 19: డార్జిలింగ్‌లోని గూర్ఖా జనముక్తి మోర్చా (జీజేఎం) కార్యాలయానికి సమీపంలోని ఓల్డ్ సూపర్ మార్కెట్ ఎదుట శుక్రవారం రాత్రి పేలుడు చోటు చేసుకున్నది. పేలుడు ధాటికి పలు దుకాణాలు ధ్వంసమయ్యాయి. ఎవరికీ గాయాలు కాలేదు. ఎస్పీ అఖిలేశ్ చతుర్వేది ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీసు బలగాలు ఘటనా స్థలికి చేరుకుని చుట్టుపక్కల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాయి. పేలింది ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ) అని ప్రాథమిక విచారణలో తేలిందని, స్థానిక నేరస్థులే పేలుడుకు పాల్పడినట్టు తెలుస్తున్నదని సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. ఘటనాస్థలి నుంచి ఫోరెన్సిక్ విభాగం నమూనాలు సేకరించినట్టు పేర్కొన్నారు. గూర్ఖాలాండ్‌ను ప్రత్యేక రాష్ట్రం చేయాలని జీజేఎం చేస్తున్న డిమాండ్‌తో డార్జిలింగ్‌లో గత రెండునెలలుగా నిరవధిక సమ్మె కొనసాగుతున్నది.

భారత్-చైనా బాహాబాహీ



ఈ నెల 15న లడఖ్‌లో భారత, చైనా సైనికులు పరస్పరం తలపడ్డారు. ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకున్నారు. ముష్టిఘాతాలు కురిపించుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో శనివారం మీడియాకు వెల్లడయ్యింది. ఘర్షణ జరిగిన సమయంలో ఇరువైపులా దాదాపు 60 మంది జవాన్ల చొప్పున ఉన్నారని సమాచారం. ఆగస్టు 15న భారత్ స్వాతంత్ర్య సంబురాలు జరుపుకొంటున్న సమయంలో.. చైనా సైనికులు భారత భూభాగంలోకి చొరబడటానికి ప్రయత్నించటంతో ఈ ఘర్షణ తలెత్తింది. దాదాపు రెండు గంటల తర్వాత సద్దుమణిగింది.

గోరఖ్‌పూర్ పిక్నిక్ స్పాట్ కాదు

- రాహుల్, అఖిలేశ్ పర్యటనపై సీఎం యోగి ఫైర్



గోరఖ్‌పూర్, ఆగస్టు 19: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఎస్పీ జాతీయ అధ్యక్షుడు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌పై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల గోరఖ్‌పూర్ దవాఖానలో 71 మంది చిన్నారులు మృతిచెందిన నేపథ్యంలో రాహుల్, అఖిలేశ్ అక్కడ పర్యటించి ప్రభుత్వాన్ని విమర్శించడంతో యోగి ఎదురుదాడి చేశారు. యువరాజు (రాహుల్) ఢిల్లీలో, అఖిలేశ్ లక్నోలో కూర్చొని గోరఖ్‌పూర్‌ను విహారయాత్రా ప్రదేశం (పిక్నిక్ స్పాట్) చేయాలని భావిస్తున్నారని మండిపడ్డారు. శనివారం స్వచ్ఛ ఉత్తరప్రదేశ్ కార్యక్రమం ప్రారంభించిన అనంతరం యోగి మాట్లాడుతూ.. రాహుల్, అఖిలేశ్‌కు పరిశుభ్రతకు ఉన్న ప్రాధాన్యం ఏమాత్రం తెలియదన్నారు. వారు గోరఖ్‌పూర్ వచ్చి విహారయాత్ర చేయడాన్ని అనుమతించబోమని స్పష్టంచేశారు. గోరఖ్‌పూర్ ప్రమాద ఘటనలో చనిపోయిన చిన్నారుల కుటుంబాలను కాంగ్రెస్ నేతలు కలిసిన కొద్ది గంటలకే రాహుల్‌గాంధీని యోగి విమర్శించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. గోరఖ్‌పూర్ గురించి పట్టించుకోవాలంటే ఇక్కడున్న వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని యోగి సూచించారు. అయితే యోగి వ్యాఖ్యలను యూపీ కాంగ్రెస్ చీఫ్ రాజ్‌బబ్బర్ తోసిపుచ్చారు. గోరఖ్‌పూర్‌లో రాహుల్ పర్యటించడంతో యోగి భయపడుతున్నారని ఆరోపించారు

అవును అది హత్యా ప్రదేశం!

- యోగి వ్యాఖ్యలను తిప్పికొట్టిన కాంగ్రెస్



గోరఖ్‌పూర్ బాధితులతో మాట్లాడుతున్న రాహుల్

న్యూఢిల్లీ, ఆగస్టు 19: గోరఖ్‌పూర్ పిక్నిక్ స్పాట్ (విహారయాత్ర ప్రదేశం) కాదు హత్యల ప్రదేశమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. నాయకులంతా సందర్శించడానికి గోరఖ్‌పూర్ పిక్నిక్‌స్పాట్ కాదు అన్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ తిప్పి కొట్టింది. ఏఐసీసీ ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ శనివారం మీడియాతో మాట్లాడుతూ, గోరఖ్‌పూర్‌లో వైద్యపరమైన నిర్లక్ష్యంపై జరుగుతున్న చర్చను ముఖ్యమంత్రి చిల్లర రాజకీయాల స్థితికి దిగజార్చారని విమర్శించారు. ఎంతో దయనీయమైన, విషాదకరమైన పిల్లల మరణాలను కేవలం రాహుల్ గాంధీపై రాజకీయంగా పైచేయి సాధించేందుకు ఆదిత్యనాథ్ కువిమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గోరఖ్‌పూర్‌ను విహారయాత్రా ప్రదేశంగా కాకుండా నిర్లక్ష్యంతో హత్యల ప్రదేశంగా మార్చివేశారని సింఘ్వీ విమర్శించారు.

ప్రభుత్వం సృష్టించిన విషాదం : రాహుల్‌గాంధీ

గోరఖ్‌పూర్ దవాఖానలో పిల్లల మరణాలను 'ప్రభుత్వం సృష్టించిన విషాదం' అని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ అంశాన్ని సీఎం ఆదిత్యనాథ్ కప్పిపుచ్చుకోలేరని పేర్కొన్నారు. ఆక్సిజన్ కొరత కారణంగానే తమ పిల్లలు మరణించారని తాను కలుసుకున్న తల్లిదండ్రులందరూ చెప్పారని రాహుల్ అన్నారు. ముఖ్యమంత్రి ఈ అంశాన్ని కప్పిపుచ్చకుండా దోషులపై చర్య తీసుకోవాల్సిందేనన్నారు.


ఔరంగాబాద్‌లో 'వందేమాతరం'పై గొడవ

- ఆలపించే సమయంలో లేచి నిలబడని ఎంఐఎం కార్పొరేటర్లు
- చర్యలు తీసుకోవాలని శివసేన, బీజేపీ డిమాండ్

ఔరంగాబాద్, ఆగస్టు 19: మహారాష్ట్రలోని ఔరంగాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎఎంసీ)లో 'వందేమాతరం' ఆలపించే సమయంలో ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు లేచి నిలబడకపోవడంతో అధికార శివసేన-బీజేపీ, ప్రతిపక్ష ఎంఐఎం పార్టీ మధ్య గొడవ జరిగింది. శనివారం మధ్యాహ్నం ఎఎంసీలో సాధారణ సమావేశం జరిగేముందు 'వందేమాతరం' రికార్డు వేశారు. ఈ సమయంలో మేయర్ సహా కార్పొరేటర్లు, అధికారులు లేచి నిల్చోగా ఇద్దరు ఎంఐఎం సభ్యులు మాత్రం అలాగే కూర్చొని ఉన్నారు. జాతీయ గేయం ముగిశాక శివసేన, బీజేపీ సభ్యులు వారిద్దరి ప్రవర్తనను తప్పుపట్టారు. వారిపై చర్యలు తీసుకోవాలని గొడవకు దిగారు. ఈ క్రమంలో ఎంఐఎం సభ్యులకు శివసేన, బీజేపీ సభ్యులకు మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో ఎవరికీ ఎలాంటి గాయం కాలేదు కానీ కొన్ని మైక్రోఫోన్లు మాత్రం ధ్వంసమైనట్లు తెలుస్తున్నది. పాలకపక్షం డిమాండ్ మేరకు మేయర్ బాపు గదమోద్ ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లను ఒకరోజు సస్పెండ్‌చేశారు.

యడ్యూరప్ప అవినీతి కేసులో కొత్త ట్విస్ట్

- ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యమివ్వాలని ఏసీబీ ఒత్తిడి తెస్తుందన్న కేఏఎస్ అధికారి



బెంగళూరు, ఆగస్టు 19: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప అవినీతి కేసులో కొత్త ట్విస్ట్. యడ్యూరప్పకు వ్యతిరేకంగా సాక్ష్యమివ్వాలని తనపై ఏసీబీ ఒత్తిడి తెచ్చిందని కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఒకరు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన రాష్ట్ర సీఎస్, మానవ హక్కుల కమిషన్, డీవోపీటీ శాఖలకు లేఖలు పంపించారు. గృహ నిర్మాణ ప్రాజెక్టు భూమిని డీనోటిఫై చేయడంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ యడ్యూరప్పకు అవినీతి నిరోధకశాఖ సమన్లు జారీచేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో అనుకూలంగా సాక్ష్యమివ్వాలని తనపై ఏసీబీ అధికారులు ఒత్తిడి తెచ్చారని కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (కేఏఎస్) ఆఫీసర్ హెచ్ బసవరాజేంద్ర ఆరోపించారు. తనపై ఏవిధంగా ఒత్తిడి తెచ్చారో వివరిస్తూ రాసిన లేఖను రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, సిబ్బంది పరిపాలనా సంస్కరణలశాఖలకు పంపించారు. యడ్యూరప్ప ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో శివరామ కారంత్ లేఔట్ కోసం చట్టవిరుద్ధంగా 257 ఎకరాల భూమిని డీనోటిఫై చేస్తూ ఆదేశాలు జారీచేశారని అబద్ధం చెప్పాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. దానికి తాను నిరాకరించడంతో ఈ కేసులో తనను సహ నిందితుడిగా చేరుస్తామని ఏసీబీ డిప్యూటీ ఎస్పీ జేకే ఆంథోని బెదిరించారని ఆరోపించారు. ఆయన తనకు గురువారం ఫోన్‌చేశారని, ఈ కేసులో నిందితుడిగా శనివారం హాజరుకావాలని తెలిపారని బసవరాజేంద్ర చెప్పారు. కాగా, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో తప్పుడు కేసులు బనాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏసీబీని వాడుకుంటున్నదని యడ్యూరప్ప ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా పదేండ్లనాటి కేసును మళ్లీ తిరుగతోడుతున్నదని, అయినా, తాను బెదురబోనని అన్నారు.

మేలైన పశుగ్రాసం విత్తనాల ఉత్పత్తి

గడ్డిజాతుల సాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం

- వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ నిర్ణయం
- కార్యాచరణకు కమిటీ ఏర్పాటు
- వివిధ విభాగాల అధికారులతో మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారథి సమావేశం



శనివారం సచివాలయంలో మేలైన పశుగ్రాసం విత్తనాల ఉత్పత్తిపై వివిధ విభాగాల అధిపతులతో చర్చిస్తున్న వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యదర్శి సీ పార్థసారథి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వినూత్న పథకాలకు ఊతమిచ్చే విధంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో నాణ్యమైన పశుగ్రాసం లభ్యతకు వాటి విత్తనాల ఉత్పత్తిని పెంచాలని, ఇందుకు మేలైన గడ్డిజాతుల పెంపకాన్ని పెద్ద ఎత్తున పోత్సహించాలని నిర్ణయించింది. ఇందుకు కార్యాచరణ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ అంశంపై వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారథి శనివారం సచివాలయంలో వివిధ విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాణ్యమైన విత్తన సరఫరాలో ప్రతి ఏటా కనీసం 20 శాతం అభివృద్ధి సాధించాలని వారితో చెప్పారు. ప్రభుత్వ రంగంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మేలైన సంకరజాతి గడ్డి విత్తనాలు అభివృద్ధి చేయాలన్నారు. టీఎస్ఎస్డీసీ, ఆర్ఎఫ్ఎస్ ఫౌండేషన్ ద్వారా మూల విత్తనాలు ఉత్పత్తి చేయాలని, ప్రైవేటు రంగంలో ధ్రువీకరణ విత్తనాల ఉత్పత్తి చేసి పాడి పరిశ్రమకు, గొర్రెల పెంపకందారులకు సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర విత్తన , సేంద్రీయ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ డైరెక్టర్ డాక్టర్ కే కేశవులు రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జాతీయ జీడీపీలో 12 శాతం వ్యవసాయం, 21 శాతం పాడి పరిశ్రమరంగాలదని తెలిపారు. నాణ్యమైన విత్తనంతో అధిక పశుగ్రాస దిగుబడులు సాధించి పాడి పశువులు, గొర్రెలు, మేకల సంపద పెంచవచ్చునన్నారు. రాష్ట్రంలో 2.6 కోట్ల పశుసంపద ఉన్నా, 2 శాతం మాత్రమే నాణ్యమైన పశుగ్రాస విత్తన సరఫరా జరుగుతున్నదని తెలిపారు. నాణ్యమైన పశుగ్రాసం సరఫరాలో 66 శాతం లోటున్నదన్నారు. పశు సంవర్ధకశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాణ్యమైన పశుగ్రాస విత్తనం దొరుకడం లేదన్నారు. ఏటా 10వేల క్వింటాళ్ల పశుగ్రాసం విత్తనాలను రూ.10 కోట్లు వెచ్చించి టెండర్ల ద్వారా సేకరించి 75 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ జగన్ మోహన్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ, పశుసంవర్ధక శాఖ, టీఎస్ఎస్డీసీ విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

కార్యాచరణ కమిటీ ఏర్పాటు.. 22న భేటీ

రాష్ట్రంలో విత్తనాభివృద్ధికి ఉన్న అనుకూల నేలలు, వాతావరణ పరిస్థితులను ఉపయోగించుకొని నాణ్యమైన పశుగ్రాస విత్తన ఉత్పత్తి చేపట్టేందుకు వీలుగా వ్యవవసాయశాఖ కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సంబంధిత అన్ని విభాగాలను సమన్వయపరుస్తుంది. ఈ కమిటీ భేటీ 22న జరుగనుంది.



యాదాద్రి ఆలయ అధికారులతో మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి

యాదాద్రిపై విమానగోపురం నమూనాకు

చినజీయర్‌స్వామి సమ్మతి

యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ప్రతిపాదిత యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి గర్భాలయ విమాన గోపుర నిర్మాణానికి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి తన సమ్మతిని తెలిపారు. పాంచరాత్రాగమానుసారం వాస్తుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్మాణం చేయడానికి ఆయన పలు సూచనలు చేశారు. శంషాబాద్‌లో చాతుర్మాస దీక్షలో ఉన్న చినజీయర్‌స్వామిని శనివారం యాదాద్రి ఈవో ఎన్ గీత, స్థపతులు, ఇంజినీరింగ్ నిపుణులు కలిసి యాదాద్రిలో చేపట్టనున్న నిర్మాణాలపై చర్చించారు. ప్రస్తుతమున్న విమానగోపురం, సుదర్శన చక్రంలోని యంత్రం భద్రపరిచే విషయమై సూచనలు చేశారు. గర్భాలయ విమాన గోపురం నిర్మాణం ఎంతో క్లిష్టమైన పని అయినందున ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలన్నారు. విమానగోపురంపైన గల కలశాన్ని తీసి భద్రపర్చాలని, 55 ఫీట్ల ఎత్తులో ఐదు అంచెల విమానగోపురం నిర్మించిన తరువాత దానిపై తిరిగి యంత్ర ప్రతిష్ఠ చేపట్టాల్సి ఉంటుందని జీయర్ స్వామి తెలిపారు.

నేడు విమానగోపుర నిర్మాణానికి ఫుట్టింగ్స్..

విమానగోపుర నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ముందుగా స్లాబ్ నిర్మించేందుకు టెక్నికల్ కమిటీ సమక్షంలో ఆదివారం ఫుట్టింగ్స్ పనులు మొదలుపెట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఈఎన్‌సీ రవీందర్‌రావు, ప్రొఫెసర్లు రమణ, జయంతి, బాబూరావు, వీఎస్ఎన్ రెడ్డి, కొండల్‌రావు తదితరులు ఆదివారం ఉదయం 8 గంటలకు ఈ పనులను పర్యవేక్షించనున్నారు. ప్రస్తుతం ఉన్న గర్భాలయ గోపురానికి సమాంతరంగా 36 ఫీట్ల ఎత్తులో స్లాబ్ వేసి దానిపైన ఐదు అంచెల విమానగోపురం నిర్మించనున్నారు. ఈ మేరకు చినజీయర్‌స్వామి అనుమతి లభించింది. నిర్మాణం పూర్తయిన తరువాత గోపురాన్ని స్వర్ణమయం చేయనున్నారు. చినజీయర్‌స్వామిని కలిసిన వారిలో ఆలయ ఉప ప్రధానార్చకులు బట్టర్ సురేంద్రాచార్యులు, ఏఈవో దోర్బల భాస్కరశర్మ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన ఉన్నత విద్యకు సర్కారు కృషి

- ప్రమాణాలు పాటించిన ప్రైవేటు డిగ్రీ కాలేజీలకే అఫిలియేషన్లు
- ప్రవేశాలు, ఫలితాల వివరాలతో జాబితాల తయారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రైవేటు డిగ్రీ కాలేజీల ద్వారా నాణ్యమైన విద్య అందించేలా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ చర్యలు మొదలుపెట్టింది. నిబంధనలను పాటించిన ప్రైవేటు డిగ్రీ కాలేజీలకే వచ్చే ఏడాది అఫిలియేషన్లు ఇచ్చేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నది. ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాల్లో ఏయే కళాశాలల్లో ఎన్ని సీట్లు నిండాయి? వాటిని ఎందుకు ఎంపిక చేసుకోలేదు? సీట్లు కేటాయించిన తర్వాత ఎందుకు చేరడంలేదు అన్న అంశాలతోపాటు ఉత్తీర్ణత శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. మూడేండ్లుగా 25 శాతం కంటే తక్కువ ప్రవేశాలు జరిగిన కాలేజీల జాబితాను తయారుచేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు అన్ని వర్సిటీలను ఆదేశించారు. దోస్త్ - 2017 ప్రవేశాల ప్రక్రియ ముగిసిన నెల రోజుల్లో కాలేజీలు, కోర్సులవారీగా 25 శాతం కంటే తక్కువ ప్రవేశాలు ఉన్న కాలేజీల జాబితాను తయారుచేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు పక్కా భవన నిర్మాణాలు, కనీసం మూడు ఎకరాల భూమి ఉండాలన్న నిబంధనలు ఉన్నాయి. ధ్రువపత్రాల దాఖలు సమయంలో కొన్ని కాలేజీలు నకిలీ ధ్రువపత్రాలను ఇస్తున్నాయని విద్యామండలి దృష్టికొచ్చింది. ఈసారి అఫిలియేషన్ సమయంలో పత్రాలను ప్రాంతాలవారీగా రెవెన్యూ అధికారులతో పునః పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మూడోవిడుత సీట్ల కేటాయింపు పూర్తి చేశారు. అందులో 70,808 మందికి సీట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,100 డిగ్రీ కాలేజీల్లో నాలుగులక్షల సీట్లు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం వాటిలో 1.60 లక్షల సీట్లు నిండుతున్నాయని, మిగతా సీట్లు ఖాళీగా ఉన్నాయని దోస్త్ అధికారులు తెలిపారు. కాలేజీలను నియంత్రించి, నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు అభిప్రాయపడ్డారు.



దాడికి పాల్పడిన దుండగుని మృతదేహం వద్ద రష్యా పోలీసు

రష్యాలో కత్తిపోట్లు: ఏడుగురికి గాయాలు

- తమ పనేనన్న ఐఎస్

మాస్కో, ఆగస్టు 19: రష్యాలో ఓ వ్యక్తి కత్తి చేత పట్టుకొని స్వైర విహారం చేశాడు. శనివారం ఉదయం సర్గుట్ సిటీలోని ఒక వీధిలో అతడు ఏడుగురిని పొడిచాడు. దాంతో పోలీసులు ఆ దుండగుని వెంటనే కాల్చి చంపారు. దుండగుని దాడిలో ఇద్దరు తీవ్రంగా, ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. రాజధాని మాస్కోకు ఉత్తరాన 2100 కిలోమీటర్ల దూరంలో సర్గుట్ సిటీ ఉంది. స్పెయిన్, ఫిన్లాండ్ తదితర యూరప్ దేశాల్లో ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ ఉదంతానికి ప్రాధాన్యం ఏర్పడింది. దాడి జరుగగానే సమాచారం అందడంతో స్థానిక పోలీసులు వచ్చి, దుండగుని ముందుగా లొంగిపొమ్మని హెచ్చరించారని, అతను వినకపోవడంతో కాల్చివేశారని పేర్కొన్నారు. దుండగుని దాడిలో గాయపడిన వారిని దవాఖానకు తరలించారు. దాడి చేసిన వ్యక్తి స్థానికుడేనని పోలీసులు చెప్పారు. ఈ దాడి తమపనేనని ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ప్రకటించింది.

దారుణ మోసం

- తక్కువ వడ్డీకే కోటి అప్పు ఇస్తామని రూ.10 లక్షలు వసూలు
- నెల్లూరుకు చెందిన నిందితుడి అరెస్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తక్కువ వడ్డీకే సులభంగా రుణాలిస్తామని నమ్మించి రూ.10 లక్షలు వసూలుచేసిన నిందితుడిని సీఐడీ పోలీసులు శనివారం అరెస్టుచేశారు. ఏపీలోని నెల్లూరు జిల్లా గూడురుకు చెందిన మాలెపాటి హర్షవర్ధన్(27) అప్పు ఇస్తానని మోసం చేసినట్టు గుర్తించారు. అతడు చెన్నైలో కేవీకే హోటల్‌లో ఆంధ్రా సోషల్, కల్చరల్ అసోసియేషన్‌లో స్టోర్‌కీపర్‌గా పని చేస్తున్నాడు. 'నా పేరు ఎస్ ప్రవీణ్‌కుమార్.. మీకు అప్పు కావాలా? అయితే ముందుగా రూ.20వేలు డిపాజిట్ చేస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండానే రూ.కోటి రుణం ఇస్తాం' అని 2015 జనవరి 31న హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి హర్షవర్ధన్ ఫోన్‌చేశాడు. అప్పును ఆశించిన బాధితుడు ఫోన్‌లో చెప్పిన బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేశారు. మూడేండ్లలో రూ.10 లక్షల వరకు బ్యాంకుల్లో వేశారు. తర్వాత హర్షవర్ధన్ ఫోన్ సిచ్ఛాఫ్ చేయడంతో అనుమానం వచ్చి.. హైదరాబాద్ పరిశోధన విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐపీసీ 420, 429 సెక్షన్ల కింద కేసు నమోదుచేసి, దర్యాప్తును సీఐడీ సైబర్ క్రైమ్స్‌కు బదిలీ చేశారు. నిందితుడి 12 ఫోన్‌నంబర్లు, 11 బ్యాంకు ఖాతాల ఆధారంగా సీఐడీ అధికారులు దర్యాప్తు చేశారు. నిందితుడిని హర్షవర్ధన్‌గా గుర్తించి గూడూరులో అరెస్టుచేశామని, బ్యాంకుఖాతాల వివరాలు, మొబైల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నామని సీఐడీ అదనపు డీజీ గోవింద్‌సింగ్ తెలిపారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్

సమాజానికి ఉపయోగపడే ఫొటోలు తీయాలి

సంగారెడ్డి చౌరస్తా: మానవ విలువలు, నైతికత, మర్యాదలను దృష్టిలో పెట్టుకుని ఫొటోలు తీయాలని శాసన మండలి చైర్మన్ కే స్వామిగౌడ్ అన్నారు. సమాజానికి ఉపయోగపడేలా ఫొటోలు చిత్రీకరించాలని సూచించారు. ప్రపంచ ఛాయా చిత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చినా ఫొటోగ్రఫీకి ఉన్న విలువ చెక్కు చెదరలేదన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జెడ్పీ చైర్పర్సన్ రాజమణి మురళీయాదవ్, ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమానికి నిధులు మంజూరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్థికంగా వెనుకబడిన వారి స్కాలర్‌షిప్ మొత్తాన్ని విడుదల చేస్తూ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ శనివారం శాఖాపరమైన అనుమతినిచ్చింది. ప్రస్తుత సంవత్సరంలో రెండోవిడుత రూ.150 కోట్లు విడుదల చేస్తూ దీనికి అదనంగా పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు రూ.51.43 కోట్లు, బీసీ హాస్టళ్ల నిర్వహణకు రూ.14 కోట్లను మంజూరుచేసింది. ప్రిన్సిపల్ కార్యదర్శి అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

ఇంటర్నెట్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆనందోత్సవ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు, యోగాగురువు శ్రీశ్రీ రవిశంకర్ ఇంటర్నెట్ ద్వారా నిర్వహిస్తున్న ఆనందోత్సవ్ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా రెండు వేల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో లక్షమంది పాల్గొనగా, తెలంగాణ రాష్ట్రం నుంచి రెండు వేల మంది ఉన్నారు. హైదరాబాద్‌లోని చందానగర్ నుంచి హయత్‌నగర్ వరకు 50 కేంద్రాలలో యోగావిధానాలపై, మానసిక ఒత్తిడిను జయించడంపై రవిశంకర్ శిక్షణ ఇచ్చారు.



రాత్రివేళ కిరణ్‌బేడీ పర్యటన

పుదుచ్చేరి: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత మరో మహిళతో కలిసి ద్విచక్ర వాహనంపై నగరంలో పర్యటించారు. నగరంలో మహిళల భద్రత ఎలా ఉందో తెలుసుకోవటానికి ఈ పర్యటన జరిపానని.. పరిస్థితులు సంతృప్తికరంగానే ఉన్నాయని శనివారం ట్విట్టర్‌లో కిరణ్‌బేడి వెల్లడించారు. అయితే, ద్విచక్రవాహనాన్ని నడిపిన మహిళతో పాటు, కిరణ్‌బేడీ కూడా హెల్మెట్ ధరించకపోవటంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

ట్రంప్ తీరుతో రాజీనామా

- వైదొలిగిన పీసీఏహెచ్ కమిటీ సభ్యులు

వాషింగ్టన్, ఆగస్టు19: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరుతో మరికొంత మంది రాజీనామా బాటపట్టారు. వర్జీనియాలో జాత్యహంకార హింసపై ట్రంప్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ.. సాంస్కృతిక అంశాలపై వైట్‌హౌస్‌కు సలహాలు ఇచ్చే కళలు, మానవీయశాస్త్రంపై అధ్యక్షుడి కమిటీ (పీసీఏహెచ్) సభ్యులు శుక్రవారం రాజీనామా చేశారు. కమిటీలో 17 మంది ఉండగా ఇద్దరు భారతీయ అమెరికన్లు జుంపా లాహిరి, కాల్ పెన్స్‌తోపాటు మొత్తం 16 మంది రాజీనామా సమర్పించారు. వర్జీనియాలో హింసాత్మక ఘటనపై ట్రంప్ వివాదాస్పదంగా మాట్లాడటం, పారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి బయటకు రావడం వంటి కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్టు లేఖ కూడా రాశారు. 'ఆధిపత్యం, వివక్ష, దుర్భాషలాడటం అమెరికా విలువలు కాదు. మీ విలువలు కూడా అమెరికా విలువలు కావు. మనం ఇంతకన్నా బాగుండాలి. ఇప్పటికీ అర్థంకాకపోతే మీ రాజీనామాకు పిలుపునిస్తాం' అని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఈ కమిటీ సభ్యులంతా ఒబామా హయాంలో నియమితులైన వారే.

జోరు ఎవరిదో..!

నేడు భారత్, లంక తొలి వన్డే

ఆత్మవిశ్వాసంతో కోహ్లీసేన

ఒత్తిడిలో ఆతిథ్య జట్టు



కోహ్లీ

2 ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో లంక రెండు మ్యాచ్‌లు గెలిస్తే ఇతర సమీకరణాలతో అవసరం లేకుండా 2019 వరల్డ్‌కప్‌నకు నేరుగా అర్హత సాధిస్తుంది.

14 లంకతో ఆడిన గత 18 మ్యాచ్‌ల్లో భారత్ 14 గెలిచింది.

4 మరో నాలుగు మ్యాచ్‌లు ఆడితే ధోనీ కెరీర్‌లో 300ల మార్క్‌కు చేరుకుంటాడు. మరో 3 స్టంపింగ్‌లు చేస్తే 100 మార్క్‌ను అందుకుంటాడు.

మ. 2.30 గం. నుంచి సోనీ సిక్స్, సోనీ టెన్-3లో

ఒకరిదేమో భవిష్యత్ లక్ష్యాల కోసం ఆరాటం.. మరొకరిది వరల్డ్ కప్ బెర్త్ కోసం పోరాటం.. ఓవైపు టెస్టు సిరీస్ గెలిచిన ఆనందం.. మరోవైపు సొంతగడ్డపై పరువు పోయిందన్న బాధ.. ఈ నేపథ్యంలో భారత్, శ్రీలంక వన్డే సిరీస్‌కు సిద్ధమయ్యాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగే తొలి వన్డేలో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆటగాళ్ల పరంగా చూసినా, ఫామ్ పరంగా లెక్కలేసినా.. రికార్డులను పరిగణనలోకి తీసుకున్నా.. ఈ మ్యాచ్‌లో విరాట్‌సేన ఫేవరెట్ అన్నది జగమెరిగిన సత్యం. అయితే టెస్టులతో పోలిస్తే చాలా భిన్నంగా ఉండే వన్డే ఫార్మాట్‌లో ఎవరు గెలుస్తారో చెప్పడం కష్టం. మరి ఇలాంటి పరిస్థితుల్లో సొంతగడ్డ అనుకూలతతో లంక చెలరేగుతుందా? యథావిధిగా టెస్టు విజయాల జోరును భారత్ ఇక్కడా కొనసాగిస్తుందా? అన్నది ఆసక్తికరం.

పిచ్, వాతావరణం

వికెట్ మీద పచ్చిక లేదు. ఫ్లాట్‌గా ఉంది. 300ల స్కోరు సవాలు విసిరే లక్ష్యం. వాతావరణం మేఘావృతంగా ఉన్నా వర్షం పడే సూచనల్లేవు. మ్యాచ్‌కు సరిపోయిన ఉష్ణోగ్రత నమోదవుతుంది.

దంబుల్లా స్టేడియం భారత్ జట్టుకు అంత అచ్చి రాలేదు. 2004 నుంచి ఇక్కడ ఆడిన 17 వన్డేల్లో టీమ్‌ఇండియా 9 మాత్రమే గెలిచింది. ఇందులో ద్వైపాక్షిక, ముక్కోణపు సిరీస్, ఆసియా కప్ (2004, 2010) మ్యాచ్‌లు ఉన్నాయి. లంకతో ముఖాముఖి తలపడిన 11 మ్యాచ్‌ల్లో భారత్ నాలుగు మాత్రమే నెగ్గింది. అయితే వీటన్నింటిని మించిన ఓ రికార్డు మాత్రం దంబుల్లాకు ఉంది. అదే భారత్ జట్టు కెప్టెన్ కోహ్లీ.. ఆగస్టు 2008లో ఇదే వేదికపై వన్డేల్లో అరంగేట్రం చేశాడు. సరిగ్గా నాలుగేండ్ల తర్వాత సారథి హోదాలో జట్టును నడిపించబోతున్నాడు.

జట్లు (అంచనా)

భారత్: కోహ్లీ (కెప్టెన్), ధవన్, రోహిత్, రాహుల్, ధోనీ, మనీష్ / కేదార్, హార్దిక్, భువనేశ్వర్, కుల్దీప్, బుమ్రా, అక్షర్ పటేల్.

శ్రీలంక: ఉపుల్ తరంగ (కెప్టెన్), డిక్‌వెల్లా, గుణతిలక, మెండిస్, మాథ్యూస్, కపుగెడెర, హసరంగ, పెరీరా, ధనంజయ, మలింగ, చమీరా.

దంబుల్లా:

అసలే సొంతగడ్డ.. ఆపై మారిన ఫార్మాట్.. అందులోనూ చాంపియన్స్ ట్రోఫీలో ఓడించామన్న ఆత్మవిశ్వాసం.. దీనికి తోడు కొత్త కెప్టెన్.. సరికొత్త వ్యూహాలు.. ఇలా రకరకాల ఆలోచనల మధ్య శ్రీలంక. టెస్టుల్లో వరుస విజయాలు.. సూపర్ ఫామ్‌లో ఆటగాళ్లు.. గాయాల బెడద లేదు.. ఇక మిగిలింది 2019 వరల్డ్‌కప్ కోసం తుది జట్టును ఖరారు చేసుకోవాలన్న ఏకైక లక్ష్యంతో భారత్. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య దంబుల్లాలో నేడు తొలి వన్డే జరుగనుంది. చూడటానికి ఇది ద్వైపాక్షిక సిరీస్ లాగే కనిపిస్తున్నా.. టీమ్‌ఇండియా మాత్రం ఈ సిరీస్‌ను ప్రయోగాలకు వేదికగా మలుచుకోవాలని భావిస్తున్నది. ఆటగాళ్ల ఫిట్‌నెస్, బ్యాటింగ్ లైనప్, రిజర్వ్ బెంచ్ సత్తా, తుది జట్టు కూర్పు, సీనియర్ల ఆటపై దృష్టి.. ఇలా ఒక్కో అంశాన్ని నిశితంగా పరిశీలించాలని మేనేజ్‌మెంట్ పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనికి తోడు చాంపియన్స్ ట్రోఫీలో ఎదురైన పరాజయానికి సిరీస్ గెలుపుతో లెక్క సరిచేయాలని భావిస్తున్నది.

తుది జట్టులో ఎవరెవరు?

ప్రస్తుతం జట్టులో ఉన్న ఆటగాళ్లందరూ మంచి ఫామ్‌లో ఉండటంతో తుది జట్టు ఎంపిక కాస్త క్లిష్టంగా మారింది. కెప్టెన్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి దీనిపై కసరత్తులు చేస్తున్నా ఇంకా కొలిక్కి రాలేదు. పిచ్ స్వభావాన్ని బట్టి ఐదుగురు బౌలర్ల వ్యూహానికి కట్టుబడితే తుది జట్టులో ఎవరెవరు ఉంటారన్నది ఆసక్తికరంగా మారింది. రోహిత్, ధవన్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తారు. రహానేను రిజర్వ్ ఓపెనర్‌గా కొనసాగించే అవకాశాలున్నాయి. కోహ్లీకి మూడోస్థానం ఖాయం. ఇక రాహుల్ నాలుగోస్థానంలో ఆడుతాడని మేనేజ్‌మెంట్ ఇప్పటికే ప్రకటించింది. ధోనీకి ఐదోస్థానాన్ని కేటాయించారు. పేసర్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు రానున్నాడు. దీంతో ఆరోస్థానం కోసం మనీష్ పాండే, కేదార్ జాదవ్ మధ్య గట్టి పోటీ నెలకొంది. చివరి రెండు సిరీస్‌ల్లో పెద్దగా రాణించలేకపోయిన జాదవ్.. ఫీల్డింగ్‌లో వెనుకబడటం ప్రతికూలాంశం. అయితే చాంపియన్స్ ట్రోఫీ, విండీస్ టూర్‌లో బంతితో మెరిసినా దీనిని ఎంత మేరకు పరిగణనలోకి తీసుకుంటారో చూడాలి. దక్షిణాఫ్రికా టూర్‌లో రాణించడం మనీశ్‌కు అనుకూలాంశం. జాదవ్ లేకపోతే పార్ట్ టైమ్ బౌలర్లు రోహిత్, కోహ్లీలను ప్రత్యామ్నాయంగా పెట్టుకున్నారు. భువనేశ్వర్, బుమ్రా పేస్ బౌలింగ్ బాధ్యతలు పంచుకోనున్నారు. చైనామెన్ కుల్దీప్‌కు తోడు రెండో స్పిన్నర్ కోసం అక్షర్ పటేల్, చాహల్ మధ్య పోటీ ఉంది.


తరంగ

ఇద్దరిపైనే ఆశలు..

మరోవైపు టెస్టు సిరీస్ కోల్పోయిన లంక ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో ఉంది. దీంతో పాటు 2019 వరల్డ్‌కప్‌నకు నేరుగా అర్హత సాధించాలంటే కచ్చితంగా రెండు మ్యాచ్‌లు గెలువాల్సిన పరిస్థితి. భారత్ టూర్ కంటే ముందు జింబాబ్వే చేతిలో 2-3తో సిరీస్‌ను కోల్పోవడం కూడా లంకను మానసికంగా కుంగదీస్తున్న అంశం. వీటన్నింటి నేపథ్యంలో అనుభవంలేని కుర్రాళ్లు ఒత్తిడిని ఎలా అధిగమిస్తారన్నది ప్రశ్నార్థకం. దీనికి తోడు కొత్త కెప్టెన్ ఉపుల్ తరంగ వ్యూహాలు ఎలా ఉంటాయన్నది కూడా ఆసక్తికరంగా మారింది. లంక బ్యాటింగ్ భారం మొత్తం కుశాల్ మెండిస్, గుణతిలకపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. సీనియర్ మాథ్యూస్ అందుబాటులో ఉన్నా ఫామ్‌లేమి ప్రతికూలంగా మారింది. డిక్‌వెల్లా, కపుగెడెరా, సిరివర్ధన మెరిస్తేనే భారత్‌కు పోటీ ఇవ్వగలుగుతారు. లసిత్ మలింగ రాకతో బౌలింగ్ వాడి పెరిగినా.. చమీరా, పెరీరా రాణించడంపైనే విజయవకాశాలు ఆధారపడి ఉంటాయి. ఓవరాల్‌గా చాంపియన్స్ ట్రోఫీ ఫలితాన్ని పునరావృతం చేయాలని లంకేయులు గట్టి పట్టుదలతో ఉన్నారు.

హెచ్‌సీఏపై అజర్ ఆగ్రహం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఖేల్ ప్రత్యేక ప్రతినిధి: జస్టిస్ లోధా కమిటీ సిఫారసులకు విరుద్ధంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నడుచుకుంటుందని భారత మాజీ కెప్టెన్ అజారుద్దీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా హెచ్‌సీఏ ఇష్టారీతిన, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. మొయినుద్దౌలా క్రికెట్ టోర్నీకి ఎంపిక చేసిన రెండు జట్లలో అర్హులు లేరని ఆరోపించారు. ఈ జట్లలో హెచ్‌సీఏ రెండురోజుల లీగ్‌లలో త్రిశతకాలు, ద్విశతకాలు చేసిన బ్యాట్స్‌మెన్‌తోపాటు బౌలింగ్‌లో ఐదేసి వికెట్లతో రాణించిన అర్హులైన బౌలర్లను పక్కకు బెట్టారని ధ్వజమెత్తారు. రంజీ సెలక్షన్ కమిటీనే అర్హత లేనిదని కొట్టిపారేశారు. హైదరాబాద్‌లోని మంచి క్రికెటర్లను రంజీ జట్టులోకి తీసుకోకుండా కేవలం సిఫారసుల ఆధారంగా హెచ్‌సీఏ ఎంపిక చేయడం దారుణమన్నారు.జస్టిస్ లోధా సిఫారసుల ప్రకారం సెలక్టర్లు కనీసం 25 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడి ఉండాలని.. ఇప్పుడు కొనసాగుతున్న సెలక్షన్ కమిటీలో మూడు మ్యాచ్‌లాడిన వారు కూడా లేరని ఎద్దేవా చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభ కలిగిన క్రికెటర్లను ఎంపిక చేయడంలో హెచ్‌సీఏ ఘోరంగా విఫలమౌతున్న సందర్భంగానే మన రాష్ట్రంలో మరిన్ని క్రికెట్ అసోసియేషన్లు వస్తున్నట్లు వివరించారు. కాగా, అజర్ ఆరోపణలను హెచ్‌సీఏ అధ్యక్షుడు జీ వివేకానంద్ తీవ్రంగా ఖండించారు. లోధా సిఫారసులను అమలు చేసేందుకు ప్రత్యేక అధికారులు ఉన్నారని.. హెచ్‌సీఏ నిబంధనలు పాటించడం లేదని ఆయన భావిస్తే సుప్రీంకోర్టుకు వెళ్లొచ్చని సూచించారు.

జీఎస్టీతో పెరిగిన టిక్కెట్ల ధర

కోల్‌కతా: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీఎస్టీతో క్రికెట్ మ్యాచ్‌ల టిక్కెట్ల ధరలు అమాంతం పెరిగాయి. భారత్, ఆస్ట్రేలియా మధ్య వచ్చే నెల 21న కోల్‌కతాలో వన్డే మ్యాచ్ జరుగనుంది. దీని కోసం శనివారం బెంగాల్ క్రికెట్ అసోసియేషన్(క్యాబ్) టిక్కెట్ల ధరలను నిర్ణయించింది. రూ.500 కనీస టిక్కెట్ ధరపై 28శాతం జీఎస్టీతో రూ.650 పెరిగిందని క్యాబ్ చీఫ్ గంగూలీ పేర్కొన్నాడు. మరోవైపు ఇదే కోల్‌కతాలో శ్రీలంకతో నవంబర్‌లో జరిగే టెస్ట్ మ్యాచ్‌పై జీఎస్టీ ప్రభావం పడలేదు.

ముగిసిన సానియా, బోపన్న పోరు

న్యూఢిల్లీ: సిన్సినాటీ మాస్టర్స్ టోర్నీలో భారత టెన్నిస్ స్టార్లు సానియా మీర్జా, రోహన్ బోపన్న పోరాటం ముగిసింది. శనివారం జరిగిన డబ్ల్యూటీఏ మహిళల డబుల్స్ సెమీఫైనల్లో సానియా-పెంగ్ షుయి ద్వయం 4-6, 6-7 తేడాతో తైవాన్-రొమేనియా జోడీ సుయివీ, మోనికా చేతిలో ఓడింది. తొలి సెట్‌ను 4-6తో ప్రత్యర్థి జోడీకి చేజార్చుకున్న భారత్-చైనా ద్వయం రెండో సెట్‌లో టై బ్రేక్ కోసం ప్రయత్నించినా లాభం లేకపోయింది. గేమ్‌ను మూడో సెట్ వరకు తీసుకెళ్లకుండా ప్రత్యర్థులు పుంజుకుని మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. మరోవైపు సిన్సినాటీ పురుషుల క్వార్టర్స్‌లో బోపన్న- ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జంట 1-6, 7-6, 7-10 తేడాతో కుబోట్- మార్సెలో మెలో చేతిలో ఓటమిపాలైంది.

తెలుగు టైటాన్స్‌కు ఊరట

యు ముంబాపై విజయం



లక్నో: ప్రొ కబడ్డీ లీగ్ ఐదో సీజన్‌లో ఏడు వరుస పరాజయాలకు చెక్ పెడుతూ తెలుగు టైటాన్స్ మళ్లీ విజయంతో మురిసింది. శనివారం యు ముంబా జట్టుతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో 37-32 పాయింట్లతో గెలిచింది. రైడింగ్‌లో రాహుల్ చౌదరి 13, సోంబిర్ శేఖర్ 8 పాయింట్లు, ట్యాకిలింగ్‌లో 14 పాయింట్లు సాధించారు. యు ముంబా జట్టులో18 రైడింగ్, 9 ట్యాకిలింగ్, 2 ఆలౌట్, 3 ఎక్స్‌ట్రా పాయింట్లు సాధించగా.. తెలుగు టైటాన్స్ జట్టు 18రైడింగ్ , 14ట్యాకిలింగ్, 4 ఆలౌట్, 1 ఎక్స్‌ట్రా పాయింట్‌తో మెరిసింది.

హర్యానా చేతిలో యూపీ యోధ చిత్తు: ఇంటర్ లీగ్ పోరులో భాగంగా యూపీ యోధతో జరిగిన మ్యాచ్‌లో 36-29 స్కోరుతో హర్యానా స్టీలర్స్ ఘన విజయాన్నందుకుంది. స్టార్ రైడర్లు వికాస్ కాందోలా 9, సురేందర్ నదా 7 రైడింగ్ పాయింట్లు సాధించడంతో మ్యాచ్‌లో హర్యానాకు ఎదురేలేకుండా పోయింది. యూపీ జట్టులో రిషాంక్ దేవాదిగ 6, సాగర్ 6 రైడింగ్ పాయింట్లు సాధించినా జట్టు ఓటమిని ఆపలేకపోయారు.

భారత్‌కు 8 పతకాలు

చెన్నై: జోర్డాన్ రాజధాని అమ్మన్‌లో జరుగుతున్న ఆసియన్ జూనియర్ వ్యక్తిగత స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు 8 (2 రజతాలు + 6 కాంస్యాలు) పతకాలు లభించాయి. అండర్-15, 13 ఫైనల్లో నీల్ జోషి, యువరాజ్ వధ్వాని రన్నరప్‌తో రెండోస్థానంలో నిలిచారు. సునయన కురువిల్లా, అషిత ప్రణయ, యోష్ణ సింగ్, అనన్య, నమ్మీ శర్మ, యువన గుప్తా కాంస్య పతకాలు గెలుపొందారు.

గెలుపు దిశగా ఇంగ్లండ్!

బర్మింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి డే నైట్ టెస్టులో ఇంగ్లండ్ జట్టు భారీ విజయం దిశగా సాగుతున్నది. సూపర్ బౌలింగ్‌తో చెలరేగిన ఆతిథ్య జట్టు బౌలర్లు.. కరీబియన్ జట్టును ఫాలోఆన్‌లో పడేశారు. 44/1 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం మూడో రోజు ఆట కొనసాగించిన విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 47 ఓవర్లలో 68 పరుగులకే కుప్పకూలింది. బ్లాక్‌వుడ్ (79 నాటౌట్) ఒక్కడు పోరాడినా సహచరులు ఘోరంగా నిరాశపర్చారు. అండర్సన్ 3, బ్రాడ్, రోలెండ్ జోన్స్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. 346 పరుగుల తొలి ఇన్నింగ్స్ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విండీస్ కడపటి వార్తలందే సరికి 23 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసింది. బ్రాత్‌వైట్ (37 బ్యాటింగ్), చేజ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. పావెల్ (10), కైల్ హోప్ (12), షాహి హోప్ (4) విఫలమయ్యారు.

సత్యనారాయణకు చుక్కెదురు

ద్రోణాచార్య జాబితా నుంచి తొలిగించిన క్రీడా శాఖ

'అర్జున' ఆశ తీరని బోపన్న


సత్యనారాయణ తంగవేలు

న్యూఢిల్లీ: క్రీడా అవార్డుల్లో వివాదం చోటు చేసుకుంది. ద్రోణాచార్య అవార్డుల తుది జాబితా నుంచి పారా స్పోర్ట్స్‌కోచ్ సత్యనారాయణ షిమోగ పేరును తొలిగిస్తూ కేంద్ర క్రీడాశాఖ శనివారం నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ కోర్టులో సత్యనారాయణపై పరువు నష్టం కేసు ఇంకా పెండింగ్‌లో ఉన్న కారణంగా అతని పేరును తీసేసినట్లు క్రీడా శాఖ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. రియో పారాలింపిక్స్ హైజంప్‌లో స్వర్ణం గెలిచిన మరియప్పన్ తంగవేలుకు సత్యనారాయణ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. జాబితా నుంచి పేరును తొలిగించడంపై స్పందించిన కోచ్.. కోర్టు కేసును కారణంగా చూపుతూ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఈనెల 13నే క్రీడాశాఖకు లేఖ రాశానని చెప్పాడు. మరోవైపు తన కోచ్ పేరును అవార్డు కోసం పరిగణనలోకి తీసుకోవాలని తంగవేలు కూడా క్రీడాశాఖకు లేఖ రాశాడు. ఈ నేపథ్యంలో 'పరువు నష్టం కేసు నుంచి బయటపడ్డ తర్వాతే అతని పేరును పరిశీలిస్తాం' అని క్రీడాశాఖ ప్రకటించింది. అర్జున అవార్డుల విషయంలో భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న, వెయిట్ లిఫ్టర్ సంజితా చానుకు మళ్లీ నిరాశే ఎదురైంది. ఈ యేడాది అర్జున అవార్డు కోసం ఎంపిక చేసిన మొత్తం 17 మందిలో వీళ్లిద్దరికి చోటు దక్కలేదు. 2014 ఇంచియాన్ ఆసియా గేమ్స్‌లో స్వర్ణ, రజత పతకంతో ఆకట్టుకున్న తెలుగు కుర్రాడు సాకేత్ మైనేని పేరును అర్జున అవార్డుకు ప్రతిపాదించిన ఏఐటీఏ..బోపన్నను విస్మరించింది. రాజీవ్‌గాంధీ ఖేల్ రత్నకు హాకీ మాజీ కెప్టెన్ సర్దార్‌సింగ్, దేవేంద్ర జాజారియా (జావెలిన్ త్రో)ను పేర్లను ఖరారు చేసింది. పారా అథ్లెట్ దీపా మాలిక్ తన పేరును ఖేల్‌రత్న అవార్డు పరిగణనలోకి తీసుకోవాలంటూ కోరినా..లాభం లేకపోయింది.



శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన స్పోర్ట్స్ సైన్స్ సదస్సులో మాట్లాడుతున్న సాట్స్ చైర్మన్ ఏ వెంకటేశ్వర రెడ్డి. చిత్రంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జీ వివేక్, ఉస్మానియా రిజిస్ట్రార్ జీ గోపాల్‌రెడ్డి, ద్రోణాచార్య ఎస్‌ఎం ఆరిఫ్ తదితరులు.

భారత్ శుభారంభం

ముంబై: ఏఐఎఫ్ఎఫ్ ముక్కోణపు ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత్ శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో 2-1తో మారిషస్‌ను ఓడించింది. భారత్ తరపున రాబిన్ సింగ్ (37వ ని.), బల్వంత్ (62వ ని.) గోల్స్ చేశారు. మకావుతో జరుగనున్న ఆసియా కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌కు సన్నాహకంగా ఈ టోర్నీని ఏర్పాటు చేశారు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన భారత్.. చిన్న పాస్‌లతో ప్రత్యర్థి డిఫెన్స్‌ను ఛేదించింది. 15వ నిమిషంలో సుబ్రతా పాల్ కొట్టిన షాట్ పక్కకు పోవడంతో మారిషస్ ఊపిరి పీల్చుకుంది.


నిజామాబాద్ జిల్లా రాజారామ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ)అండర్ 23 రాష్ట్ర లీగ్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి, టీసీఏ చీఫ్ ప్యాట్రన్ బండారు దత్తాత్రేయ. చిత్రంలో టీసీఏ అధ్యక్షుడు యెండల లక్ష్మీ నారాయణ, టీసీఏ కార్యదర్శి గురువారెడ్డి తదితరులు.